సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 133

శనివారం 28-1-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'




భారత్ జోరుకు బ్రేక్

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20లో టీమిండియా పరాజయం - 13లో



3 నెలల కనిష్టానికి సూచీలు


సెన్సెక్స్ 874 పాయింట్లు క్రాష్. 287 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ - 13లో



అడ్డదారులను నమ్మితే కష్టాలే

పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు షార్ట్‌కట్స్ (అడ్డదారులు) కాకుండా తెలివి తేటలను నమ్ముకోవాలని ప్రధాని మోదీ సూచించారు.

వివరాలు 6లో ▸



'సింధు' ఒప్పందాన్ని మారుద్దాం

ఇరు దేశాల మధ్య ఏళ్ల క్రితం కుదిరిన సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందాన్ని సవరించాలంటూ పాక్‌కు భారత్ నోటీసులు పంపింది.


వివరాలు 6లో ▸



జోడో యాత్రలో భద్రతా లోపం

జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర భద్రతా కారణాల రీత్యా అర్ధంతరంగా నిలిచిపోయింది.

వివరాలు 6లో ▸



భారత్‌కు మరిన్ని చీతాలు

వచ్చే నెలలో భారత్‌కు మరో 12 చీతాలు రాబోతున్నాయి. ఈ మేరకు దక్షిణాఫ్రికా, భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.

వివరాలు 6లో ▸

ప్రజారోగ్యం బలోపేతం

మూడు కీలక కార్యక్రమాల అమలుకు సన్నద్ధం

మార్చి 1 తరువాత పూర్తి స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం

- గోరుముద్దతో వారానికి మూడుసార్లు పిల్లలకు రాగిమాల్ట్
- ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆస్పత్రుల సందర్శన
- ఇంకా ఏమైనా లోపాలు, సమస్యలుంటే ఫీడ్ బ్యాక్‌తో సరిదిద్దేలా చర్యలు
- ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం
- అన్ని టీచింగ్ ఆస్పత్రుల్లో క్యాన్సర్, కార్డియాక్ సదుపాయాలు.. క్యాథ్ ల్యాబ్స్
- రక్తపోటు, మధుమేహం బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ
- ఉద్దానంలో తాగునీటి కోసమే రూ.700 కోట్లు వ్యయం
- పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రిలో పూర్తి సదుపాయాలు
- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం జగన్ దిశా నిర్దేశం
- జాతీయ స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖకు పలు అవార్డులు



> “ సచివాలయ సిబ్బంది తరహాలోనే ప్రతి గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ సిబ్బంది అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించాలి. ప్రతి కుటుంబాన్ని కలుసుకుని విలేజ్ క్లినిక్స్ సేవలను వివరించాలి. విలేజ్ క్లినిక్స్ ఆవశ్యకత, సిబ్బంది అందుబాటులో ఉంటున్న తీరు, సేవలపై ప్రతి కుటుంబానికీ అవగాహన కలగాలి.
>
> \- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడు ప్రధాన కార్యక్రమాలకు మార్చి నెలలో శ్రీకారం చుట్టనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. పూర్తి స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు.. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వాస్పత్రుల సందర్శన.. జగనన్న గోరుముద్ద ద్వారా పిల్లలకు వారంలో మూడు రోజులు రాగి మాల్ట్ పంపిణీ.. ఇలా ఈ మూడు కార్యక్రమాలను మార్చి నెలలో ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను నెలలో రెండు సార్లు వైద్యులు సందర్శిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. 4 వేలు పైబడి జనాభా ఉన్న క్లినిక్‌లను నెలలో మూడు సార్లు సందర్శించేలా చర్యలు చేపట్టామన్నారు. విలేజ్ క్లినిక్స్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్‌లో (ఎస్‌ఓపీ) పారిశుద్ధ్యం, పరిశుభ్రత, తాగునీరు, కాలుష్యం అంశాలను చేర్చామన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి

మిగతా 2వ పేజీలో ▶

ఏది నిజం?

సీమను సుభిక్షం చేస్తున్నదెవ్వరు?

రామోజీ రాత... పరమ రోత

- చంద్రబాబు రెయిన్‌గన్ విన్యాసాలే కరువుపై ఘనమైన యుద్ధాలట.. ఒకే ప్రాజెక్టుకు రెండు సార్లు శంకుస్థాపనలు చేస్తేనే ప్రేమ ఉన్నట్టా?
- 1995– 2004 మధ్య హంద్రీ-నీవాకు బాబు చేసిన ఖర్చు రూ.13.75 కోట్లే
- అది కూడా ఉద్యోగుల జీత భత్యాలు, ఆఫీసుల నిర్వహణకే
- 2004లో హంద్రీ-నీవాను చేపట్టి.. 2009 నాటికే తొలి దశను పూర్తి చేసిన వైఎస్
- రెండో దశ కూడా సింహభాగం పూర్తి.. ఆయన మృతితో దాదాపుగా నిలిచిపోయిన తీరు
- టీడీపీని ఆది నుంచీ గెలిపిస్తున్న హిందూపురం దాహార్తి తీర్చింది వైఎస్సే
- హంద్రీ-నీవా అంచనా వ్యయాన్ని పెంచి, కాంట్రాక్టర్లతో కలిసి దోచేసిన చంద్రబాబు
- చివరకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లోనూ ఖజానాను దోచేసి చేతులు దులుపుకున్న వైనం
- జగన్ అధికారంలోకి వచ్చాక హంద్రీ-నీవా ఫలాలు రైతులకు అందించే దిశగా అడుగులు

4 లో

అలనాటి తార జమున కన్నుమూత



తెలుగువారి సత్యభామగా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన జమున (86) ఇకలేరు. వయోభారం, అనారోగ్య కారణాలతో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన స్వగృహంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తుది శ్వాస విడిచారు. అమెరికాలో ఉంటున్న కుమారుడు వంశీకృష్ణ హైదరాబాద్ రావడానికి ఆలస్యం కావడంతో కుమార్తె స్రవంతి తల్లికి అంత్యక్రియలు నిర్వహించారు.

12 లో

అలిగితివా సత్యభామ..

నన్ను దోచుకొందువటే..

జమున హిట్ సాంగ్స్‌లో కొన్ని..

- వివరాలు 11లో ▶

గ్రూపు–1 ప్రిలిమినరీ ఫలితాలు విడుదల



గ్రూపు–1 ప్రిలిమినరీ రాత పరీక్ష ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 8న ఇందుకు సంబంధించి రాతపరీక్షలు నిర్వహించారు.అయితే, ఏపీపీఎస్సీ చరిత్రలోనే రికార్డు వ్యవధిలో కేవలం 19 రోజుల్లో ఫలితాలు వెల్లడించారు.

- వివరాలు 10లో

తారకరత్నకు గుండెపోటు

- లోకేశ్ పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి.. నడక ప్రారంభించిన పది నిమిషాల్లోనే కుప్పకూలిన తారకరత్న
- అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లిన కార్యకర్తలు.. అయినా పాదయాత్ర కొనసాగించిన లోకేశ్
- యాత్ర కొనసాగింపుపై టీడీపీ నేతల విస్మయం

3 లో



తారకరత్నను అంబులెన్స్‌లో తరలిస్తున్న కార్యకర్తలు

పార్టీ వారసత్వం కోసమే లోకేశ్ పాదయాత్ర

- ఎన్టీఆర్ నుంచి పార్టీని దొంగిలించారు
- చిరంజీవిపై ఉన్న గౌరవంతోనే పవన్‌కు ఆదరణ
- చంద్రబాబు, పవన్‌కు కులాభిమానం
- కుల, మతాలకు అతీతంగా జగన్ పాలన
- మాజీ మంత్రి కొడాలి నాని

3 లో

అబద్ధాల్లో తండ్రిని మించిన తనయుడు లోకేశ్

- పార్టీ చేజారుతుందని భయం
- ఎన్టీఆర్ వారసులు సొంతం చేసుకుంటారని ఆందోళన
- జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తామని చెప్పే దమ్ముందా?
- ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా సీఎం జగన్‌ను మిల్లీమీటరు కదపలేరు: పేర్ని నాని

- వివరాలు 3లో



2 రోజుల్లోనే రూ. 200 కోట్లకు పైగా

బాలీవుడ్ కింగ్‌ఖాన్ షారూక్ ఖాన్, దీపికా పదుకోన్ నటించిన పఠాన్ మూవీ భారీగా వసూళ్లు సాధిస్తోంది. ఈ నెల 25న విడుదలైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే రూ. 200 కోట్లకు పైగా వసూలు చేసింది.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

మేమెలాంటి సర్వే చేయలేదు

- ఎల్లో మీడియాలో ప్రచురితమైంది తప్పుడు కథనం
- ట్విట్టర్‌లో ఐ–ప్యాక్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: ఎల్లో మీడియాలో ప్రచురితమైన 'మంత్రులకు ముచ్చెమటలే' వార్త పూర్తిగా అబద్ధమని ఐ–ప్యాక్ సంస్థ శుక్రవారం ట్విట్టర్‌లో స్పష్టంచేసింది. తాము ఎలాంటి సర్వేలు చేయలేదని తేల్చిచెప్పింది. ఐ–ప్యాక్ సర్వే చేసినట్లు ప్రచురించిన కథనాల్లో వీస మెత్తు కూడా వాస్తవంలేదని ట్వీట్ చేసింది.

మిల్లర్ల దగ్గరకు వెళ్లొద్దు

- ధాన్యం కొనుగోళ్లలో వారికి ప్రమేయం లేదు
- రైతులకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సూచన

సాక్షి, అమరావతి: ఆర్బీకేల్లో ధాన్యం నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించి, ఎఫ్‌టీవో జనరేట్ చేసిన తర్వాత రైతులు మిల్లర్ల దగ్గరకు వెళ్లొద్దని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ కోరారు. రైతులకు అవగాహన కల్పించేలా ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) రశీదు వెనుక నిబంధనలు ముద్రించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లకు ఎలాంటి ప్రమేయం లేదన్నారు. ఎఫ్‌టీవో వచ్చిన తర్వాత తూకంలో, తేమశాతం విషయంలో మిల్లర్లు అభ్యంతరం చెప్పడానికి వీల్లేదని చెప్పారు. మిల్లర్లు తరుగు కింద ధాన్యం తగ్గించినా, రైతుల నుంచి డబ్బులు డిమాండ్‌చేసినా 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

28.48 లక్షల టన్నుల సేకరణ

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 28.48 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హమాలీ కూలీ రేట్ల పెంపు

రాష్ట్రంలో పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న హమాలీలకు హ్యాండ్లింగ్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి అరుణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీఎస్‌లో భాగంగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద సరుకును లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్న హమాలీలకు ప్రస్తుతం క్వింటాకు రూ.22 అందిస్తుండగా, వాటిని రూ.25కి పెంచారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇది రెండోసారి పెంపుకావడం విశేషం. తాజా పెంపుతో ప్రభుత్వంపై ఏటా రూ.9.34 కోట్ల అదనపు భారం పడనుంది.

చిరుధాన్యాల పంపిణీపై దృష్టి

రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు చిరుధాన్యాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ చెప్పారు.

డబ్బింగ్ కళాకారుడు శ్రీనివాసమూర్తి మృతి



సాక్షి, చెన్నై: ప్రముఖ డబ్బింగ్ కళాకారుడు శ్రీనివాసమూర్తి(56) చెన్నైలో శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో ప్రముఖ డబ్బింగ్ కళాకారుడిగా కొనసాగుతున్నారు. విక్రమ్‌కు 'అపరిచితుడు', సూర్యకు 'సింగం'సిరీస్, '24', మోహన్‌లాల్‌కు 'జనతా గ్యారేజ్', జయరామ్‌కు 'అల వైకుంఠపురంలో'.. ఇలా ప్రముఖ నటులకు డబ్బింగ్ చెప్పారు. రాజశేఖర్ హీరోగా నటించిన ఎన్నో సినిమాలకు ఆయన గాత్రం అందించారు. ఈ ఏడాది జనవరి 11న విడుదలైన తమిళ చిత్రం 'తునివు'తెలుగు వెర్షన్ 'తెగింపు'లో అజిత్ పాత్రకు తెలుగు డబ్బింగ్ చెప్పింది కూడా శ్రీనివాసమూర్తే. పలు టీవీ సీరియళ్లకు రచయితగా కూడా చేశారు. ఆయన మృతి పట్ల తెలుగు, తమిళ సినిమా పరిశ్రమ ప్రముఖులు, డబ్బింగ్ ఆర్టిస్టులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసమూర్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ఓడిపోయినప్పటి నుండి చేస్తున్నది అదేగా సార్! మళ్లీ కొత్తగా చేయడం ఎందుకు!!


గగనానికి గార్బేజ్ ముప్పు

భూగోళాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో ఒకటి 'చెత్త'. నానాటికీ పెరుగుతున్న వ్యర్థాలను వదిలించుకునేందుకు చాలా దేశాలు పెద్ద కసరత్తే చేస్తున్నాయి. కాగా.. ఇదే సందర్భంలో అంతరిక్షంలోనూ పేరుకుపోతున్న చెత్త వివిధ దేశాలకు సవాల్ విసురుతోంది. ప్రస్తుతం రోదసిలో 3,409 శాటిలైట్లు చెత్తగా మారిపోయాయి. ఇవికాకుండా దాదాపు 34 వేల స్పేస్ జంక్ ముక్కలు, మిలియన్ల కొద్దీ చిన్నపాటి ముక్కలు అంతరిక్షాన్ని కమ్మేశాయి. 2030 నాటికి రోదసిలో ఉండే శాటిలైట్ల సంఖ్య 58 వేలకు దాటిపోవచ్చని అంచనా. దీనివల్ల గగనతలం భవిష్యత్‌లో పెద్ద ముప్పునే ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

– సాక్షి, అమరావతి

అంతరిక్షంలో 34 వేల యంత్రశకలాలు, రాకెట్ల విడి భాగాల వ్యర్థాలు

- భూ కక్ష్యలో 8,261 భ్రమణం
- ఆ ఉపగ్రహాల్లో 3,409 కాలం చెల్లినవే
- పెరుగుతున్న ప్రయోగాలతో 'స్పేస్ ట్రాఫిక్' సమస్య
- ఆకాశంలో అధిక చెత్త అమెరికా, రష్యా దేశాలదే
- ప్రక్షాళనకు ఇస్రో శాస్త్రవేత్తల సిఫారసులు



గంటకు 17 వేల మైళ్ల వేగంతో ప్రయాణిస్తూ 1997లో హబుల్ టెలిస్కోప్‌ను ఢీకొట్టిన శిథిలం(నాసా విడుదల చేసిన ఫొటో)

అంతరిక్ష ప్రయోగాలు మానవాళి చరిత్రను సమూలంగా మార్చేశాయి. ఉపగ్రహాల (శాటిలైట్స్) వినియోగంతో టీవీ, ఫోన్, ఇంటర్నెట్, జీపీఎస్ తదితర సేవలతో పాటు ఎప్పటికప్పుడు వాతావరణంలో వచ్చే మార్పులను ముందే పసిగట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఒక్క క్లిక్‌తో సమస్త సమాచారాన్ని అరచేతిలో చూడగలుగుతున్నాం. ఇదంతా శాటిలైట్స్ వల్లే సాధ్యమైంది. సోవియట్ యూనియన్ 1957 అక్టోబర్ 4న స్పుత్నిక్ శాటిలైట్ ప్రయోగంతో అంతరిక్ష యుగం మొదలైంది. వివిధ దేశాల ఆధ్వర్యంలో మాత్రమే శాటిలైట్ ప్రయోగాలు కొనసాగగా.. ఇటీవల ప్రైవేట్ కంపెనీలు సైతం ఈ రంగంలోకి ప్రవేశించాయి. ఐక్యరాజ్య సమితి ఔటర్ స్పేస్ అఫైర్స్ విభాగం లెక్కల ప్రకారం 2022 జనవరి నాటికి భూమి చుట్టూ 8,261 ఉపగ్రహాలు తిరుగుతున్నాయి. 'ఆర్యభట్ట'. 1975 ఏప్రిల్ 19న ఆర్యభట్టతో మొదలుపెట్టిన భారత్ ఇప్పటివరకు సుమారు 180 శాటిలైట్స్‌ను అంతరిక్షంలోకి పంపించింది. ఇవికాక సుమారు 38 దేశాలకు చెందిన 350కి పైగా శాటిలైట్లను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. మన దేశ శాటిలైట్లలో 40 వరకు సేవలందిస్తుండగా.. మిగిలినవి విశ్వంలో నిరుపయోగంగా ఉన్నాయి.

నాణేనికి రెండో వైపు..

ప్రపంచ దేశాలు పోటీపడి మరీ పంపిస్తున్న శాటిలైట్లతో అంతరిక్షంలో ట్రాఫిక్ పెరిగిపోతోంది. కాలం చెల్లిన శాటిలైట్లు, రాకెట్ల శిథిలాలతో గగనతలం చెత్తకుప్పగా మారిపోతోంది. యూనియన్ ఆఫ్ కన్సర్న్‌డ్ సైంటిస్ట్స్ (యూసీఎస్) లెక్కల ప్రకారం స్పేస్‌లో ఉన్న మొత్తం 8,261 శాటిలైట్లలో ప్రస్తుతం 4,852 మాత్రమే సేవలందిస్తున్నాయి. మిగిలిన 3,409 శాటిలైట్లు నిరుపయోగమై వ్యర్థాలుగా మారిపోయాయి. ఇవికాకుండా రాకెట్ల నుంచి రాలి పడిన దాదాపు 34 వేల స్పేస్ జంక్ ముక్కలు (10 సెం.మీ కంటే పెద్దవి), మిలియన్ల కొద్దీ చిన్న ముక్కలు అంతరిక్షం చుట్టూ పేరుకుపోయాయి. ఇటీవల అమెజాన్, స్పేస్–ఎక్స్ వంటి ప్రైవేట్ కంపెనీలు అంతరిక్షంలోకి అడుగుపెట్టి శాటిలైట్ల ప్రయోగాలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల వల్ల 2030 నాటికి రోదసిలో శాటిలైట్ల సంఖ్య 58 వేలకు పైగా దాటిపోవచ్చని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే అంతరిక్షంలో స్పేస్ ట్రాఫిక్ పెరిగిపోవడంతోపాటు డెబ్రిస్ (చెత్త)తో నిండిపోతుందని అంచనా.

పెనుసవాల్.. స్పేస్ జంక్

అంతరిక్షంలో ఉపగ్రహాలు తిరిగే వృత్తాకార మార్గాన్ని కక్ష్య (ఆర్బిట్) అంటారు. శాటిలైట్స్‌ను మూడు రకాల ఆర్బిట్స్‌లో ఉంచుతారు. ఇవి భూమి నుంచి 300కి.మీ. వరకు లోయర్ ఆర్బిట్, 700–1,000 కి.మీ వరకు రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ ఆర్బిట్స్, 36 వేల కి.మీ. జియో సింక్రనస్ ఆర్బిట్ (కమ్యూనికేషన్ శాటిలైట్స్) ఉంటాయి. ఏటా వందల సంఖ్యలో శాటిలైట్లను కక్ష్యల్లోకి పంపుతుండటంతో వాటి మధ్య దూరం తగ్గిపోయి స్పేస్ ట్రాఫిక్ ఏర్పడుతోంది. దీంతో కొత్త ఉపగ్రహాలను పంపేటప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతరిక్షంలో రాకెట్ పరికరాల శిథిలాలను స్పేస్ డెబ్రిస్ అంటారు. ఎక్కువ అంతరిక్ష శిథిలాలు 600–700 కి.మీ. పరిధిలోనే ఉన్నాయి. సాఫ్ట్‌బాల్ పరిమాణంలో 34 వేల స్పేస్ డెబ్రిస్ శిథిలాలు ఉన్నాయని, ఒక మిల్లీమీటర్ కంటే పెద్ద పరిమాణంలో 128 మిలియన్ల శిథిలాలు ఉన్నాయని నాసా ప్రకటించింది. ప్రతి 10 వేల శిథిలాలలో ఒకటి ప్రమాదానికి కారణమవుతుందని అంచనా వేసింది. ఇలాంటి శిథిలాలు 1999 నుంచి ఇప్పటిదాకా 25 ఐఎస్ఎస్‌ను తాకినట్టు స్పేస్ శాస్త్రవేత్తలు గుర్తించారు. మరోపక్క అంతరిక్ష వ్యర్థాలు విచ్ఛిన్నమై రేణువుల్లా విడిపోయి అంతరిక్ష కక్ష్యను కలుషితం చేస్తున్నాయి. ఈ వ్యర్థ రేణువుల్లో కొన్ని గంటకు 40 వేల కి.మీ. పైగా వేగంతో భూకక్ష్య వైపు దూసుకొస్తున్నాయి.

'నాసా' ట్రాక్ చేస్తోంది

స్పేస్‌లోకి వెళ్లిన ప్రతి వస్తువుకు పొజిషనింగ్ నంబర్ ఇచ్చి వాటి కదలికలను అనుక్షణం 'నాసా' ట్రాక్ చేస్తోంది. దీనినే స్పేస్ సర్వేలెన్స్ నెట్‌వర్క్ ట్రాకింగ్ అంటారు. నాసా అంచనా ప్రకారం ప్రతి రోజు ఒక శిథిలం భూమి వైపు దూసుకొస్తోంది. అది నేలపై పడటమో లేదా వాతావరణంలోకి ప్రవేశించగానే మండిపోవడమో జరుగుతోంది. రాబోయే సంవత్సరాల్లో అంతరిక్ష శిథిలాల సంఖ్య లక్షకు పైగా పెరుగుతుందని, ఇవి ట్రాక్ చేయడానికి చిన్నవే అయినా అంతరిక్ష నౌకను దెబ్బతీసేంత పెద్దవని యూఎస్ మిలటరీ సైతం ప్రకటించింది. అంతరిక్ష యాత్రకు ప్రాణాంతకం లేదా విపత్తు కలిగించే వేల వస్తువులు, నష్టాన్ని కలిగించేంత సామర్థ్యం గలవి మిలియన్ల కొద్దీ ఉన్నాయని అంచనా వేసింది. జియో సింక్రనస్ ఆర్బిట్‌లో భారీ బరువుండే ఉప గ్రహాలుంటాయి. ఈ ఆర్బిట్‌లోని పనికిరాని శాటిలైట్లను పైస్థాయికి పంపేస్తారని.. ఇక్కడ డెబ్రిస్‌ని అంచనా వేయలేమని 'షార్' మాజీ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ చెప్పారు. అయితే, అధిక 'డెడ్ శాటిలైట్లు', శిథిలాలు 600–700 కి.మీ. పరిధిలోనే ఉన్నాయని, ఇవే ప్రధాన సమస్య అని ఆయన స్పష్టం చేశారు.

శిథిలాల తొలగింపునకు అంతర్జాతీయ కమిటీ

వాస్తవానికి అంతరిక్ష వ్యర్థాల్లో మూడింటి ఒక భాగం అమెరికా, రష్యాలవే. వేల కి.మీ. వేగంతో తిరుగుతున్న డెడ్ శాటిలైట్లు, రాకెట్ శిథిలాలను తొలగించడం కత్తిమీద సాములా మారింది. దీంతో అమెరికా వివిధ దేశాల స్పేస్ శాస్త్రవేత్తలతో 1993లో ఇంటర్ ఏజెన్సీ స్పేస్ డెబ్రిస్ కో–ఆర్డినేషన్ కమిటీని నియమించింది. ఐక్యరాజ్య సమితి 1959లోనే 'ఔటర్ స్పేస్ శాంతియుత ఉపయోగాల కమిటీ' (యూఎన్–సీఓపీయూఓఎస్)ని నియమించింది. ఈ రెండు కమిటీల్లోనూ భారత్ ప్రారంభ సభ్యదేశంగా ఉంది. ఈ కమిటీల్లోని శాస్త్రవేత్తలు అంతరిక్ష శిథిలాల తొలగింపుపై ఓ నివేదికను రూపొందించాయి. దీనిప్రకారం అధునాతన రాడార్లు, టెలిస్కోపులను ఉపయోగించి అంతరిక్ష వ్యర్థాలను పసిగట్టి ముందస్తు హెచ్చరికలు చేస్తుంటారు. కాలం చెల్లిన శాటిలైట్లను కక్ష్య నుంచి తప్పించి భూ వాతావరణంలోకి తెచ్చే యోచన జరుగుతోంది. స్పేస్ డెబ్రిస్‌ను తొలగించే యంత్రాంగం ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్దా లేదు.

– ఎంవైఎస్ ప్రసాద్, మాజీ డైరెక్టర్, షార్





గవర్నర్, ముఖ్యమంత్రితో నౌకాదళాధికారుల భేటీ

సాక్షి, అమరావతి: గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నౌకాదళ అధికారులు శుక్రవారం వేర్వేరుగా భేటీ అయ్యారు. తూర్పు తీర రక్షక దళ కమాండర్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ శివమణిపరమేశ్, ఏపీ కోస్ట్ గార్డ్ కమాండర్ యోగీందర్‌ఢాకా విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలోని తూర్పు తీర నౌకాదళ ప్రధాన కేంద్రాన్ని సందర్శించాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. తీరప్రాంతం నుంచి చొరబాట్లను సమర్థంగా తిప్పికొట్టాలని వారికి గవర్నర్ సూచించారు. అలాగే తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో శివమణిపరమేష్ సమావేశమయ్యారు. తూర్పు సముద్ర తీరంలో సముద్ర భద్రతకు సంబంధించి తలెత్తుతున్న సవాళ్లను అధిగమించేందుకు తీర రక్షక దళం చేపట్టిన వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులు డీఐజీ యోగేందర్ ఢాకా, కమాండెంట్ కే.మురళి, డిప్యూటీ కమాండెంట్ ఏబీ రామమ్ ఉన్నారు.

ప్రజారోగ్యం బలోపేతం



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

బాధితులకు వైద్యం అందించడంలో భాగంగా స్క్రీనింగ్, చికిత్సలపై సిబ్బందికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు. సీఎం జగన్ పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

ప్రజారోగ్య వ్యవస్థ మరింత బలోపేతం

ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు మార్చి 1 నుంచి ఆస్పత్రులను సందర్శించడం ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకుని ఇంకా ఏమైనా లోపాలు, సమస్యలుంటే పరిష్కరించేలా చర్యలు చేపట్టవచ్చు. ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఆస్పత్రుల్లో డబ్ల్యూహెచ్‌వో/జీఎంపీ అధీకృత మందులు, సర్జికల్స్ మాత్రమే ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాం. దీన్ని పటిష్టంగా అమలు చేయాలి. మందులకు కొరత ఉందన్న మాటే వినిపించకూడదు. ప్రజారోగ్య వ్యవస్థలో మనం దేశానికి ఆదర్శంగా నిలవాలి. ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్ ఇప్పటికే కొనసాగుతోంది. ఇందులో గుర్తించిన సమస్యలు, లోపాలను సరిదిద్దుకుని మార్చి 1వతేదీ తర్వాత పూర్తి స్థాయిలో అమలు చేసేలా సన్నద్ధం కావాలి.

సచివాలయాల స్థాయిలోనే రక్తహీనత గుర్తింపు

గ్రామ సచివాలయాల స్థాయిలోనే రక్తహీనత బాధితులను గుర్తించి ఆరోగ్య సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి. రక్తహీనత నివారణకు వైద్యం, పౌష్టికాహారపరంగా అన్ని చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మధ్య పూర్తి సమన్వయం ఉండాలి. డేటా అనుసంధానాన్ని సమర్థంగా చేపట్టాలి. పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు పరస్పరం అనుసంధానమై తల్లులు, పిల్లల్లో రక్తహీనత లాంటి సమస్యలను పూర్తిగా నివారించాలి. కౌమార బాలికలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు బీ–12 సబ్ లింగ్యువల్ టాబ్లెట్లను పంపిణీ చేయాలన్న నిపుణుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలి.

పాఠ్య ప్రణాళికలో ఆరోగ్య అంశాలు

పరిసరాల పరిశుభ్రత, సమతులాహారం, వ్యాయామం ఇతర ఆరోగ్య అంశాలను పాఠ్య ప్రణాళికలో చేర్చాలి. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, కాలుష్యం తదితరాలకు సంబంధించి విలేజ్ క్లినిక్స్ సిబ్బంది సమస్యలను నివేదించగానే చర్యలు చేపట్టేలా వ్యవస్థలను సిద్ధం చేయాలి. మండల స్థాయి అధికారులు, జేసీ, జిల్లా కలెక్టర్ వీటిపై పర్యవేక్షణ చేయాలి. 108, 104ల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి రోజూ సమీక్షించాలి. కలెక్టర్లు పర్యవేక్షించాలి.

ఎన్‌సీడీ బాధితులపై ప్రత్యేక శ్రద్ధ

గుండె జబ్బులు, క్యాన్సర్, బీపీ, మధుమేహం లాంటి నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) నియంత్రణ, నివారణ, చికిత్సలపై దృష్టి సారించాలి. బాధితుల ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలి. క్రమం తప్పకుండా మందులు తీసుకుంటున్నారో లేదో ఆరా తీయాలి. అవుట్ రీచ్ ప్రోగ్రామ్ ద్వారా బాధితులను కలిసి ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించాలి. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన పేషెంట్లు డిశ్చార్జి అనంతరం ఇంటికి చేరుకున్నాక ఏఎన్ఎంలు వారిని పరామర్శించి ఆస్పత్రి సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. ఆ నివేదిక ఆధారంగా ఆస్పత్రులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

క్యాన్సర్‌కు అధునాతన చికిత్స

ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో క్యాన్సర్‌కు అధునాతన చికిత్స, మౌలిక సదుపాయాలను కల్పించాలి. ప్రస్తుతమున్న, కొత్తగా నిర్మిస్తున్న బోధనాస్పత్రుల్లో ఈ పరికరాలు, చికిత్సలు ఉండాలి. గుండె జబ్బుల చికిత్స కేంద్రాలుండాలి. అన్ని చోట్ల క్యాథ్ ల్యాబ్స్ పెట్టాలి. నిర్మాణం పూర్తవుతున్న కొద్దీ కొత్త బోధనాస్పత్రుల్లో ఇవి ఏర్పాటు కావాలి. అన్ని టీచింగ్ ఆస్పత్రుల్లో క్యాన్సర్, కార్డియాక్ సదుపాయాలు ఉండాలి. ఈ సౌకర్యాలను మెరుగు పరచుకోవడం ద్వారా క్యాన్సర్, గుండె స్పెషాలిటీల్లో మరిన్ని పీజీ సీట్లు సాధించేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా రాష్ట్రంలోనే సరిపడా వైద్య నిపుణులు తయారవుతారు. దంత సంరక్షణపై చిన్నారులు, పాఠశాల విద్యార్థుల్లో అవగాహన కల్పించాలి. స్క్రీనింగ్ నిర్వహించి చికిత్స అందించడంపై ఆలోచన చేయాలి. రోగులకు మరింత నాణ్యతతో, మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలి.

ఉద్దానం కిడ్నీ జబ్బులకు శాశ్వత పరిష్కారాలు

కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాం. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ జబ్బుల నివారణలో భాగంగా తాగునీటి కోసమే దాదాపు రూ.700 కోట్లు ఖర్చు పెడుతున్నాం. పాలకొండ ప్రాంతంలో తాగునీటికి సుమారుగా రూ.265 కోట్లు వ్యయం చేస్తున్నాం. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రిని నిర్మిస్తున్నాం. తాగునీటి పథకం, ఆస్పత్రి ఈ రెండూ మార్చికల్లా పూర్తవుతాయని అధికారులు నాకు సమాచారం ఇచ్చారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల సమస్యకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారాలు చూపుతోంది. పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలి. ఉద్దానంలో కిడ్నీ వ్యాధి సమస్య నివారణ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు.

జాతీయ స్థాయిలో వైద్య శాఖకు అవార్డులు



అవార్డులు సాధించిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్

జాతీయ స్థాయిలో కాగిత రహిత వైద్య సేవల్లో రాష్ట్ర వైద్య శాఖ ఐదు అవార్డులు సాధించినట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, అధికారులు తెలియచేయగా సీఎం జగన్ వారిని అభినందించారు. రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌కేఎస్‌కే)–స్కూల్ వెల్నెస్ కార్యక్రమం అమలులో జాతీయ స్థాయిలో ఇటీవల వైద్య శాఖకు లభించిన రెండు అవార్డులను సీఎం పరిశీలించారు. సమీక్షలో సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ నివాస్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ మురళీధర్‌రెడ్డి, డీఎంఈ, ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్, ఔషధ నియంత్రణ డీజీ రవిశంకర్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

అదనపు జడ్జీలుగా జోతిర్మయి, గోపాలకృష్ణారావు బాధ్యతల స్వీకారం

ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా





జస్టిస్ జోతిర్మయి, జస్టిస్ గోపాలకృష్ణారావులతో ప్రమాణం చేయిస్తున్న హైకోర్టు సీజే

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా ప్రతాప వెంకట జోతిర్మయి, వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరి చేత ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా ప్రమాణం చేయించారు. అంతకు ముందు వీరి నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీచేసిన నియామక ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. ప్రమాణస్వీకారం అనంతరం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కలిసి జస్టిస్ జోతిర్మయి కేసులను విచారించారు. జస్టిస్ గోపాలకృష్ణారావు మరో న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరితో కలిసి కేసులను విచారించారు. వీరిద్దరి నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 32కు చేరింది. మిగిలిన ఐదు ఖాళీలను న్యాయవాదుల కోటా నుంచి త్వరలో భర్తీ చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో న్యాయమూర్తులు, కొత్త న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా శారదాపీఠం వార్షికోత్సవాలు

- పీఠాధిపతి స్వరూపానందేంద్ర, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర ఆధ్వర్యంలో ఉత్సవాలకు అంకురార్పణ
- ఐదు రోజులు జరిగే రాజశ్యామల యాగం ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం (పెందుర్తి): విశాఖ శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సారధ్యంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఉదయం మహా గణపతిపూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. స్వామీజీలు యాగశాల ప్రవేశం చేసి ఐదు రోజులపాటు జరిగే పీఠం అధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారి యాగ క్రతువును ప్రారంభించారు. రాజస మంత్రంతో హవన పూర్వకంగా తొలిరోజు ఈ యాగాన్ని నిర్వహించారు. టీటీడీ ఐదు రోజుల పాటు నిర్వహించనున్న చతుర్వేద హవనం కూడా విశేషంగా ప్రారంభమైంది. పెద్ద ఎత్తున వేద పండితులు ఈ హవనంలో పాల్గొన్నారు. మేధా దక్షిణామూర్తి హోమం నిర్వహించారు. పండితులకు స్వామీజీలు దీక్షా వస్త్రాలను అందజేశారు. ఇప్పటికే పంజాబ్ గవర్నర్ బన్వర్‌లాల్ పురోహిత్ శారదాపీఠానికి చేరుకున్నారు. తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ కూడా పీఠం సందర్శనకు రానున్నారు. 30న ఏపీ, తెలంగాణ, హరియాణ గవర్నర్లు విశ్వభూషణ్ హరిచందన్, తమిళిసై, బండారు దత్తాత్రేయ పాల్గొంటారు.

ఉపాసనాశక్తితో నిర్మితమైనది శారదాపీఠం

ఉపాసనాశక్తితో నిర్మితమైనది శారదాపీఠమని, పూర్వీకుల ఆస్తిపాస్తులతో ఏర్పడిన పీఠం కాదని స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. స్వామీజీ శారదాపీఠం ఆవిర్భావం గురించి వివరించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అనుగ్రహంతో యావత్ భారతావనిలోనే శక్తివంతమైన పీఠంగా శారదాపీఠం గుర్తింపు పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దగ్గర నుంచి అనేక మంది విశాఖ శారదా పీఠం ద్వారా మహిమలు చూశారని తెలిపారు. పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా చాత్తాద వైష్ణవ ఆగమ సదస్సును విశేషంగా నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న స్వామీజీ మాట్లాడుతూ.. ఆగమం లేకుంటే దేవుడే లేడని, ఆలయాల్లో ఆగమ విధానాలు అమలు చేయడానికి పాటుబడింది విశాఖ శ్రీ శారదాపీఠమని స్వామీజీ గుర్తుచేశారు. ఆగమం తెలియకుండా అర్చకులు గర్భాలయాల్లోకి ప్రవేశించకూడదన్నారు. పక్కాగా ఆగమాన్ని అనుసరిస్తున్న ఆలయాల్లో తిరుమల తిరుపతి ముందువరుసలో ఉంటుందని ప్రశంసించారు. మహా మహోపాధ్యాయ చిర్రాపూరి శ్రీరామశర్మ, ఆకెళ్ల విభీషణశర్మ తదితర పండితులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు తెలిసేలా 'ఉపాధి'

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలులో మరింత పారదర్శకతను పెంచడం ద్వారా అక్రమాల అడ్డుకట్టకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పథకం వివరాలతో పాటు ఏ రోజు ఏ పనిలో ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారన్న సమాచారం కూడా కూలీలు పని చేసే సమయంలోనే ఆ గ్రామ పరిధిలోని ప్రజాప్రతినిధులందరికీ తెలిసేలా గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటుచేయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. వీటిల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు మొదలు ఎంపీపీలు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీలు సహా ఆయా పదవులకు పోటీచేసి ఓడిపోయిన ప్రత్యర్థి పార్టీల నేతలను కూడా ఈ వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులుగా ఉంటారు. గ్రామస్థాయిలో ఉపాధి హామీ పథకం కార్యక్రమాలను పర్యవేక్షించే ఫీల్డు అసిస్టెంట్‌లు ఆయా గ్రూపులకు అడ్మిన్‌గా ఉంటారు.

కేంద్ర పోర్టల్‌తో అనుసంధానం

మరోవైపు.. దేశవ్యాప్తంగా ఏర్పాటయ్యే ఈ వాట్సాప్ గ్రూపులన్నీ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌కు అనుసంధానమై ఉంటాయి. ఉపాధి పనుల వివరాలు ఎప్పటికప్పుడే ఆ పోర్టల్‌లో రికార్డు అవుతుంటాయి. ఏపీలో 13,476 గ్రామ పంచాయతీల స్థాయిలో ఉపాధి హామీ పథకం అమలు జరుగుతుండగా.. అందులో 12,945 గ్రామాల్లో వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు ప్రక్రియ ముగిసినట్లు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా...

తిరుమలలో నేడు రథసప్తమి

ఏడు వాహనాలపై విహరించనున్న శ్రీవారు



మాడవీధుల్లో ఏర్పాటుచేసిన పందిళ్లు

తిరుమల: తిరుమలలో సూర్య జయంతి సందర్భంగా శనివారం రథసప్తమి జరుగనుంది. ఒక రోజు బ్రహ్మోత్సవంగా ప్రసిద్ధి పొందిన రథసప్తమి నాడు వేంకటేశ్వర స్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనం, చిన్న శేషవాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్షవాహనం, సర్వభూపాల వాహనం, చంద్రప్రభవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. రథసప్తమి సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శనాలు నిలిపివేసింది. రథసప్తమికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. దర్శన టికెట్లు లేని వారికి 36 గంటల సమయం పడుతోంది.

నేడు సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు రద్దు

జనవరి 28న తిరుపతిలోని కౌంటర్లలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను టీటీడీ రద్దు చేసింది. భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2 ద్వారా స్వామివారిని దర్శనం చేసుకోవాల్సి ఉంటుంది.

టీటీడీ మొబైల్ యాప్ ప్రారంభం



మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి

తిరుమల: భక్తులకు మరింత మెరుగైన డిజిటల్ సేవలు అందించేందుకు ప్రయోగాత్మకంగా 'టీటీ దేవస్థానమ్స్' పేరుతో రూపొందించిన మొబైల్ యాప్‌ను టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. తిరుమల అన్నమయ్య భవనంలో చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ భక్తుల కోసం ఇప్పటివరకు గోవింద మొబైల్ యాప్ ఉండేదని, దీన్ని మరింత ఆధునీకరించి మరిన్ని అప్లికేషన్లు పొందుపరచి నూతన యాప్‌ను రూపొందించామని తెలిపారు. ఈ మొబైల్ యాప్ ద్వారా భక్తులు తిరుమల శ్రీవారి దర్శనం, సేవలు, వసతి, అంగప్రదక్షిణ, సర్వదర్శనం, శ్రీవారి సేవ బుక్ చేసుకోవచ్చన్నారు. విరాళాలు కూడా ఇదే యాప్ నుంచి అందించవచ్చని చెప్పారు. ఎస్వీబీసీ ప్రసారాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఈ యాప్ ద్వారా చూడవచ్చని తెలిపారు. జియో సంస్థ సహకారంతో టీటీడీ ఐటీ విభాగం ఈ యాప్‌ను రూపొందించినట్లు వివరించారు. సామాన్య భక్తులకు స్వామివారి సేవలు, దర్శనం, టికెట్లు, వసతి సులువుగా అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా క్లౌడ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని తెలిపారు. నూతన యాప్ సేవలపై భక్తుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అవసరమైతే మరిన్ని పొందుపరుస్తామని చెప్పారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ భక్తులు లాగిన్ అయ్యేందుకు యూజర్ నేమ్‌తోపాటు ఓటీపీ ఎంటర్ చేస్తే చాలని, పాస్‌వర్డ్ అవసరం లేదని చెప్పారు. తిరుమల శ్రీవారి ఆలయ బంగారు తాపడం పనులను ఐదు నుంచి ఆరు నెలలు వాయిదా వేస్తున్నామని, త్వరలో మరో తేదీ నిర్ణయిస్తామని వెల్లడించారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్, జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనీష్ షా, ఐటీ సలహాదారు అమర్, ఐటీ జీఎం సందీప్ పాల్గొన్నారు.

లోకేశ్‌ది ఐరన్ లెగ్

852వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: అమరావతి ఉద్యమం నీరుగారడంతో బాబు అండ్ కో అసహనం వ్యక్తం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 852వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఐరన్ లెగ్ లోకేశ్.. నాడు కుప్పంలో ప్రచారం చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పూర్తిగా ఓడిపోయిందని, పాదయాత్ర ప్రారంభించిన వెంటనే తారకరత్నకు గుండెపోటు వచ్చిందన్నారు. టీడీపీతోపాటు నందమూరి వంశాన్ని కూడా నాశనం చేసేందుకు తండ్రీకొడుకులు కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కొండెక్కి వస్తుంది.. ప్రాణం పోస్తుంది

గిరిపుత్రుల కోసం బైక్ అంబులెన్స్‌లు

- అడవుల్లో కాలిబాట ఉంటే చాలు అత్యవసర వైద్యానికి తరలింపు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు త్వరలో అందుబాటులోకి
- తొలి దశలో 108 బైక్ అంబులెన్స్‌ల కొనుగోలుకు టెండర్లు
- ప్రపంచంలోనే తొలిసారి ద్విచక్ర వాహనంతో కూడిన అంబులెన్స్ ప్రవేశపెడుతున్న ఏపీ

అత్యవసర వైద్యానికి అభయమిచ్చే అంబులెన్స్‌లు ఎత్తైన కొండలు.. గుట్టల్ని దాటుకుని అరణ్యాల్లోనూ ఇకపై దౌడు తీయనున్నాయి. కాలిబాట ఉంటే చాలు.. ఎన్ని కొండల అవతల ఉన్నా ఆపత్కాలంలో చిక్కుకున్న గిరిజనులను ఆదుకునేలా వినూత్న ఆవిష్కరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు త్వరలోనే 'బైక్ అంబులెన్స్' సాకర్యం అందుబాటులోకి రాబోతోంది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: మారుమూల పల్లెలకు సైతం 108, 104 సేవలను అందుబాటులోకి తెచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిరుపేదల పాలిట ప్రాణదాతగా నిలిచారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడినా.. ఎక్కడ ప్రమాదం జరిగినా 'కుయ్.. కుయ్..'మంటూ రయ్యిన అంబులెన్స్‌లు వచ్చి వాలిపోయేలా చేసిన ఘనత వైఎస్‌కే దక్కింది. ఆయన తనయుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 108, 104 సేవలను మరింత ముమ్మరం చేశారు. 108 అంబులెన్స్‌లు, ఫీడర్ అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని మారుమూల కొండ ప్రాంతాలకు సైతం వెళ్లేలా బైక్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. కొండలు, గుట్టలు దాటి గిరిజనుల చెంతకు వెళ్లేలా కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ అల్లూరు గోపాలకృష్ణ రూపొందించిన బైక్ అంబులెన్స్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాలకు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలు చేపట్టారు. ఈ వినూత్న కార్యక్రమం త్వరలో సాకారం కానుంది. తొలి దశలో 108 బైక్ అంబులెన్స్‌లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది. ఈ బైక్ అంబులెన్స్ వాహనం డ్రైవింగ్‌తో పాటు కనీస వైద్య సేవలందించేలా శిక్షణ ఇచ్చేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మారేడుమిల్లి ఘటనతో చలించిపోయి..

ఏజెన్సీ ప్రాంతాల్లో అంబులెన్స్‌లు వెళ్లే దారిలేక సకాలంలో వైద్యమందక కొండలపై ఉండే గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న కాలంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని మారేడుమిల్లి మండలం చాపరాయిలో 12 మంది మృతిచెందారు. ఆ విషాదకర ఘటనను చూసి చలించిపోయిన జగన్ గిరిజనుల ప్రాణాలు కాపాడేందుకు ఏదో ఒక ప్రత్యామ్నాయం ఉండాలని పరితపించారు. అందుకనుగుణంగానే గతేడాది నుంచి ప్రత్యామ్నాయ అంబులెన్స్ తీసుకురావాలనే ప్రయత్నంలో ప్రాజెక్టు రూపకల్పన బాధ్యతను జేఎన్‌టీయూ(కాకినాడ)కి అప్పగించారు. ఈ నేపథ్యంలోనే జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోపాలకృష్ణ పట్టుదలతో ద్విచక్ర వాహనాన్ని తలపించే బైక్ అంబులెన్స్‌ను ఆవిష్కరించారు. ప్రపంచంలోనే ద్విచక్ర వాహనంతో కూడిన అంబులెన్స్ సిద్ధం చేయడం ఇదే తొలిసారి కావడంతో దీనికి పేటెంట్ హక్కులు కూడా లభించాయి. ఇంతవరకు కొండలపై ఉండే గిరిజన తండాలలో వైద్య సేవలకోసం మూడు చక్రాల(ఫీడర్) అంబులెన్స్‌లను వినియోగిస్తున్నారు. అసలు రహదారి అంటూ లేకుండా కొండలపై నివసించే గిరిజనుల వద్దకు నేరుగా వెళ్లి వైద్య సేవలందించేందుకు వీలుగా బైక్ అంబులెన్స్‌ను రూపొందించారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా చింతలగూడెంలో గర్భిణులను తరలించడం ద్వారా వీటికి ట్రయల్ రన్ కూడా పూర్తయ్యింది. ఈ వినూత్న ఆవిష్కరణను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. ఇందుకోసం రూ.5 కోట్లను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించింది.

యాప్‌తో జీపీఎస్‌కు అనుసంధానం

బైక్ అంబులెన్స్‌ను పర్యవేక్షించేందుకు ప్రత్యేక యాప్ రూపొందించారు. ఈ యాప్‌ను జీపీఎస్‌కు అనుసంధానించడంతో రోగుల సమాచారం సమీపంలోని పీహెచ్‌సీ లేదా 108 వాహనాలకు వివరాలను చేరవేస్తుంది. 4 జీబీ ర్యామ్, 14 జీబీ స్టోరేజ్ కలిగిన 7.1 ఇంచ్ టచ్ స్క్రీన్ డిస్‌ప్లేతో కూడిన చిప్, శాటిలైట్ బేస్ నెట్‌వర్కింగ్ సిస్టమ్ ఇందులో ఉంటాయి. పేషెంట్ వచ్చేలోపు వైద్యానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తారు. అత్యవసరమైతే డాక్టర్‌తో వీడియో కాల్‌చేసే సౌకర్యం ఇందులో ఉంది. వాహనానికి దుమ్ము, వర్షం, ఎండ నుంచి రక్షణకు టాప్ ఏర్పాటు చేశారు. అంబులెన్స్ లైట్లు, సైరన్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, యాంటీ స్కిడ్డింగ్, ట్యూబ్‌లెస్ టైర్లు, రక్త పరీక్షల నమూనా కోసం కోల్డ్‌స్టోరేజ్ కంటైనర్, మోటార్ యాక్టివేటెడ్ స్టాండ్ ఉంటాయి. ప్రథమ చికిత్సకు అవసరమైన అన్ని పరికరాలు, మందులు ఇందులో ఉంటాయి.



బైక్ అంబులెన్స్

భళా.. బైక్ అంబులెన్స్

సాధారణంగా నాలుగు చక్రాల అంబులెన్స్ ప్రయాణించాలంటే కనీసం 6 అడుగులు రోడ్డు మార్గం ఉండాలి. అదే 3 చక్రాల ఫీడర్ అంబులెన్స్‌కు 3 నుండి 4 అడుగుల రోడ్డు మార్గం ఉండాలి. రెండు చక్రాలతో నడిచే ఈ బైక్ అంబులెన్స్‌కు అడుగు నుంచి అడుగున్నర దారి లేదా కాలిబాట ఉన్నా సులభంగా ప్రయాణిస్తుంది. కొండలు, గుట్టల్ని కూడా ఎక్కేస్తుంది. డ్రైవింగ్ సీటు వెనుక పేషెంట్ కూర్చునేందుకు వీలుగా ఒక సీటును 90 డిగ్రీల కోణంలో రౌండ్‌గా తిరిగేలా అమర్చారు. 110 డిగ్రీల కోణంలో వెనుకకు వంగి సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేశారు. రోగి కూర్చున్న వెంటనే లాక్ అయ్యేలా ఆటోమేటిక్ లాకింగ్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేశారు. ఈ వాహనం వ్యయం రూ.4 లక్షలు అవుతుంది. ఇందుకు బజాజ్ కంపెనీకి చెందిన అవెంజర్ వాహనాన్ని ఎంపిక చేశారు. టైమ్ షెడ్యూల్, అలారమ్ కోడ్స్, పానిక్ బటన్ (వైద్య అవసరాన్ని బట్టి వినియోగించే ఎరుపు, పసుపు, నీలం)ఏర్పాటు చేశారు.

వైద్యచరిత్రలో మైలురాయిగా నిలుస్తుంది..



బైక్ అంబులెన్స్ ద్వారా కార్డియాక్ అరెస్ట్, పెరాలసిస్ వంటి గుండె సంబంధిత రోగులకు తక్షణ వైద్యం అందించే అవకాశం లభిస్తుంది. యూనివర్సిటీలో ఉన్న డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా బైక్ అంబులెన్స్‌ను రూపొందించడం సంతోషంగా ఉంది. ఇది వైద్య చరిత్రలో ప్రభుత్వానికి మైలురాయిగా మిగులుతుంది. ఇప్పటివరకు దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ తరహా ఆలోచన చేయలేదు. తొలిసారి మన రాష్ట్రంలో చేపట్టిన ఈ వినూత్న బైక్ అంబులెన్స్ ఇతర రాష్ట్రాల్లో కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్నాయి.

– ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్, జేఎన్‌టీయూ కాకినాడ

పొగాకు పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు తేవాలి

భారత వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ, డాక్టర్ ఆర్‌కే సింగ్, డాక్టర్ శేషుమాధవ్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్) : అధిక దిగుబడులిచ్చే స్వల్ప కాలిక రకాలను అభివృద్ధి చేసి పొగాకు పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు తేవాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్(క్రాప్ సైన్సెస్) డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ శాస్త్రవేత్తలను కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ(సీటీఆర్ఐ)లో ఐసీఏఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం పొగాకుపై అఖిల భారత నెట్‌వర్క్ ప్రాజెక్ట్ 12వ గ్రూపు సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశాలకు సీటీఆర్ఐ డైరెక్టర్, ఏఐఎన్‌పీటీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అధ్యక్షత వహించారు. డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ ముఖ్య అతిథిగాను, ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్(వాణిజ్య పంటలు) డాక్టర్ ఆర్‌కే సింగ్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తిలక్‌రాజ్‌శర్మ మాట్లాడుతూ పంటల సాగులో ఎదుర్కొనే పలు సమస్యలకు పరిష్కారాలను కనుగొని వివిధ వ్యవసాయ పరిశోధనలకు కేంద్ర బిందువుగా ఐసీఏఆర్ పనిచేస్తోందన్నారు. వాతావరణంలో ప్రతికూలతలను, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను రూపొందించడంలో శాస్త్రవేత్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. పొగాకు క్యూరింగ్ కోసం శక్తి వనరుగా సౌరశక్తిని సమర్థంగా వినియోగించడం ద్వారా కలపవాడకాన్ని తగ్గించవచ్చన్నారు. పొగాకుతో పాటు పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధలో పంటకోత అనంతర యాజమాన్యం, విలువ జోడింపుపై దృష్టిని కేంద్రీకరించాలని తిలక్‌రాజ్‌శర్మ కోరారు. పొగాకు రంగం పరిశోధనలపై ప్రచురించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు.

నేడు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జాతీయ విక్రేతల సదస్సు

మేనేజ్‌మెంట్‌తో నేరుగా మాట్లాడనున్న సుమారు 250 మంది విక్రేతలు

సాక్షి, న్యూఢిల్లీ : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జాతీయ విక్రేతల ముఖాముఖి సదస్సు మొదటిసారి జరుగనుంది. శనివారం జరిగే ఈ కార్యక్రమంలో విక్రేతలు విశాఖ స్టీల్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ డీకే మహంతి, సీనియర్ అధికారులతో నేరుగా చర్చించే అవకాశం కల్పిస్తున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ ఈ–మార్కెట్ స్థలాలు, ఫెసిలిటేషన్ కార్యాలయాలు, జిల్లా పరిశ్రమల కేంద్రాలు, విశాఖ ఆటోనగర్ చిన్న తరహా పారిశ్రామికవేత్తల సంక్షేమ సంఘం సహా సుమారు 250మంది విక్రేతలు పాల్గొంటారని కేంద్ర స్టీల్ శాఖ పేర్కొంది.

అబద్ధాల్లో తండ్రిని మించిన తనయుడు లోకేశ్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని మండిపాటు



సాక్షి, అమరావతి : అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు కంటే ఆయన కుమారుడు నారా లోకేశ్ పది ఆకులు ఎక్కువే చదివారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాని) విమర్శించారు. చంద్రబాబు మంచి పనులు చేసి ఉంటే లోకేశ్ ఎందుకు రోడ్డున పడతారని ఎద్దేవా చేశారు. పెన్షన్లు తీసేశారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్ వల్ల చంద్రబాబు, లోకేశ్‌ల ఉద్యోగాలే పోయాయని, వీరి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు దమ్ముంటే వైఎస్ జగన్‌పై పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేయాలని సవాలు విసిరారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఏం చేశారని ప్రశ్నించారు. మీరు ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా వైఎస్ జగన్‌ను మిల్లీమీటరు కూడా కదపలేరని హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పిట్టల దొరను కన్న చంద్రబాబు

- ▲ కుప్పం సభలో నారా లోకేశ్ బరితెగించి అబద్ధాలు మాట్లాడారు. ప్రజలు ఏమనుకుంటారో అన్న ధ్యాస లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. రాజకీయాలు నేర్చుకోవాల్సిన వయసులో బరితెగింపు మాటలు ఎందుకు? పార్టీ చేజారి పోతుందని నారా లోకేశ్‌కు భయం. నందమూరి వారసులు కైవసం చేసుకుంటారనే ఆందోళన కన్పిస్తోంది. అందుకే ఇప్పుడు ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు.
- ▲ మాట్లాడితే ఏం పీకారంటూ.. లోకేశ్ విమర్శలు చేస్తున్నారు. స్టాన్‌ఫర్డ్ వర్సిటీలో నేర్చుకున్న విద్య అదేనా? ప్రపంచ బ్యాంకులో ఉద్యోగం అదే నేర్పిందా? చంద్రబాబు ఒక పిట్టలదొరను కన్నాడు. నిజంగా మీ పాలనలో ప్రజలకు మేలు జరిగిందా లోకేశ్? అదే జరిగితే ఇవాళ మీరు రోడ్డు మీద ఎందుకు పడ్డారు? అధికారంలోకి వస్తే జన్మభూమి కమిటీలు తెస్తామని చెప్పగలరా?
- ▲ అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ మెడలు వంచామంటూ, పచ్చి అసత్యాలను చెప్పుకొచ్చారు. అమరావతి కట్టకుండా కట్టామని, కడప స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేయకుండానే నిర్మించామని అంటే ప్రజలు ఏమనుకుంటారోనన్న భయం, బెరుకు లోకేశ్‌కు లేవు.

వీటిని కాదనగలరా?

- ▲ సీఎం జగన్ ప్రభుత్వం 1.40 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలిచ్చింది. ప్రభుత్వాసుపత్రులో 40 వేల మంది శాశ్వత ఉద్యోగులను నియమించింది. ఇతర శాఖలన్నింటిలో కలిపి దాదాపు 2 లక్షల మందిని రాష్ట్ర ఉద్యోగులుగా మార్చింది. 55 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది. మీరు దిగిపోయే నాటికి ఉన్న పెన్షన్లు కేవలం 39 లక్షలు అయితే, ఇవాళ ఏకంగా 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తోంది.
- ▲ దిశ చట్టం అమలు గురించి మాట్లాడుతున్నారు. ఆ చట్టానికి కేంద్రం అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఆ చట్టం గురించి మోదీని అడగండి. లేదంటే మీ పార్ట్‌నర్ అయినా మోదీని అడగాలి.
- ▲ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు రాష్ట్రంలోని పోలీసుల తోలు వలిచి కార్యకర్తలకు అంకితం ఇస్తానంటున్నారు. పోలీసుల తోలు పలుచగా ఉంటుంది. ఆయనదైతే మందంగా ఉంటుంది. దాన్ని ఒలిపించి పోలీసులకు బూట్లు కుట్టించే రోజు తొందర్లోనే ఉంది.
- ▲ తెలుగు గంగను పూర్తి చేస్తాం అనడానికి సిగ్గు ఉండాలి. ఎన్టీఆర్ శంకుస్థాపన చేసి పనులు మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును 1995లో వెన్నుపోటుతో అధికారంలోకి వచ్చిన మీ నాన్న హయాంలో ఎందుకు పూర్తి చేయలేదు?

పార్టీ వారసత్వం కోసమే లోకేశ్ పాదయాత్ర

మాజీ మంత్రి కొడాలి నాని



చిలకలపూడి(మచిలీపట్నం): ఎమ్మెల్యేగా కూడా గెలవలేక, దొడ్డి దారిన ఎమ్మెల్సీ అయిన నారా లోకేశ్ పాదయాత్ర ఎలా చేస్తాడని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవేంకటేశ్వరరావు (నాని) ప్రశ్నించారు. అసమర్థుడైన లోకేశ్.. టీడీపీ వారసత్వం కోసమే పాదయాత్ర చేస్తున్నాడని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2003లో అప్పటి చంద్రబాబు పాలనపై రైతులు, పింఛనుదారులు, పేదలు విసుగు చెందటంతో వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర నిర్వహించి అందరి కష్టాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే వాటన్నింటినీ అమలు చేసిన మహనీయుడన్నారు. 2004 నుంచి 2009 వరకు అందరి మన్ననలు పొందారని చెప్పారు. రాజశేఖరరెడ్డిని ఓడించేందుకు మహాకూటమితో చేతులు కలిపినా, చంద్రబాబు గెలవలేకపోయాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత దొంగ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి, రాష్ట్ర ప్రజలను మోసం చేశాడన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలిపేందుకు, ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేశారని చెప్పారు. రాజశేఖరరెడ్డి కూడా ప్రతిపక్ష నాయకుడిగానే పాదయాత్ర చేశారన్నారు. అలాంటిది కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేని లోకేశ్ ఎలా పాదయాత్ర చేస్తాడని ప్రశ్నించారు. లోకేశ్ యాత్రతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎలాంటి నష్టం ఉండదన్నారు. తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు స్వాధీనం చేసుకుంటారనే భయంతోనే వారసత్వ పోటీలో భాగంగా లోకేశ్ పాదయాత్ర చేస్తున్నాడని వివరించారు.

మొరిగే కుక్క కరవదన్నట్లు..

చిరంజీవి కుటుంబం నుంచి వచ్చిన వాడు కావటంతోనే పవన్‌కళ్యాణ్‌కు ఆదరణ ఉందని నాని చెప్పారు. తన తండ్రి దేవుడి వద్ద దీపారాధన ప్రమిదల్లో సిగరెట్ వెలిగించుకునేవాడని పవన్ అనటం, కరిచే కుక్క మొరగదని.. మొరిగే కుక్క కరవదన్న చందంగా నక్సలైట్ అయిపోతానని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. నక్సలైట్ అయితే కాల్చి పారేస్తారని హెచ్చరించారు. ఇటీవల సినిమాలు లేక జనసేన సైనికులకు సినిమా డైలాగ్‌లు చెప్పుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కులాభిమానం ఎక్కువ ఉందని పవన్ వ్యాఖ్యానించటంపై స్పందిస్తూ.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు మాత్రమే కులం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలకు అతీతంగా పాలన సాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు.

తారకరత్నకు గుండెపోటు

లోకేశ్ పాదయాత్రలో అపశ్రుతి

- మెరుగైన చికిత్సకు బెంగళూరుకు తరలించాలని నిర్ణయం
- ఆస్పత్రి రిపోర్ట్ ఇస్తే గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామన్న ఎస్పీ
- కుటుంబ సభ్యులతో బాలకృష్ణ, లోకేశ్ చర్చలు.. ఆ వెంటనే నిర్ణయం మార్పు
- కుప్పం ఆస్పత్రిలోనే అర్ధరాత్రి వరకు... బెంగళూరు నుంచి ప్రత్యేక వైద్యుల బృందం రాక

కుప్పం/కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా) : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రారంభించిన పాదయాత్రలో ఆదిలోనే అపశ్రుతి చోటుచేసుకుంది. లోకేశ్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు మనుమడు తారకరత్న గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆయన ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ కుమారుడు. శుక్రవారం ఉదయం 11.10 గంటలకు కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ వరదరాజస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, లోకేశ్ పాదయాత్ర ప్రారంభించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నందమూరి తారకరత్న, టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఉన్నారు. అక్కడి నుంచి అర కిలోమీటరు దూరంలో బాబునగర్ వద్ద ఉన్న మసీదుకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 12 గంటల సమయంలో మసీదు నుంచి బయటకు వచ్చిన తర్వాత కార్యకర్తలు తోసుకొని మీద పడటంతో తారకరత్న అస్వస్థతకు గురయ్యారు. నిలదొక్కుకోలేక సొమ్మసిల్లి కింద పడిపోవటంతో కార్యకర్తలు హుటాహుటిన పట్టణంలోని కేసీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అంబులెన్స్‌లో పీఈఎస్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తారకరత్నను క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స ప్రారంభించారు. నందమూరి బాలకృష్ణ ఆస్పత్రికి చేరుకుని వైద్యులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ, రక్తనాళాలు 90 శాతం మూసుకుపోవటంతో తారకరత్న స్పృహ కోల్పోయాడన్నారు. ప్రాణాపాయం లేదని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. తారకరత్నను ఆస్పత్రికి తరలించగానే మరోవైపు లోకేశ్ తన పాదయాత్రను కొనసాగించారు. తారకరత్న వెంట వెళ్లకుండా లోకేశ్ పాదయాత్ర కొనసాగించడంపై పార్టీలోని పలువురు నేతలు విస్మయం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుడు, బావ అయిన తారకరత్న పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిసినా, లోకేశ్ రాజకీయాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని, ప్రజల్లోకి వేరే సంకేతాలు వెళతాయని వారు చర్చించుకున్నారు. అయితే పాదయాత్ర కాస్త ఆలస్యం అయ్యేదని మాట్లాడుకున్నారు. ఇదిలా ఉండగా, తారకరత్నకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రి సిబ్బంది ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని, వారినెవరినీ బయటకు పంపడం లేదని.. బయటి నుంచి కూడా ఎవరినీ ఆస్పత్రి లోపలకు అనుమతించడం లేదని సిబ్బంది కుటుంబీకులు వాపోతున్నారు. అసలు ఆస్పత్రిలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదని టీడీపీ శ్రేణులే గుసగుసలు పోతుండటం గమనార్హం.

బెంగళూరు తరలింపునకు ఏర్పాట్లు.. నిర్ణయం మార్పు.. మళ్లీ తరలింపు

ఆస్పత్రిలో తారకరత్నకు వైద్యం అందించిన వైద్యులు.. బెంగళూరుకు సిఫార్సు చేశారు. ఈ విషయాన్ని టీడీపీ శ్రేణులు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆస్పత్రి మెడికల్ రిపోర్ట్ సమర్పిస్తే తప్పకుండా సహకరిస్తామని ఎస్పీ వారికి తెలిపారు. అంతలో తొలి రోజు పాదయాత్ర ముగించుకున్న లోకేశ్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. మామ బాలకృష్ణతో మాట్లాడారు. ఆ తర్వాత తారకరత్నను బెంగళూరుకు తరలించడం లేదని, బెంగళూరు నారాయణ హృదయాలయ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యులు ఇక్కడే చికిత్స అందిస్తారని పార్టీ శ్రేణులకు వారు సమాచారం ఇచ్చారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. ఇదిలా ఉండగా రాత్రి 9.30 గంటలకు తారకరత్న భార్య అలేఖ్య రెడ్డి, కుమార్తె నిషిక(9) పీఈఎస్ ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వీరితో పాటు తారకరత్న బావమరిదితో బాలకృష్ణ, లోకేశ్, మరికొందరు మాట్లాడారు. తారకరత్న కుటుంబ సభ్యుల అంగీకారంతోనే ఇక్కడే వైద్యం కొనసాగిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అయితే పలు నాటకీయ పరిణామాల మధ్య అర్ధరాత్రి ప్రత్యేక అంబులెన్స్‌లో తారకరత్నను బెంగళూరుకు తరలించారు.

అభివృద్ధి అంటే ఏమిటో చూపించాం

- శ్రీసిటీ సెజ్, కడప స్టీల్ ప్లాంట్ తెచ్చింది మేమే
- కుప్పం బహిరంగ సభలో నారా లోకేశ్

సాక్షి, తిరుపతి : నెల్లూరు జిల్లాలో శ్రీసిటీ సెజ్, కడప స్టీల్ ప్లాంట్‌తో పాటు అనేక పరిశ్రమలు తీసుకురావడం ద్వారా అభివృద్ధి అంటే ఏమిటో చూపించామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. యువగళం పేరుతో శుక్రవారం ఆయన ప్రారంభించిన పాదయాత్రలో భాగంగా కుప్పం కమతమూరు రోడ్డులో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలో మాట్లాడారు. తమ హయాంలో ఐదేళ్లలో 5.13 లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. 0డిఫెన్స్ పరిశ్రమలు, అదాని డేటా సెంటర్ తీసుకువచ్చిన ఘనత తమదేనని చెప్పారు. అధికారంలోకి రాగానే లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి అరకొర పోస్టులతో సరిపెడుతున్నారని విమర్శించారు. జగన్‌రెడ్డి అంటే జాదూ రెడ్డి అని విమర్శించారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఎటువంటి కండీషన్లు లేకుండా రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. వైకాపా నేతలకు తన గురించి తెలియదని, తాను మూర్ఖుడినని చెప్పుకొచ్చారు. అంతకుముందు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సీఎం జగన్‌పై, పోలీసులపై అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డారు. కాగా, లోకేశ్ పాదయాత్ర సభ ముగింపు దశకు వచ్చే సరికి కేవలం 1,500 మంది మాత్రమే మిగలడం టీడీపీ నేతలకు ఆందోళన కలిగించింది.

వైభవంగా ఆదిత్యునికి క్షీరాభిషేకం



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న హరిజవహర్‌లాల్

అరసవల్లి (శ్రీకాకుళం) : శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి రథసప్తమి ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. శుభకృత్ నామ సంవత్సరం మాఘ శుద్ధ సప్తమి పర్వదినం సందర్భంగా రథసప్తమి వేడుకను దేవదాయ శాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఉత్సవంలో భాగంగా శ్రీ ఉషా పద్మినీఛాయా దేవేరులతో శ్రీసూర్యనారాయణ స్వామివారి మూలవిరాట్‌కు విశేష క్షీరాభిషేక సేవను వేదమంత్రోచ్చారణలు, మంగళధ్వనుల మధ్య అర్చక స్వాములు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ విశేష పూజలు చేశారు. ఉదయం 6గంటల వరకు క్షీరాభిషేకాన్ని, ఆ తర్వాత స్వామివారి నిజరూపదర్శనానికి ఏర్పాట్లుచేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామికి దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, ఉత్సవ అధికారి ఎంవీ సురేష్‌బాబు, ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, వ్యవస్థాపక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పట్టువస్త్రాలను సమర్పించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తెలంగాణ

ప్రపంచానికి భారత్ అజెండా

- జీ–20 షేర్పా, నీతిఆయోగ్ మాజీ చైర్మన్ అమితాబ్ కాంత్
- నేటి నుంచి హైదరాబాద్‌లో స్టార్టప్ 20 సమావేశాలు షురూ

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అతి ముఖ్యమైన జీ–20 సదస్సు అధ్యక్ష హోదాలో భారత్ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని జీ–20 షేర్పా, నీతి ఆయోగ్ మాజీ చైర్మన్ అమితాబ్ కాంత్ తెలిపారు. స్టార్టప్ రంగం ప్రపంచానికి చేయగల మేలును దృష్టిలో ఉంచుకుని తొలిసారి భారత్ చొరవతో జీ–20 సదస్సులో స్టార్టప్ రంగానికీ స్థానం కల్పించామని శుక్రవారం విలేకరులతో అన్నారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో స్టార్టప్–20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ సమావేశాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడం, కార్పొరేట్ సంస్థలు, పెట్టుబడిదారులు, ఇన్నొవేషన్ ఏజెన్సీల మధ్య సమన్వయం కుదర్చడం ఈ స్టార్టప్–20 సమావేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇప్పటివరకూ జీ–20 సదస్సుల ద్వారా అభివృద్ధి చెందిన దేశాలు ఒక అజెండాను సిద్ధం చేస్తే భారత్ అనుసరించేదని, తొలిసారి భారత్ ప్రపంచానికి అజెండాను నిర్దేశిస్తోందన్నారు. స్టార్టప్‌లకు సంబంధించిన తొలి ఎంగేజ్‌మెంట్ గ్రూపు సమావేశాలకు హైదరాబాద్ వేదికైందని తెలిపారు. విజ్ఞానం, సృజన, సుస్థిరాభివృద్ధి అన్న మూడు అంశాలే రానున్న దశాబ్దాల్లో ప్రపంచ ప్రగతిని నిర్దేశిస్తాయని, అందుకే ఈ మూటితో ముడిపడిన స్టార్టప్‌లను జీ–20 సదస్సుల్లో భాగంగా చేశామని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రొమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ కార్యదర్శి అనురాగ్ జైన్ వివరించారు. కార్యక్రమంలో స్టార్టప్ –20 చైర్మన్ చింతన్ వైష్ణవ్ తదితరులు పాల్గొన్నారు.

> క్రమశిక్షణ లేకపోతే బుద్ధి నిలకడగా, మనసు ఏకాగ్రతగా ఉండదు.
> నిలకడ, ఏకాగ్రత లేకపోతే మనశ్శాంతి ఎక్కడి నుంచి వస్తుంది?
> – భగవద్గీత

సాక్షి

శనివారం, జనవరి, 28

జర్మనీ నిర్ణయం సబబేనా?

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం రేపో మాపో పరిసమాప్తం కాకతప్పదని, పెను సంక్షోభంలో చిక్కుకున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు కోలుకోవటం మొదలవుతుందని ఆశిస్తున్నవారిని తాజా పరిణామం తీవ్ర నిరాశలోకి నెట్టింది. ఉక్రెయిన్‌కు లెపార్డ్ 2 రకం భారీ యుద్ధ ట్యాంకులు అందజేయడానికి గత కొన్ని నెలలుగా ససేమిరా అంటున్న జర్మనీ ఎట్టకేలకు తన నిర్ణయాన్ని మార్చుకుంది. యుద్ధంలో ఆయుధ సంపత్తి ప్రధానమే కావొచ్చుగానీ... ప్రతిఘటనదారుల సంకల్పబలం ముందు అవి దిగదుడుపేనని యుద్ధ నిపుణులంటారు. ఒక చిన్న దేశం వియత్నాం ముందు అరవయ్యో దశకంలో అమెరికా చిత్తయిన ఉదంతం మొదలుకొని తాజాగా రష్యాపై ఉక్రెయిన్ సాగిస్తున్న ప్రతిఘటన వరకూ అది రుజువవుతూనే ఉంది. నెలరోజుల్లో ఉక్రెయిన్‌ను పాదాక్రాంతం చేసుకోవాలనుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఏడాది గడిచాక దాన్నుంచి బయటికొచ్చే దారీతెన్నూ కానక ఆపసోపాలు పడుతున్నారు. అందరూ ఏకమై పుతిన్ మెడలువంచి ఆయన్ను చర్చలకు ఒప్పించాల్సివున్న ఈ తరుణంలో ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ ఆ యుద్ధాన్ని మరింత సాగదీసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అయితే జర్మనీ అంత సులభంగా ట్యాంకులివ్వటానికి అంగీకరించలేదు. అమెరికా తన ఎం1 అబ్రామ్ ట్యాంకుల్ని కూడా తరలించేందుకు ఒప్పుకుంటేనే లెపార్డ్ 2 ట్యాంకులు అందిస్తామన్న షరతు విధించింది. ఈ విషయంలో జర్మనీ చాన్సలర్ ఒలోఫ్ షుల్జ్ మనసు మారేలా చేసేందుకు అమెరికా అన్నివిధాలా ప్రయత్నించింది. జర్మనీలోని పాలక, ప్రతిపక్షాలతోపాటు నాటో కూటమి దేశాలు సైతం షుల్జ్‌పై ఒత్తిళ్లు తెచ్చాయి. నేరుగా ఉక్రెయిన్‌కు ఇవ్వటం అభ్యంతరమైతే తమకు సరఫరా చేసిన లెపార్డ్‌లివ్వటానికైనా అనుమతించాలని పోలెండ్ గత కొన్ని వారాలుగా డిమాండ్ చేస్తోంది. నిజానికి ఇది ట్యాంకులివ్వటంతో ఆగదు. విమాన విధ్వంసక చీతా ట్యాంకులివ్వాలని కూడా జర్మనీపై ఒత్తిడి ఉంది. వాటితోపాటు ఉక్రెయిన్ ఎఫ్–16 యుద్ధ విమానాలివ్వాలని చాన్నాళ్లుగా అమెరికాను కోరుతోంది.

ఉక్రెయిన్‌కు ఏడాదిగా జర్మనీ చేస్తున్న సాయం తక్కువేం కాదు. కానీ అదంతా నాటో కూటమి సాయంలో భాగంగా ఉంది. ప్రత్యక్షంగా ట్యాంకులు పంపటం మొదలైతే ఆ చర్య రష్యాను రెచ్చగొడుతుందన్న భయం షుల్జ్‌కి ఉంది. అదే జరిగితే ఆర్థికంగా, సైనికంగా కూడా జర్మనీ నష్టపోతుందని ఆయన అంచనా. దానికితోడు అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పుణ్యమా అని జర్మనీకి ఆ దేశంపై ఎన్నో సంశయాలున్నాయి. యుద్ధంలోకి దిగాక చివరివరకూ అమెరికా అండగా ఉంటుందా అన్నది దాని ప్రధాన సందేహం. అబ్రామ్ ట్యాంకులు విడుదల చేయటం ససేమిరా కుదరదని అధ్యక్షుడు బైడెన్ చెప్పటం ఆ సందేహాన్ని మరింత పెంచింది. అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్ జర్మనీని ఈ విషయంలో ఒప్పించటానికి అన్నివిధాలా ప్రయత్నించి విఫలమయ్యాక చివరకు బైడెన్‌ను అంగీకరింపజేయగలిగారు. అయితే తన అమ్ములపొదిలో ఉన్న ట్యాంకులు కాకుండా తయారీదారులనుంచి కొనుగోలు చేసుకోవాలని అమెరికా అంటోంది. జర్మనీకి మరో సమస్య కూడా ఉంది. దానిదగ్గర ప్రస్తుతం లెపార్డ్ 2 ట్యాంకులు భారీ సంఖ్యలో లేవు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో 4,000 వరకూ ఉండే ఆ ట్యాంకుల సంఖ్య ఇప్పుడు 300కు పడిపోయింది. వాటిని పెంచుకోవాలంటే చాన్నాళ్లు పడుతుంది. పైగా తోటి యూరప్ దేశాలకు ఇప్పటికే ఎగుమతి చేసిన ట్యాంకులకు విడి భాగాలు అందించాల్సివుంది. నిజానికి అమెరికా సైతం అలాంటి అభ్యంతరమే చెప్పింది. ప్రస్తుతం తమ బలగాల దగ్గరున్న 4,000 ట్యాంకులు దేశ భద్రతరీత్యా కదల్చటం సాధ్యపడదంటున్నది. అందుకు బదులు కొనుగోలు చేసుకోవాలంటున్నది. అమెరికా తయారీ అబ్రామ్‌లముందు లెపార్డ్‌లు కొంత తీసికట్టే. గల్ఫ్ యుద్ధంలో, 2003 నాటి ఇరాక్ దురాక్రమణలో, అఫ్గానిస్తాన్ దురాక్రమణలో అమెరికాకు అబ్రామ్‌లు అక్కరకొచ్చాయని సైనిక నిపుణులంటారు. అయితే ఇందుకు ఎంతో సమన్వయం అవసరం. అఫ్గాన్‌లో మందుపాతరలనూ, ఇతర బాంబు దాడులనూ అవి తట్టుకున్నాయి. కానీ వాటి సాంకేతికత అత్యంత సంక్లిష్టమైనది. నెలల తరబడి శిక్షణ ఉంటేనే వాటిని వినియోగించటం సాధ్యం. అదీగాక అబ్రామ్‌ల వ్యయం, వాటి విడి భాగాలు భారీ ఖర్చుతో కూడుకున్నవి. ఈ విషయంలో లెపార్డ్‌లు మెరుగే అయినా వాటిపైన కూడా ప్రత్యేక శిక్షణ అవసరం. అందువల్ల తక్షణం ఈ ట్యాంకులు యుద్ధ క్షేత్రానికి రాలేవు.

తనపై నేరుగా లడాయికి దిగే ధైర్యం నాటోకు ఉండదని, ఆ కూటమిలో చీలిక రావటం ఖాయమని మొదటినుంచీ అనుకుంటున్న రష్యాకు జర్మనీ నిర్ణయం శరాఘాతమే. నేరుగా తమ గడ్డపై దాడి చేయగల భారీ ట్యాంకుల్నీ, అధునాతన యుద్ధ విమానాలనూ మోహరిస్తే ఆత్మవినాశనం కొని తెచ్చుకున్నట్టేనని రష్యా చేస్తున్న హెచ్చరికల సారాంశం పుతిన్ మొదటినుంచీ బెదిరిస్తున్న అణుయుద్ధమే అయితే ప్రపంచానికి చేటుకాలం దాపురించినట్టే. తమ ఆహార అవసరాల్లో 80 శాతం వరకూ ఉక్రెయిన్‌పైనే ఆధారపడ్డ ఈజిప్టువంటి దేశాలు ఇప్పటికే సంక్షోభంలో పడ్డాయి. ఇతరత్రా ఉత్పత్తులు మందగించి ప్రపంచ దేశాలన్నీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితి మరింత క్షీణించేలా మారణాయుధాలు తరలించటంకాక యుద్ధం ఆపేందుకు అవసరమైన ఇతరత్రా చర్యలన్నిటిపైనా దృష్టి సారించాలి. ఆ విషయంలో శాంతిని కోరుకునే ప్రపంచ ప్రజానీకం ఒత్తిళ్లు తీసుకురావాలి. అప్పుడు మాత్రమే పరిస్థితి కుదుటపడుతుంది.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com

రీసైక్లింగే శరణ్యం



ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా అందరి నోటా ఒకటే మాట. ప్లాస్టిక్ వాడకానికి చరమ గీతం పాడాలి అని. ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంలో జపాన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. టోక్యోలో జరిగిన 2020 ఒలింపిక్స్ క్రీడల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి ఒలింపిక్ విజేతలకు పతకాలు తయారు చేసింది అంటే ఆ దేశ ప్రభుత్వం ప్లాస్టిక్‌కు ముకుతాడు వేసేందుకు ఎంతటి ప్లానింగ్‌తో ముందుకు వెళ్లిందో ఊహించవచ్చు. అథ్లెట్‌లకు పడుకునేందుకు కార్డ్ బోర్డ్ మంచాలను, వాటిపై పరుపులను సైతం రీసైక్లింగ్ ద్వారా తయారు చేసింది. వారి గొప్ప ప్రయత్నానికి హ్యాట్సాఫ్ చెప్పి తీరాల్సిందే.

ప్రపంచవ్యాప్తంగా ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో గరిష్ఠంగా పది శాతమే రీసైక్లింగ్ అవు తుండగా, మిగిలినది చెత్త కుప్పల్లో చేరుతున్నది. అలా చేరడం వల్ల వాతావరణం కలుషితం అయ్యి వివిధ వ్యాధులకు ఆలంబనగా మారుతున్నది. ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడటం మూలాన ముంచుకొచ్చే భూతాపోన్నతి, వాతావరణ మార్పుల ముప్పును ఎదుర్కోవాల్సిందే అనేదానికి ప్రత్యక్ష ఉదాహరణే ఇటీవల తీవ్రమైన వరదలు పాకిస్తాన్‌ను పలకరించడం; ఈ ఏడాది మొదట్లోనే వందేళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో అమెరికా మంచులో కూరుకుపోయి భారీ ఆస్తి, ప్రాణ నష్టం సంభవించడం.

రీసైక్లింగ్ అంటే పెద్ద పని కాదు. అదేమీ బ్రహ్మ విద్య కాదు. ఒక ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి వేరే వస్తువుగా వాడుకోవడమే. అందుకే దేశంలోని పెద్ద, చిన్న నగరాలలో, మున్సిపాలిటీలలో సైతం రీసైక్లింగ్ ప్లాంటులు ఏర్పాటు చేస్తే వ్యర్థాల బెడద తొలగి, ఆరోగ్యకరమైన, సుఖప్రదమైన జీవితం గడిపేందుకు అవకాశం ఉంటుంది. మనల్ని మనం కాపాడుకునే ఒక ఆయుధం ఈ రీసైక్లింగ్!

– బుగ్గన మధుసూదన రెడ్డి
బేతంచెర్ల, కర్నూలు జిల్లా

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.సప్తమి ప.2.32 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: అశ్వని రా.12.32 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: రా.8.32 నుండి 10.08 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.37 నుండి 8.08 వరకు,
అమృతఘడియలు: సా.5.12 నుండి 6.47 వరకు, రథసప్తమి ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.49

సీమను సుభిక్షం చేస్తున్నదెవ్వరు?

- కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను జూన్ నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక
- శ్రీశైలానికి వరద వచ్చే 60 రోజుల్లోనే 40 టీఎంసీలు తరలించే పనులకు శ్రీకారం
- 2019 నుంచి సామర్థ్యం 40 టీఎంసీల కంటే అధికంగా జలాలు తరలింపు
- ప్రధాన, ఉప కాలువల ద్వారా చెరువులను నింపుతుండటంతో భారీగా పెరిగిన భూగర్భజలమట్టం
- మే, 2019 నాటికి సీమలో 26 మీటర్ల లోతున నీరు... ఇపుడు 4.8 మీటర్లలోనే లభ్యం
- ప్రాధాన్యత క్రమంలో డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేస్తూ ఆయకట్టుకు నీళ్లందించడానికి ప్రభుత్వం చర్యలు
- ఉద్యానవన పంటల సాగులో అగ్రగామిగా నిలిచి.. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా మారిన రాయలసీమ
- దీన్ని ఓర్చుకోలేక... జగనన్న మాట
- నీటి మూట అంటూ 'ఈనాడు' విషపు రాతలు


తెలుగుగంగ లైనింగ్ పనులు (ఫైల్)

చంద్రబాబు నాయుడు ఏం చేసినా... అది బంగారు బాటే. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవటంలో తనకెవ్వరూ సాటి లేరని పదేపదే నిరూపిస్తున్నా... ఆయన మాటలన్నీ నీటిమూటలే. వయసు మీదపడుతున్న కొద్దీ రామోజీరావులోని ఈ దృష్టిలోపం మరింత తీవ్రమవుతోంది. ఎందుకంటే 2016, సెప్టెంబరు 2న అనంతపురం జిల్లాలో అప్పటి సీఎం చంద్రబాబు కరవుపై యుద్ధానికి వెళ్లారు. అది కూడా 'రెయిన్‌గన్'లతో!!. ఈ పిట్టలదొర విన్యాసానికి పరవశించిపోయారు రామోజీరావు. 'ఈనాడు'లో కరువుపై యుద్ధమంటూ పతాక శీర్షికల్లో అచ్చేశారు. ఒక్క చుక్క వర్షం పడకపోయినా... దుర్భిక్ష రాయలసీమ సస్యశ్యామలమైపోయినట్లు కథనాలు వండి వార్చేశారు.

ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గడిచిన మూడున్నరేళ్లుగా ఏటా హంద్రీ-నీవా సామర్థ్యం కంటే ఎక్కువగా కృష్ణా జలాలను తరలిస్తున్నారు. ప్రధాన కాలువ, ఉప కాలువల ద్వారా వేలాది చెరువులను నింపుతున్నారు. భూగర్భజలాలు పుష్కలంగా పెరిగాయి. బోరు బావులతో పాటు చెరువులు, హంద్రీ-నీవా ప్రధాన కాలువలు, ఉప కాలువల కింద లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. డిస్ట్రిబ్యూటరీలను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేస్తూ ఆయకట్టుకు నీళ్లందించేలా అడుగులేస్తున్నారు. దీంతో రాయలసీమ పచ్చగా కళకళలాడుతోంది. ఇక చంద్రబాబుకు పుట్టగతులుండవనే భయం రామోజీలో అంతకంతకూ పెరుగుతోంది. 'ఈనాడు'లో దుష్ప్రచారపు రాతలూ పెరుగుతున్నాయి. ఆ కోవలోనిదే... శుక్రవారం నాటి 'జగనన్న మాట.. నీటి మూట' కథనం. మరి దీన్లో నిజానిజాలేంటి? ఒకసారి చూద్దాం...

ఏది నిజం?

బహుశా! ఒకే ప్రాజెక్టుకు రెండు సార్లు శంకుస్థాపన చేసిందెవరైనా ఉంటే అది చంద్రబాబు నాయుడేనని ఖచ్చితంగా చెప్పొచ్చు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చాక... 1996 లోక్‌సభ ఎన్నికలకు ముందు 40 టీఎంసీల సామర్థ్యంతోనూ హంద్రీ-నీవాకు శంకుస్థాపన చేశారు చంద్రబాబు. 1999 ఎన్నికలకు ముందు దాని సామర్థ్యాన్ని 35 టీఎంసీలకు తగ్గించి మరోసారి కూడా శంకుస్థాపన చేశారు. రెండు సార్లు శంకుస్థాపన చేసినా... 1995 నుంచి 2004 మధ్య హంద్రీ-నీవా కోసం ఖర్చుపెట్టింది మాత్రం కేవలం రూ.13.57 కోట్లు. అది కూడా ఉద్యోగుల జీతభత్యాలు, కార్యాలయాల నిర్వహణ కోసమే తప్ప ప్రాజెక్టు కోసం కాదు. అది బాబు ఘనతయితే... ఈ నిర్వాకాన్ని ఆ తొమ్మిదేళ్లలో ఒక్కసారి కూడా ప్రశ్నించకపోవటం రామోజీరావు ఘనత. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక శ్రీశైలానికి వరద వచ్చే 120 రోజుల్లో 40 టీఎంసీలను తరలించి.. ఉమ్మడి కర్నూల్, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 40 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా 2004లో హంద్రీ-నీవాను చేపట్టారు. 2009 నాటికల్లా హంద్రీ-నీవా తొలి దశను పూర్తి చేయటంతో పాటు... రెండో దశ పనులనూ సింహభాగం పూర్తి చేశారు. కానీ వైఎస్సార్ ఆకస్మిక మరణం తరవాత... టీడీపీ మద్దతుతో కొనసాగిన కాంగ్రెస్ ప్రభుత్వం హంద్రీ-నీవా పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి అటకెక్కించేసింది.


జీవో 22, జీవో 63లతో చంద్రబాబు దోపిడీ..

విభజన తర్వాత 2014 ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. జీవో 22 (ధరల సర్దుబాటు), జీవో 63 (పనుల పరిమాణం ఆధారంగా అదనపు బిల్లులు చెల్లించడం) తెచ్చి, వాటి ద్వారా హంద్రీ-నీవా అంచనా వ్యయాన్ని రూ.6,850 కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు పెంచేశారు. అంతేకాక 60–సీ కింద పాత కాంట్రాక్టర్లను తప్పించి, అస్మదీయ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. భారీ ఎత్తున ఖజానాను దోచేశారు. హంద్రీ-నీవా ద్వారా అరకొరగా నీళ్లను తరలించి.. అరకొరగా పంపిణీ చేసి సీమ ప్రజల మధ్య జలయుద్ధాలు సృష్టించారు. చివరకు హంద్రీ- నీవాలో అంతర్భాగమైన కుప్పం నియోజకవర్గానికి నీళ్లందించే కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను కూడా రూ.477 కోట్ల అంచనాతో ప్రారంభించి.. ఆ తర్వాత వ్యయాన్ని రూ.622 కోట్లకు పెంచేశారు. చివరకు పనులు చేయకుండానే... అస్మదీయ కాంట్రాక్టర్‌తో కలిసి సులువైన మట్టి పనులు చేసి, కమీషన్లు వసూలు చేసుకుని చేతులు దులిపేసుకున్నారు చంద్రబాబు. హంద్రీ-నీవా జలాలు అందక... వర్షాలు కురవక రాయలసీమ.. అందులోనూ అనంతపురం జిల్లా కరవుతో తల్లడిల్లుతుంటే 2016, సెప్టెంబరు 2న కరవుపై యుద్ధం... అంటూ ట్యాంకర్లతో నీటిని తెప్పించారు చంద్రబాబు నాయుడు. పిట్టలదొరలా రెయిన్ గన్‌లు చేతబట్టి.. నాలుగు బొట్లు విదిల్చి... కరవును జయించేసినట్లు ప్రకటించారు. రైతులకు ఏమాత్రం పనికిరాని ఈ రెయిన్ గన్‌ల నిర్వహణ పేరుతో రూ.105 కోట్లను కాజేశారు. అదీ రామోజీరావు తెగ మెచ్చుకున్న బాబుగారి బాగోతం!!.

కృష్ణా జలాలను గరిష్ఠంగా తరలిస్తూ..

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక హంద్రీ-నీవా సామర్థ్యమైన 40 టీఎంసీల కంటే ఏటా అధికంగా కృష్ణా జలాలను తరలిస్తున్నారు. ప్రధాన కాలువ, ఉప కాలువల ద్వారా వేల చెరువులను నింపుతూ.. వాటి కింద లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తున్నారు. చెరువుల్లో నీటి నిల్వ వల్ల భూగర్భ జలాలు గరిష్ఠ స్థాయికి చేరాయి. 2019, మే నాటికి రాయలసీమ జిల్లాల్లో సగటున భూగర్భ జలమట్టం 26 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం కేవలం 4.8 అడుగుల్లోనే భూగర్భ జలాలు పుష్కలంగా దొరుకుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీని వల్లే బోరు బావుల కింద రైతులు లక్షలాది ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రధాన కాలువ, ఉప కాలువల కింద కూడా భారీగా సాగు చేస్తూ... ఉద్యానవన పంటల సాగులో రాయలసీమను అగ్రగామిగా మార్చారు. సత్యసాయి, అనంతపురం జిల్లాలు ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఏపీగా అవతరించాయంటే దానివెనక ఈ ప్రభుత్వం చేసిన కృషిని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

'ఈనాడు'కు ఈ చర్యలు కనపడవా..?



- దుర్భిక్ష రాయల సీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సత్యసాయి జిల్లాలో పేరూరు (అప్పర్ పెన్నార్) ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ 2020లోనే హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలతో నింపారు. అనంతపురం జిల్లాలో భైరవాని తిప్ప ప్రాజెక్టును హంద్రీ-నీవా జలాలతో నింపే పనులను వేగవంతం చేశారు.
- ధర్మవరం నియోజకవర్గంలో 2.18 టీఎంసీల సామర్థ్యంతో జిల్లేడుబండ రిజర్వాయర్ నిర్మాణ పనులను సీఎం జగన్ చేపట్టారు. ఈ రిజర్వాయర్ కింద 23 వేల ఎకరాలకు నీళ్లందించనున్నారు.
- సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో హంద్రీ-నీవా ద్వారా 3 టీఎంసీలు తరలించి.. 195 చెరువులను నింపి, 10,834 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం, 2.43 లక్షల మంది దాహార్తి తీర్చే పనులు సీఎం వైఎస్ జగన్ చేపట్టారు.
- మడకశిర నియోజకవర్గానికి నీళ్లందించేందుకు హంద్రీ-నీవా రెండో దశలో మడకశిర బైపాస్ కెనాల్ పనులను చేపట్టారు.
- కర్నూల్ జిల్లాలో పశ్చిమ ప్రాంతంలోని 9 దుర్భిక్ష మండలాల్లో 10,130 ఎకరాలకు నీళ్లందించేందుకు హంద్రీ-నీవా నుంచి 1.238 టీఎంసీలను ఎత్తిపోసే పథకం పనులను రూ.180.67 కోట్లను ఖర్చు చేసి, దాదాపుగా పూర్తి చేశారు.
- హంద్రీ-నీవా.. గాలేరు-నగరి అనుసంధానం ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేసే పనులను సీఎం వైఎస్ జగన్ చేపడితే.. టీడీపీ నేతలతో ఎన్జీటీలో కేసులు వేయించి, సైంధవుడిలా అడ్డుపడే దుస్సాహసానికి చంద్రబాబు ఒడిగట్టారు. విచిత్రమేంటంటే ఈ దౌర్భాగ్యపు పనులను 'ఈనాడు' ఏనాడూ ప్రస్తావించదు. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతమని చెప్పదు.
- టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీనే గెలిపిస్తూ వచ్చిన హిందూపురం నియోజకవర్గ ప్రజల దాహార్తిని సైతం చంద్రబాబు తీర్చలేదు. ఆ నియోజకవర్గ ప్రజల దాహార్తిని మహా నేత వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్చితే. చంద్రబాబు చేతులెత్తేసిన హంద్రీ-నీవాలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను జూన్‌కు పూర్తి చేసి ఆ నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలించి.. సస్యశ్యామలం చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు.


బ్రహ్మంసాగర్

సీఎం జగన్ చిత్తశుద్ధికి తార్కాణాలివిగో...

- బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ తెలుగుగంగ లింక్ కెనాల్ ప్రవాహ సామర్థ్యం 15 వేల క్యూసెక్కులు. కానీ.. లైనింగ్ లేకపోవడం వల్ల 2019 వరకూ కనీసం ఆరేడు వేల క్యూసెక్కులు కూడా వెళ్లేవి కావు. దాంతో సకాలంలో వెలిగోడు నిండేది కాదు. వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్ వరకూ తెలుగుగంగ ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యం ఐదు వేల క్యూసెక్కులు. కానీ.. లైనింగ్ లేకపోవడంతో 2,500 క్యూసెక్కులు కూడా వెళ్లేవి కావు. దాంతో సకాలంలో బ్రహ్మంసాగర్ నిండేది కాదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక తెలుగు గంగ లింక్ కెనాల్, ప్రధాన కాలువల లైనింగ్ పనులను రూ.550 కోట్లతో దాదాపుగా పూర్తి చేయించారు. దాంతో సామర్థ్యం మేరకు నీటిని తరలించేందుకు మార్గం సుగమమైంది. సకాలంలో వెలిగోడు, బ్రహ్మంసాగర్ పూర్తి సామర్థ్యం మేరకు నిండుతున్నాయి.
- బ్రహ్మంసాగర్ రిజర్వాయరు గరిష్ఠ సామర్థ్యం 17.85 టీఎంసీలు. కానీ మట్టికట్టలో నిర్మాణ లోపాల వల్ల లీకేజీలు ఉండటంతో నిల్వ సామర్థ్యం నాలుగైదు టీఎంసీలకు పడిపోయింది. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు... ఎన్నడూ లీకేజీలకు అడ్డుకట్ట వేసి గరిష్ఠ సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేసే ప్రయత్నాలు చేయలేదు. ఆ నాలుగైదు టీఎంసీల నిల్వతోనే నెట్టుకొచ్చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక... యుద్ధప్రాతిపదికన బ్రహ్మంసాగర్ మట్టికట్టలో లీకేజీలున్న చోట రూ.100 కోట్లతో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. లీకేజీలకు అడ్డుకట్ట వేసి ఏకంగా 17.85 టీఎంసీలను నిల్వ చేసి... ఆయకట్టు చివరి భూముల క్కూడా నీళ్లిచ్చారు.

.....

- గాలేరు-నగరి సుజల స్రవంతి పథకంలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగంలో 160 మీటర్ల పొడవున ఫాల్ట్ జోన్‌లో 2014–19 మధ్య పనులు చేయలేక చంద్రబాబు చేతులెత్తేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆ సొరంగాన్ని పూర్తి చేయించారు. శ్రీశైలానికి వరద వచ్చిన వెంటనే ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు–నగరి సుజల స్రవంతి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను గండికోట రిజర్వాయర్‌కు తరలించడానికి సిద్ధమయ్యారు.

.....

- గండికోట రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 26.85 టీఎంసీలు. కానీ 2014 నుంచి 2019 మధ్య నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడంతో ఐదారు టీఎంసీలు కూడా నిల్వ చేయలేని దుస్థితి ఉండేది. పునరావాసం కల్పించే ఆలోచన కూడా చంద్రబాబు చేయలేదు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక రూ.వెయ్యి కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. గత రెండేళ్లుగా గరిష్ఠంగా నీటిని నిల్వ చేస్తున్నారు. ఇప్పుడు కూడా రిజర్వాయర్‌లో 26.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

....

- చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్) గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 10 టీఎంసీలు. కానీ 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు. ఫలితంగా నాలుగైదు టీఎంసీలను కూడా నిల్వ చేయలేని పరిస్థితి. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రూ.600 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. రెండేళ్లుగా సీబీఆర్‌లో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం సీబీఆర్‌లో 9.6 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

.....

- చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దుర్భిక్షం రాజ్యమేలగా... అనంతపురంతో పాటు ఏటా రాయలసీమ జిల్లాల్లో కరవు మండలాలను ప్రకటించిన చంద్రబాబు.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించకుండా మోసం చేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో రాయలసీమ సుభిక్షంగా మారింది. ఇలాంటి వాస్తవాలను రాస్తే వై.ఎస్.జగన్ గ్రాఫ్ ఇంకా పెరిగి చంద్రబాబుకు పుట్టగతులుండవనే భయంతోనే... అబద్ధాలు రాయటానికి అలవాటు పడిపోయారు రామోజీరావు!!.

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

రోజూ పరీక్షే!



ఇంట్లో మీ అమ్మగారి సమయ నిర్వహణ నైపుణ్యాలను కనుక మీరు నిశితంగా గమనిస్తే, పరీక్షలకు సిద్ధమయేందుకు మీరు మీ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనేది మీకు చక్కగా అర్థమౌతుంది.

– నరేంద్ర మోదీ, భారత ప్రధాని

బిగ్ బ్రదర్స్



రిపబ్లికన్ పార్టీ రష్యా ఏజెంటుగా మారిందని తెలిస్తే రొనాల్డ్ రీగన్ మృతదేహానికి గుండెపోటు వస్తుంది. ట్రంప్, పుతిన్‌లు ఎప్పుడూ కూడా అమెరికా ప్రయోజనాల గురించి ఆలోచించలేదు. ఎప్పటికీ కూడా ఆలోచించబోరు.

– అరిక్ ఎల్.మన్, జాతీయవాది

హి(ం)డెన్ అజెండా



హిండెన్‌బర్గ్ అపరాధ పరిశోధన: కంపెనీ స్థాపన 2017. కంపెనీ సిబ్బంది 10 మంది. ఇంత పెద్ద పరిశోధనా సంస్థ అదానీ గ్రూపును బెదిరిస్తోంది. ఇదంతా చూస్తుంటే అమెరికా వారి సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ భారత దేశాన్ని కిందికి పడదోయడానికి పన్నిన కుట్రలా ఉంది.

– క్యూరియస్ శుభమ్, ట్రేడర్

మంచిదైంది!



పనివారీగా నాకు ఆసక్తి కలిగించే విషయం ఏదీ కనబడకపోయే సరికి 2017 చివరిలో అకడమిక్ ఎకానమిస్టుగా నేను నా కెరియర్‌ను అర్థంతరంగా ముగించాను. అకాడమీలలో నేటి స్థితిని చూస్తుంటే ఆనాడు నేను తీసుకున్న నిర్ణయం నా కెరియర్‌లోనే అత్యుత్తమ మైనదిగా అనిపిస్తోంది.

– తౌమస్ మలినెన్, ఎకనమిస్ట్

అత్యుత్సాహం



సోషల్ మీడియా యూజర్లు చాలా మంది కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ తన తండ్రిని కలుసుకున్నారంటూ కొన్ని ఫొటోలను షేర్ చేస్తున్నారు. నిజానికవి వారణాసిలో తమిళకవి భారతీయార్ కుటుంబ సభ్యులను ఆమె కలుసుకున్నప్పటి ఫొటోలు.

– మొహమ్మద్ జుబెయిర్, ఫ్యాక్ట్ చెకర్

క్లుప్తంగా...


'పద్మశ్రీ' నరసింహరాజు యాదవ్ మృతి



గూడూరు(పెడన): కృష్ణాజిల్లా గూడూరు గ్రామానికి చెందిన ఆదర్శరైతు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గొరిపర్తి నరసింహరాజు యాదవ్ (82) మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భార్య నాంచారమ్మ ఏడేళ్ల కిందట మరణించగా, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గూడూరు 'రాజు గారు'గా గుర్తింపు పొందిన నరసింహరాజు యాదవ్ వ్యవసాయంలో అనేక అద్భుతాలు సృష్టించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి రైతులకు ఆదర్శంగా నిలిచారు. వ్యవసాయ రంగంలో ఆయన కృషిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2009లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. ఆయన నేషనల్ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారం, జగ్జీవన్‌రామ్ కిసాన్ పురస్కారం, చౌదరి చరణ్‌సింగ్ క్రిషక్ శిరోమణి సమ్మాన్ పురస్కారం, నేషనల్ బయోటెక్ అవార్డు, ఇంటర్నేషనల్ ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డులు అందుకున్నారు. 'బెస్ట్ ఫార్మర్ ఆఫ్ ఇండియా–గోల్డెన్ బెస్ట్ ఫార్మర్' బిరుదును పొందారు. వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన అనేక కమిటీల్లో సభ్యుడిగా వ్యవహరించారు. నరసింహరాజు యాదవ్ అంత్యక్రియలను సాయంత్రం గూడురు శ్మశానవాటికలో నిర్వహించారు.

రూ.కోటిన్నర విలువైన భవనం వితరణ

నేడు ప్రభుత్వానికి గృహం పత్రాలు అందజేయనున్న మొటపర్తి కుటుంబం



దాత మొటపర్తి కుటుంబానికి చెందిన ఇల్లు

దెందులూరు: తాను జన్మించిన గ్రామానికి తన వంతు సాయం అందించాలన్న గొప్ప ఆలోచనతో ఏలూరు జిల్లా దెందులూరు గ్రామానికి చెందిన దాత, ఉన్నత విద్యావంతుడు మొటపర్తి వెంకట సుబ్బారావు, రామచంద్రమ్మ దంపతులు ఇప్పటి వరకు రూ.4 కోట్లకు పైగా విలువైన స్థలాలు, వాటిలో దేవాలయాలు, వైద్యశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి ఉచితంగా అందించారు. తల్లిదండ్రుల ఆశయాలు అందిపుచ్చుకున్న వారి కుమారుడు మొటపర్తి వెంకట్ తన తల్లితో కలిసి తాజాగా సుమారు రూ.కోటిన్నరకు పైగా విలువ చేసే తమ గృహాన్ని ప్రభుత్వానికి వితరణగా ఇచ్చారు. శనివారం దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తి చేయనున్నారు. స్నేహితుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ సమక్షంలో రిజిస్ట్రేషన్ చేయించి జిల్లా కలెక్టర్‌కు దాత వెంకట్, రామచంద్రమ్మ అందజేయనున్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదివి లక్ష్యాలను సాధించాలి

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



విజయవాడ స్టెల్లా కళాశాలలో 'పరీక్ష పే చర్చా'ను తిలకిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఏకాగ్రతతో విద్యపై దృష్టి కేంద్రీకరించి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. న్యూఢిల్లీలోని తల్కతోరా స్టేడియంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నిర్వహించిన 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని మేరీ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులతో ప్రత్యక్ష ప్రసారం ద్వారా గవర్నర్ వీక్షించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పరీక్ష అనేది జీవితానికి ముగింపు కాదని.. ఫలితాల గురించి అతిగా ఆలోచించకూడదని సూచించారు. పరీక్ష విధానం విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడుతుందన్నారు. యోగా, ధ్యానం, చేయడం ద్వారా మనస్సును నియంత్రించుకుని, మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. పరీక్షా పే చర్చ ద్వారా ప్రధాని మోదీ విద్యార్థులకు ఇచ్చిన సూచనలు పాటించి భవిష్యత్తును నిర్మించుకోవాలని చెప్పారు. అనంతరం పటమట కోనేరు బసవయ్యచౌదరి బాలుర ఉన్నత పాఠశాల, పటమటలోని గోవిందరాజులు ఇనాం ట్రస్ట్ వీఎంసీ మునిసిపల్ హైస్కూల్(జీడీఈటీ), మేరీ స్టెల్లా కళాశాల, పటమటలంక కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎగ్జామినేషన్ వారియర్ పుస్తకాలను అందజేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల బంక్

ఖైదీలకు స్వేచ్ఛా జీవనం గడిపే అవకాశం కల్పిస్తున్న ఒంగోలు జైలు



- రోజుకు రూ.200 ఆర్జిస్తున్న ఖైదీలు
- రోజుకు రూ.5 లక్షల వరకు అమ్మకాలు
- జైళ్ల శాఖకు రూ.2.50 లక్షల వరకు ఆదాయం



ద్విచక్ర వాహనాలకు గాలి పడుతున్న ఖైదీ సుబ్బయ్య

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఒంగోలు సంతపేటలోని జిల్లా జైలు వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఖైదీలే నిర్వహిస్తున్నారు. వాహనాల్లో పెట్రోల్, డీజిల్ నింపేవారు.. వాహనాలకు గాలి పట్టే వారితోపాటు క్యాష్ కౌంటర్‌లో ఉండే వ్యక్తి వరకు అందరూ జీవిత ఖైదు అనుభవిస్తున్న వారే కావడం విశేషం. 2018లో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ బంక్ ఏర్పాటు చేయగా.. ఈ బంక్‌లో సత్ప్రవర్తనతో పని చేయడం ద్వారా ఏడుగురు ఖైదీలు శిక్ష తగ్గి ఇళ్లకు వెళ్లిపోయారు. మరో నలుగురికి సైతం శిక్షలు తగ్గి ఇళ్లకు వెళ్లేందుకు అర్హత సాధించారు. ప్రస్తుతం ఇందులో 10 మంది పని చేస్తున్నారు. నిత్యం రూ.5 లక్షల విలువైన పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక్కడ పని చేసినందుకు గాను ప్రతి ఖైదీ రోజుకు రూ.200 ఆదాయాన్ని కూడా సమకూర్చుకుంటున్నారు. ఈ బంక్ ద్వారా జైళ్ల శాఖకు నెలకు సుమారు రూ.2.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది.

ఇక్కడ పనిచేస్తే మంచి మార్కులు

జీవిత ఖైదీలుగా శిక్ష అనుభవిస్తూ మంచి ప్రవర్తనతో మెలుగుతున్న వారిని మాత్రమే ఆరు బయట ఖైదీలుగా ఎంపిక చేసి పెట్రోల్ బంక్‌లో పనిచేసే అవకాశం కల్పిస్తోంది జైళ్ల శాఖ. బంక్‌లో నెల రోజులపాటు ఖైదీలు పనిచేస్తే 8 రోజుల చొప్పున శిక్ష తగ్గుతుంది. ఎన్ని నెలలు పనిచేస్తే అన్ని నెలలపాటు 8 రోజుల చొప్పున తగ్గించుకుంటూ వెళతారు. దీంతోపాటు ప్రత్యేకంగా సంవత్సరంలో మరో 30 రోజుల శిక్ష తగ్గించే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం ప్రత్యేకంగా మరో 60 రోజుల పాటు శిక్షను తగ్గించే వెసులుబాటు ఉంది. పెరోల్‌పై 14 రోజుల పాటు ఖైదీలు తమ ఇళ్లకు వెళ్లి శుభకార్యాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. ఆ కాలాన్ని కూడా శిక్షలో తగ్గించేలా వెసులుబాటు కల్పిస్తారు. మొత్తం మీద శిక్షపడిన మూడేళ్ల నుంచి ఈ తగ్గింపు శిక్ష కార్యక్రమాన్ని అమల్లోకి తెస్తారు. మొత్తం మీద శిక్షను తగ్గించే వెసులుబాటు విధించిన శిక్ష కంటే మూడో వంతుకు తక్కువగా ఉంటుంది.

సత్ప్రవర్తనతో మెలుగుతున్నా



హత్య కేసులో నాకు శిక్ష పడింది. ఇప్పటికే పదేళ్లుగా శిక్ష అనుభవిస్తున్నాను. మంచి ప్రవర్తనతో మెలుగుతుండటంతో ఇక్కడి అధికారులు పెట్రోల్ బంక్‌లో పనిచేసే అవకాశం కల్పించారు.
– డి.సుధాకర్, చీరాల, జీవిత ఖైదీ

పశ్చాత్తాప పడుతున్నా

క్షణికావేశంలో తప్పు చేశా. కుటుంబాలకు దూరమై బాధ పడుతున్నాం. జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదని నిర్ణయించుకున్నా. ఖైదీలతోపాటు వారి కుటుంబాలు కూడా ఇళ్ల వద్ద ఉండి శిక్ష అనుభవిస్తున్నాయి. శిక్ష పడి ఏడేళ్లు పూర్తయింది. మంచి ప్రవర్తనతో మెలగడంతో పెట్రోల్ బంక్‌లో పనిచేసే అవకాశం కలిగింది.
– జి.సుబ్బయ్య, అర్ధవీడు, జీవిత ఖైదీ

పరివర్తన తీసుకొచ్చే దిశగా..



ఈ బంక్‌లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మూడు షిఫ్టుల్లో ఖైదీలు పని చేస్తారు. శిక్ష అనుభవిస్తున్న వారిలో పరివర్తన తీసుకొచ్చేలా తీర్చిదిద్దుతున్నాం. వారి ప్రవర్తనను బట్టి ఆరుబయట ఖైదీలుగా మెలిగే వెసులుబాటు కల్పిస్తున్నాం. జీవిత ఖైదు అనుభవిస్తున్న వారిని మంచి ప్రవర్తనను బట్టి మార్కులు వేస్తాం. తదనుగుణంగా వారి శిక్షాకాలం తగ్గుతుంది.
– పి.వరుణారెడ్డి, జైలు సూపరింటెండెంట్

ఫిబ్రవరి 10 నుంచి షార్ట్‌ఫిల్మ్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబటి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఔత్సాహిక లఘు చిత్ర నిర్మాతలకు ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహనకృష్ణ తెలిపారు. మధు ఫిలిం స్టూడియోస్ నిర్వహణలో, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహకారంలో గుంటూరు జిల్లా మంగళగిరిలోని హ్యాపీ రిసార్ట్స్ రిక్రియేషన్స్‌లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజిసర్కిల్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం షార్ట్‌ఫిల్మ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మధుమోహనకృష్ణ మాట్లాడుతూ నేటి యువతలోని ప్రతిభను వెలికి తీసేందుకు షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ దోహదపడుతుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉత్తమ దర్శకుడు, కెమెరామెన్, సంగీత దర్శకుడు, నటుడు, ఉత్తమ నటీనటులను ఎంపిక చేసి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని చెప్పారు. పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98482 95555, 92911 93333 సెల్ నంబర్లలో సంప్రదించొచ్చని పేర్కొన్నారు. బిగ్‌బాస్ కంటెస్టెంట్ సాల్మన్‌షానీ, కమిటీ సభ్యులు హెచ్.వి.ఆర్.ఎస్. ప్రసాద్, దొంతాల ప్రకాష్, నందివాడ నాని, కిరణ్ నందివాడ, దిలీప్‌రాజా పాల్గొన్నారు.

తెలుగువారి మదిలో 'జమున' చిరస్మరణీయం

మంత్రులు చెల్లుబోయిన, కారుమూరి సంతాపం



సాక్షి, అమరావతి: సీనియర్ నటి, మాజీ ఎంపీ జమున మృతిపట్ల ఏపీ బీసీ సంక్షేమ, సమాచార ప్రసార, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తంచేశారు. తొలితరం తెలుగు హీరోయిన్లలో ప్రత్యేక ముద్ర వేసుకున్న జమున తెలుగువారందరి హృదయాలలో గుర్తుండిపోయే పాత్రలు పోషించారన్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, శోభన్‌బాబు, కృష్ణ వంటి ప్రముఖ హీరోలందరితోను నటించిన ఆమె మన తెలుగువారందరి మదిలో తన నటనతో చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి మన మధ్య నుండి వెళ్లిపోవడం చాలా బాధాకరమంటూ ఆమె కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జమున ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

సీపీఎం, సీపీఐ సంతాపం

జమున మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాటక, సినీ రంగాలతోపాటు ఎంపీగాను రాజకీయాల్లో ఆమె సేవలు అందించారని వివరించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే, జమున భౌతికకాయంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ప్రజా నాట్య మండలి జెండాకప్పి నివాళులు అర్పించారు.

రూ.70 కోట్లతో కాణిపాకం ఆలయ అభివృద్ధి

ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు



సమావేశం వివరాలు వెల్లడిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో రూ.70 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. శుక్రవారం ఆలయ సమావేశ మందిరంలో ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం, నిత్యాన్నదానం తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఆ వివరాలను చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు విలేకరులకు వెల్లడించారు. ప్రస్తుతం రెండు వేల మంది నిత్యాన్నదానం స్వీకరిస్తున్నారని, నిత్యాన్నదానం భవనం మిద్దెపైన కూడా అన్న ప్రసాదం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.70 కోట్లతో మాస్టర్ ప్లాన్‌లో ఉన్న అన్నదాన నూతన కాంప్లెక్స్, నూతన క్యూ కాంప్లెక్స్, బస్‌స్టాండ్ వద్ద నూతన కాంప్లెక్స్ నిర్మించడానికి ద్రోణ కన్‌స్ట్రక్షన్‌తో ఒప్పందం కుదిరిందని చెప్పారు.

స్వామివారి ఆస్తుల వివరాలు :

స్వామివారి ఆలయంలో బంగారం 17 కిలోలు, వెండి 1,201 కేజీలు, వివిధ బ్యాంకుల్లో రూ.144కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, సేవింగ్ బ్యాంక్ ఖాతాల్లో రూ.18 కోట్లు, గో సంరక్షణకు సంబంధించి రూ.21 లక్షలు, నిత్య అన్నదానానికి సంబంధించి బ్యాంకులో రూ.2.93 కోట్లు ఉన్నాయని వారు వెల్లడించారు.

ఎస్పీ మలికాగర్గ్‌కు నోబెల్ అవార్డు గ్రహీత అభినందన

చిన్నారిపై లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి మరణ శిక్ష పడేలా చేసిన ఎస్పీ



ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్



నోబెల్ అవార్డు గ్రహీత సత్యార్థి

ఒంగోలు టౌన్: ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి, హత్య కేసును స్వయంగా పర్యవేక్షించి నిందితుడికి ఉరిశిక్ష పడేలా చేసిన ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్‌ను ప్రముఖ బాలల హక్కుల ఉద్యమ కారుడు, నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసుల పనితీరును ప్రశంసించారు. డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు 2022లో అధిక సంఖ్యలో నేరనిరూపణ చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేశారని చెప్పారు. శుక్రవారం ఎస్పీకి ఫోన్ చేసిన ఆయన.. కేసు వివరాలు, మానిటరింగ్ టీం పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడేళ్ల బాలికపై దగ్గరి బంధువు ఒకరు లైంగిక దాడి చేసి హత మార్చాడు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని డ్రైనేజీలో పడేశాడు. వెంటనే స్పందించిన ఎస్పీ.. సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. పోక్సో కేసు నమోదు చేసి స్వయంగా పర్యవేక్షించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ టీం ద్వారా కోర్టులో ప్రత్యేక సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నిందితుడికి మరణశిక్ష పడేలా కృషి చేశారు. బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా గతేడాది కాలంలో మహిళలు, బాలికలకు సంబంధించిన మొత్తం ఎనిమిది కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ఎస్పీ మలికాగర్గ్ కృషి చేశారు.

కనుల పండువకు వేళాయె

- నేటి నుంచి లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవాలు
- రథసప్తమి వేడుకలతో ప్రారంభం



అంతర్వేది పుణ్యక్షేత్రం (ఫైల్)



లక్ష్మీ నరసింహస్వామి

సఖినేటిపల్లి: అంతర్వేదిలో సాగర తీరాన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని కల్యాణ మహోత్సవాలకు పుణ్యక్షేత్రం సిద్ధమైంది. ఈ క్షేత్రంలో వశిష్ట మహర్షి ప్రతిష్ఠించిన లక్ష్మీనృసింహుని కల్యాణ మహోత్సవాలు శనివారం రథసప్తమి రోజున ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 6 తేదీ వరకూ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు రథసప్తమి..

సర్వజగత్తుకు వెలుగును ప్రసాదించిన రోజు ఇది. ఉత్తరాయణ పుణ్యకాలంలో సూర్యగమనం దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు మారడం రథసప్తమి నుంచే ఆరంభం కావడం ఈ రోజుకున్న ప్రాధాన్యతలలో ఒకటి. రథసప్తమి రోజున ఆదిత్యుని సేవిస్తే రోగ, శోక, పాప ఫలాలు నశిస్తాయన్నది భక్తుల నమ్మిక. రథసప్తమి రోజున రథానికి అర్చకులు చేసే పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ప్రాంగణంలో ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ నిలువెత్తు విగ్రహానికి దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, అగ్నికుల క్షత్రియులు పూలమాలలు వేసి నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగింపు..

సూర్యభగవానుడి పుట్టినరోజు రథసప్తమి నాడు ప్రారంభమయ్యే వేడుకల్లో తొలి రోజు సూర్యవాహనం, చంద్రప్రభ వాహనంపై స్వామివారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారికి ఉన్న వాహనాల్లో మొదటి రోజున పై రెండు వాహనాల్లో గ్రామోత్సవాలు అర్చకులు నిర్వహిస్తారు.

అపూర్వ ఘట్టం ముద్రికాలంకరణ..

రథసప్తమి రోజున ఆదిదేవుడిని పెళ్లి కొడుకుగా చేయడం. అమ్మవారిని పెళ్లి కుమార్తె చేయడం అపూర్వ ఘట్టం. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబ సభ్యులు సంయుక్తంగా స్వామి, అమ్మవార్లకు ముద్రికాలంకరణ నిర్వహిస్తారు. బుగ్గన చుక్కపెట్టి స్వామివారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెగా చేయడం ముద్రికాలంకరణ. అనంతరం స్వామి, అమ్మవార్లు అర్చకుల విశేష పూజలు అందుకుంటారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పిస్తారు.

ఉత్సవాల షెడ్యూల్

28వ తేదీ రథథసప్తమి. ముద్రికాలంకరణ. 29న గరుడ, పుష్పక వాహనాలపై గ్రామోత్సవాలు. 30వ తేదీ హంసవాహనం, శేషవాహనంపై గ్రామోత్సవం, ధూపసేవ, ధ్వజారోహణ. 31వ తేదీ దశమి పంచముఖ ఆంజనేయస్వామి వాహనం, కంచుగరుడ వాహనంపై గ్రామోత్సవం. రాత్రి 12–46 గంటలకు రోహిణి నక్షత్రయుక్త తులా లగ్నంలో శ్రీస్వామివారి కల్యాణం. ఫిబ్రవరి ఒకటవ తేదీ భీష్మ ఏకాదశి నాడు రథోత్సవం. ఫిబ్రవరి 2న గజ, పొన్నవాహనాలపై గ్రామోత్సవం. రాత్రి అన్న పర్వత మహానివేదన. ఫిబ్రవరి 3న హనుమద్వాహనం, సింహవాహనంపై గ్రామోత్సవం. సాయంత్రం సదస్యం. ఫిబ్రవరి 4న రాజాధిరాజ వాహనం, అశ్వవాహనంపై గ్రామోత్సవం. రాత్రి 16 స్తంభాల మంటపం వద్ద చోర సంవాదం. ఫిబ్రవరి 5న గరుడ పుష్పక వాహనంపై స్వామి గ్రామోత్సవం, చక్రవారి అవభృథోత్సవం, సముద్రస్నానం, ధ్వజఅవరోహణ. ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం 5గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవం, 6గంటలకు చెరువులో హంస వాహనంపై తెప్పోత్సవం. రాత్రి 8 గంటలకు ఉత్సవ మూర్తులకు తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్ఠి, స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాల ముగింపు.

వరుసగా పశువులపై పెద్దపులి దాడి

పదిరోజుల వ్యవధిలో మూడుసార్లు పంజా • ఎద్దు, ఆవు మృతి.. ఆందోళనలో ప్రజలు



అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి (ట్రాప్ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం)

అర్ధవీడు (కంభం): ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో పశువులపై వరుసగా పెద్ద పులి దాడి చేస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పది రోజుల క్రితం మాగుటూరు గ్రామంలో పులి దాడి చేయడంతో ఎద్దు మృతిచెందింది. మళ్లీ రెండు రోజుల తర్వాత వెలగలపాయలోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన మరో ఎద్దుపై పులి దాడి చేస్తున్న సమయంలో దూరం నుంచి రైతు అరవడంతో పారిపోయింది. ఈ రెండు ఘటనలు మరువకముందే గురువారం రాత్రి మాగుటూరు సమీపంలో ఆవుపై పులి దాడి చేసింది. దీంతో ఆవు చనిపోయింది. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం మాగుటూరు, లక్ష్మీపురం, కాకర్ల అటవీ ప్రాంతాలను పరిశీలించారు. పులి దాడిలో చనిపోయిన ఆవు కళేబరాన్ని పరిశీలించి, ఆ పరిసరాల్లో ఉన్న పులి పాదముద్రలను సేకరించారు. అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న దృశ్యాలు ట్రాప్ కెమెరాలో నిక్షిప్తమైనట్లు గుర్తించారు. ఒంటరిగా ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లవద్దని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

విశాఖ–చెన్నై కారిడార్‌లో వందే భారత్ రైలు నడపండి

రైల్వేమంత్రికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఈస్ట్‌కోస్ట్ ఎకనామిక్ కారిడార్‌లో కీలక ప్రాంతమైన విశాఖపట్నం–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో వందేభారత్ రైలును నడపాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన శుక్రవారం లేఖ రాశారు. వందేభారత్ రైలు వల్ల ఈ మార్గంలో వ్యాపార అవకాశాలు సృష్టించడంతోపాటు అంతర్రాష్ట్ర వాణిజ్య అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్యానికి మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. సికింద్రాబాద్–తిరుపతి మధ్య పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా కూడా వందేభారత్ రైలు ప్రారంభించాలని ఎంపీ కోరారు.

విదేశాలకు గుంటూరు ఘాటు

- 2025 నాటికి రూ.4,661 కోట్ల మిర్చి ఎగుమతులే లక్ష్యం
- మలేషియా, థాయ్‌లాండ్‌పై ప్రత్యేకంగా దృష్టి
- చిల్లీసాస్, పికిల్, పేస్ట్, ఆయిల్ తయారీ యూనిట్లకు చేయూత
- కార్యాచరణ సిద్ధం చేసిన పరిశ్రమల శాఖ



2021-22లో ప్రధాన దేశాలకు మిర్చి ఎగుమతులు ఇలా

దేశం	టన్నులు	విలువ రూ.కోట్లల్లో)
చైనా	77,365	1,296
థాయ్‌లాండ్	25,032	465
బంగ్లాదేశ్	36,004	443
శ్రీలంక	26,595	374
మలేషియా	16,092	323
ఇండోనేషియా	19,012	289

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన సన్న రకం మిర్చి ఘాటును మరిన్ని దేశాలకు రుచి చూపేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రస్తుతం గుంటూరు జిల్లా నుంచి ఏటా రూ.3,502 కోట్ల విలువైన మిర్చి ఎగుమతులు జరుగుతుండగా 2024–25 నాటికి రూ.4,661 కోట్లకు పెంచేలా ప్రణాళిక రూపొందించింది. జిల్లాల వారీగా ఉత్పత్తులను గుర్తించి ఎగుమతులను పెంచేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన వెల్లడించారు. ప్రస్తుతం గుంటూరు నుంచి సుమారు 16 దేశాలకు మిర్చి ఎగుమతి అవుతుండగా అత్యధికంగా చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, మలేషియా, ఇండోనేషియాకు అత్యధికంగా జరుగుతున్నాయి. మిగిలిన దేశాలకు ఎగుమతులు నామమాత్రంగా ఉన్నాయి. థాయ్‌లాండ్ ఏటా దిగుమతి చేసుకుంటున్న మిర్చిలో గుంటూరు నుంచి 56.7 శాతం, మలేషియా 45.6 శాతం మాత్రమే ఉండటంతో ఎగుమతులు మరింత పెంచేలా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ జీఎస్ రావు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా ప్యాకింగ్ లేకపోవడం, ఎండబెట్టడం లాంటి సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లు సరిపడా లేకపోవటాన్ని ప్రధాన సమస్యలుగా గుర్తించారు. దీన్ని అధిగమించేందుకు 121.6 ఎకర్లాల్లో స్పైసెస్ పార్క్‌తో పాటు క్లస్టర్ వ్యవస్థ అభివృద్ధి, ఎగుమతుల అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను అభివృద్ధి చేయనున్నారు. మిర్చి ఉప ఉత్పత్తులను ప్రోత్సహించేలా చిల్లీసాస్, చిల్లీ పికిల్, చిల్లీ పేస్ట్, చిల్లీ ఆయిల్ లాంటి తయారీ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక చేయూత అందించనున్నారు.


గుంటూరు మిర్చి ప్రత్యేకతలివే..

మూడు నుంచి 5 సెంటీమీటర్ల పొడవైన గుంటూరు సన్న రకం మిరప ఎర్రటి ఎరుపుతో ఘాటు అధికంగా ఉంటుంది. విటమిన్ సి, ప్రోటీన్లు అధికంగా ఉండటం దీని ప్రత్యేకత. గుంటూరు మిర్చికి 2009లో భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించింది. సన్న రకం మిర్చి సాగుకు గుంటూరు జిల్లా వాతావరణం అనుకూలం కావడంతో 77,000 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఈ మిర్చిని వంటల్లోనే కాకుండా సహజ సిద్ధమైన రంగుల తయారీలో వినియోగిస్తారు. కాస్మొటిక్స్, పానియాలు, ఫార్మా స్యూటికల్స్, వైన్ తయారీతో పాటు పలు రంగాల్లో ఈ మిర్చి ఉత్పత్తులను వినియోగిస్తారు. ఇన్ని విశిష్టతలున్న గుంటూరు మిర్చిపై చైనా ప్రత్యేకంగా దృష్టి సారించింది. చైనా ఏటా దిగుమతి చేసుకునే మిర్చిలో 86.7 శాతం భారత్ నుంచే కావడం గమనార్హం. గుంటూరు జిల్లా నుంచి 2021–22లో చైనాకు రూ.1,296 కోట్ల విలువైన మిర్చి ఎగుమతులు జరిగాయి.

క్లుప్తంగా

2 రోజుల్లోనే రూ. 200 కోట్లపైమాటే..

భారీగా వసూళ్లు రాబడుతున్న 'పఠాన్'



న్యూఢిల్లీ: బాలీవుడ్ కింగ్‌ఖాన్ షారూక్ ఖాన్, దీపికా పదుకోన్ నటించిన పఠాన్ మూవీ భారీగా వసూళ్లు సాధిస్తోంది. ఈ నెల 25న విడుదలైన ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా వసూలు చేసింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత షారూక్‌కు పెద్ద విజయం దక్కింది. ''వెనక్కి తిరిగిరావడం కోసం ప్లాన్ చేసుకోవద్దు. ముమ్మందుకే అడుగులు వేయాలి. వెనక్కి తగ్గొద్దు. ప్రారంభించిన పనిని ముగించేందుకు ప్రయత్నించండి'' అని సోషల్ మీడియాలో కింగ్‌ఖాన్ సూచించారు. చిత్ర విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పఠాన్ చిత్రాన్ని ప్రఖ్యాత యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది.

మోర్బీ ఘటనలో అభియోగాలు నమోదు

మోర్బీ: గుజరాత్‌లోని మోర్బీ పట్టణంలో గత ఏడాది అక్టోబర్‌లో 135 నిండు ప్రాణాలను బలిగొన్న తీగల వంతెన కుప్పకూలిన దుర్ఘటన కేసులో రాష్ట్ర పోలీసులు శుక్రవారం అభియోగాలు నమోదు చేశారు. ఈ కేసులో 9 మంది అరెస్ట్ అయ్యారు. పదో నిందితుడిగా తీగల వంతెనకు మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరణ పనులు చేసిన ఒరెవా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జయ్‌సుఖ్ పటేల్ పేరును చేర్చారు. ఈ విషయాన్ని బాధితుల తరపు లాయర్ దిలీప్ వెల్లడించారు. జయ్‌సుఖ్ పటేల్‌ను అరెస్ట్ చేయాల్సిందిగా మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బ్రిటిష్ కాలం నాటి ఈ తీగల వంతెనకు ఒరెవా గ్రూప్ మరమ్మతులు నిర్వహించిన విషయం తెలిసిందే.

త్వరలోనే ఇతర పార్టీలతో చర్చలు: నితీశ్

పట్నా: 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి భావ సారూప్యత గల పార్టీలతో త్వరలోనే చర్చలు జరుపుతామని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ చెప్పారు. బీజేపీని విభేదించే పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికలపై వ్యూహరచన చేస్తామన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగిసిన వెంటనే ఇందుకు సంబంధించిన భేటీ జరుగుతుందన్నారు. జోడో యాత్ర కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారమని ఆయన చెప్పారు. బిహార్‌లోని మహా కూటమి ప్రభుత్వంలో జేడీయూ, కాంగ్రెస్ వంటి ఏడు పార్టీలు భాగస్వాములుగా ఉన్న విషయం తెలిసిందే.

అడ్డదారులను నమ్ముకుంటే కష్టాలే

'పరీక్షా పే చర్చ'లో ప్రధాని నరేంద్ర మోదీ హితవు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ప్రధాని మోదీ

- కేవలం తెలివితేటలను నమ్ముకోండి
- ఫోన్లపై కాదు.. చదువులపై దృష్టి పెట్టండి
- ఎలక్ట్రానిక్ పరికరాలను అతిగా వాడొద్దు
- తరచుగా 'టెక్నాలజీ ఉపవాసం'తో మేలు
- విద్యార్థుల పరిధి మరింత విస్తృతం కావాలి
- వారిని ఆంక్షల వలయంలో బందీలను చేయొద్దు
- పరీక్ష ఫలితాలే జీవితానికి ముగింపు కాదు

న్యూఢిల్లీ: విద్యార్థులు షార్ట్‌కట్‌లను (అడ్డదారులు) ఎప్పుడూ నమ్ముకోవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. పరీక్షల్లో చీటింగ్ చేయడం వల్ల ఒకటి రెండు సార్లు లాభపడొచ్చేమో గానీ భవిష్యత్తులో మాత్రం కష్టాలు తప్పవని హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో ఆరో ఎడిషన్ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. పరీక్షల వేళ ప్రధానంగా చదువులపైనే దృష్టి పెట్టాలని సూచించారు. దృష్టి మళ్లించే పనులకు దూరంగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అతిగా వాడొద్దని, తెలివితేటలపై నమ్మకం ఉంచాలి తప్ప మొబైల్ ఫోన్లపై కాదని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ వల్ల చదువుల్లో నష్టపోకుండా జాగ్రత్తపడాలన్నారు. ఫోన్లు వాడడానికి, సోషల్ మీడియా ద్వారా ఇతరులతో అనుసంధానం కావడానికి ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించుకోవాలని చెప్పారు.

ఏకాగ్రత మొత్తం చదువుపైనే..

పరీక్షల్లో కాపీయింగ్ గురించి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. తప్పుడు పనుల వల్ల చెడ్డ ఫలితమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. నిజాయితీగా కష్టపడే తత్వమే జీవితంలో మనల్ని ముందుకు తీసుకెళ్తుందని విద్యార్థులకు ఉద్బోధించారు. ఒత్తిళ్లకి లోను కాకుండా పరీక్షలకు ప్రశాంతంగా సిద్ధం కావాలని అన్నారు. మన బలాలను మనం సరిగ్గా అర్థం చేసుకుంటే ఒత్తిడికి తావుండదని వివరించారు. పిల్లలపై కుటుంబ సభ్యులు ఎన్నో అంచనాలు పెట్టుకోవడం సహజమేనని గుర్తుచేశారు. పరీక్ష ఫలితాలు జీవితానికి ముగింపు కాదని స్పష్టం చేశారు. తన వైపు విసిరే బంతిపైనే క్రికెట్ క్రీడాకారుడు ఫోకస్ చేస్తాడని, ఫోర్లు, సిక్సుల కోసం వినిపించే అరుపులను ఏమాత్రం పట్టించుకోడని, విద్యార్థులు సైతం అలాగే ఉండాలని, వారి ఏకాగ్రత మొత్తం చదువుపైనే ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల చదువులు, వారు సాధించబోయే మార్కుల గురించి తల్లిదండ్రులు గొప్పలు చెబుతుంటారని, విద్యార్థుల్లో ఒత్తిడికి ఇది కూడా ఒక కారణమని ఉద్ఘాటించారు. పిల్లలు చెప్పింది విశ్వసించాలని తల్లిదండ్రులకు హితవు పలికారు. పరీక్ష ఫలితాల గురించి లేనిపోని అంచనాలు పెట్టుకోవద్దని అన్నారు.

ప్రశ్నలడిగే వారిని స్వాగతించాలి

విద్యార్థుల పరిధి మరింత విస్తృతం కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. 10, 12వ తరగతుల పరీక్షలు పూర్తయిన తర్వాత విద్యార్థులకు కొంత డబ్బు ఇవ్వాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆ డబ్బుతో కొత్త ప్రాంతాల్లో పర్యటించాలని, అక్కడి అనుభవాలను పుస్తకంలో రాయాలని విద్యార్థులతో చెప్పారు. పిల్లలను ఆంక్షల వలయంలో బందీలను చేయడం ఎంతమాత్రం సరి కాదన్నారు. కొత్త ప్రాంతాలను దర్శించేలా, కొత్త మనుషులను కలిసి మాట్లాడేలా ప్రోత్సహించాలన్నారు. ప్రశ్నలడిగే విద్యార్థులను స్వాగతించాలని ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ సూచించారు. ఒక విద్యార్థి ప్రశ్నలు అడుగుతున్నాడంటే అతడిలోని పరిశోధకుడు మేల్కొన్నట్లు గుర్తించాలని, అది చాలా మంచి పరిణామం అని తెలియజేశారు.

ఏది మంచి? ఏది చెడు?

దేశంలో పౌరులు నిత్యం సగటున 6 గంటలకు పైగానే ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు చూస్తున్నట్లు ఒక అధ్యయనంతో తేలిందని నరేంద్ర మోదీ వెల్లడించారు. గాడ్జెట్లకు జనం బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకొనే జ్ఞానాన్ని, స్వతంత్ర వ్యక్తిత్వాన్ని దేవుడు మనకు ఇచ్చాడని, గాడ్జెట్లకు బానిసలుగా మారకుండా ఇకనైనా అప్రమత్తంగా ఉందామని పిలుపునిచ్చారు.

భారత్ 'సగటు' దేశం కాదు

ప్రభుత్వంలో సగటు(యావరేజ్) వ్యక్తులే ఉన్నారని, భారత్ ఒక సగటు దేశంగానే కొనసాగుతోందంటూ వస్తున్న విమర్శలను ప్రధాని మోదీ తిప్పికొట్టారు. భారత్ సగటు దేశం ఎంతమాత్రం కాదని తేల్చిచెప్పారు. ప్రపంచంలో మన దేశం వెలిగిపోతోందని, ప్రపంచ దేశాలకు భారత్ ఒక ఆశారేఖగా మారిందని స్పష్టం చేశారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనని అన్నారు. గొప్ప విజయాలు సాధించిన వారిలో చాలామంది ఒకప్పుడు సగటు వ్యక్తులేనని వ్యాఖ్యానించారు. అందరూ 'తీస్‌మార్‌ఖాన్'లు కావాల్సిన అవసరం లేదన్నారు. విమర్శలకు, ఆరోపణలకు మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. విమర్శ అనేది మనం బలంగా మారడానికి ఉపయోగపడే ఒక టానిక్ లాంటిదన్నారు. ఎవరైనా ఆరోపణలు చేస్తే సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని విద్యార్థులకు సూచించారు. కొందరు ఎప్పుడూ ఆరోపణలు చేస్తుంటారని, వారి అసలు ఉద్దేశం వేరే ఉంటుందని, పట్టించుకోవద్దని చెప్పారు.

తెలివిగా వాడుకోవడమే తెలివి

మీ గాడ్జెట్ మీ కంటే తెలివైందని ఎన్నడూ అనుకోవద్దని విద్యార్థులతో మోదీ చెప్పారు. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియాకు బానిసలుగా మారొద్దన్నారు. తరచుగా 'టెక్నాలజీ ఉపవాసం' చేయాలన్నారు. ఫోన్లను పూర్తిగా పక్కన పెట్టాలని వెల్లడించారు. అలాగే ప్రతి ఇంట్లో టెక్నాలజీ-ఫ్రీ-జోన్ ఉండాలన్నారు. దీనివల్ల ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తుందని, పిల్లలు గాడ్జెట్స్‌కు బానిసలుగా మారకుండా ఉంటారని వివరించారు. తాను రాజకీయాల్లో చురుగ్గా ఉన్నప్పటికీ చేతిలో ఫోన్‌తో చాలా అరుదుగా కనిపిస్తుంటానని మోదీ తెలిపారు. ఫోన్‌లో మాట్లాడడానికి కొంత సమయం కేటాయించుకుంటానని అన్నారు. టెక్నాలజీని పూర్తిగా పరిహరించాలని తాను చెప్పడం లేదని, మనకు అవసరమైన పరికరాలు అవసరమైనంత మేరకే వాడుకోవడం ఉత్తమమని వెల్లడించారు. మనం తెలివైనవాళ్లమా? లేక మన ఫోన్ తెలివైనదా? అనేది విద్యార్థులు నిర్ణయించుకోవాలన్నారు. ఫోన్ మాత్రమే తెలివైందని భావిస్తే సమస్య మొదలైనట్లేనని పేర్కొన్నారు. ఫోన్‌ను తెలివిగా వాడుకోవడంలోనే తెలివి దాగి ఉందన్నారు. ఫోన్‌ను ఉత్పాదకత పెంచుకోవడానికి ఉపయోగపడే ఒకపరికరంగా భావించాలని కోరారు.

జోడో యాత్రలో భద్రతా లోపం

అర్థంతరంగా ఆపేసిన రాహుల్ గాంధీ



ఖానాబల్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జమ్మూకశ్మీర్‌లో కొనసాగుతున్న భారత్ జోడో యాత్ర శుక్రవారం అర్థంతరంగా నిలిచిపోయింది. యాత్రకు భద్రత కల్పించడంలో జమ్మూకశ్మీర్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పోలీసులు సరైన ఏర్పాట్లు చేయనందునే యాత్రను నిలిపివేశామని చెప్పారు. జమ్మూలోని బనిహాల్ నుంచి శుక్రవారం ఉదయం యాత్రను ప్రారంభించిన ఆయన అనంతరం బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో జవహర్ టన్నెల్‌ను దాటారు. క్వాజిగుండ్ వద్ద కశ్మీర్ లోయలోకి ప్రవేశించి సుమారు 500 మీటర్లు నడిచాక యాత్రను అకస్మాత్తుగా నిలిపివేశారు. అక్కడ తమకు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వేచి ఉన్నారని, అదుపు చేయాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించకపోవడం దురదృష్టకరమని రాహుల్ మీడియాకు చెప్పారు. వ్యక్తిగత భద్రతా సిబ్బంది సలహా మేరకు మిగతా యాత్రను ఆపేస్తున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం 11 కిలోమీటర్ల మేర సాగి అనంత్‌నాగ్ జిల్లాలోని ఖానాబల్ వద్ద రాత్రి విశ్రాంతి కోసం ఆపేయాల్సి ఉంది. యాత్రకు భద్రతపై కశ్మీర్ యంత్రాంగంతో చర్చిస్తున్నట్లు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సమయంలో రాజకీయాలకు పాల్పడటం దిగజారుడు తనమని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఆరోపణలను జమ్మూకశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ ఖండించారు. బనిహాల్ వద్ద భారీగా జనం గుమికూడే విషయం యాత్ర నిర్వాహకులు ముందుగా తెలపలేదని పేర్కొన్నారు. ఇలా ఉండగా, శుక్రవారం యాత్రలో కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. రాహుల్‌తో కలిసి 3 కిలోమీటర్ల మేర నడిచారు. వణికించే చలిలోనూ రాహుల్, ఒమర్ ఇద్దరూ తెల్ల టీ షర్ట్ ధరించి యాత్రలో పాల్గొన్నారు.

భారత్, చైనా మధ్య మరిన్ని ఘర్షణలు!

డీజీపీల సమావేశంలో అధికారుల నివేదిక

న్యూఢిల్లీ: వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వద్ద డ్రాగన్ దేశం చైనా రెచ్చిపోతోంది. డ్రాగన్ సైన్యం భారత భూభాగంలోకి క్రమంగా చొచ్చుకొస్తూ సరిహద్దును సైతం మార్చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంతే కాకుండా ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన డీజీపీల సమావేశంలో చైనా వ్యవహారంపై అధికారులు సమర్పించిన ఓ నివేదికలో పలు సంచలన అంశాలు బహిర్గతమయ్యాయి. సరిహద్దు ప్రాంతంలో చైనా కొత్త సైనిక స్థావరాలను ఏర్పాటుచేస్తున్న నేపథ్యంలో భారత్-చైనా సైనికుల నడుమ మరిన్ని ఘర్షణలు జరగవచ్చని అంచనా వేస్తున్నట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. దీనిపై అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఒక కథనాన్ని వెలువరించింది. భారత్-చైనాల మధ్య కొన్నేళ్లుగా నెలకొన్న ఉద్రిక్తతలు, నిఘా సంస్థలు సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. ''2013-14 తర్వాత రెండు మూడేళ్లకోసారి ఇరు దేశాల నడుమ ఉద్రిక్తతల తీవ్రత పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. సరిహద్దులో ఇరు దేశాలు పోటాపోటీగా సైనిక బలగాలను పెంచుకుంటున్నాయి. చైనా చర్యల వల్ల తూర్పు లద్దాఖ్‌లో భారత్ ఇప్పటికే పలు కీలక గస్తీ పాయింట్లను కోల్పోయింది. చైనా దూకుడును అడ్డుకోవాలంటే సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధిని వేగవంతం చేయాలి. సరిహద్దు పర్యాటకాన్ని ప్రోత్సహించాలి'' అని సూచించారు.

రాజా చారికి బ్రిగేడియర్ జనరల్ హోదా

ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



వాషింగ్టన్: భారతీయ అమెరికన్ వ్యోమగామి, కల్నల్ రాజా జె.చారి(45) ఎయిర్ ఫోర్స్ బ్రిగేడియర్ జనరల్ హోదాకు ఎంపికయ్యారు. ఈ హోదాకు ఆయన్ను ఎంపిక చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు బైడెన్ గురువారం ఒక ప్రకటన చేశారు. ఈ నియమాకాన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంది. అధ్యక్షుడు జరిపే అన్ని పౌర, సైనిక నియామకాలపై సెనేట్ సాధారణంగా ఆమోదముద్ర వేస్తుంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రాజా చారి టెక్సాస్‌లోని నాసాకు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌లో క్రూ-3 కమాండర్, ఆస్ట్రోనాట్‌గా ఉన్నారు. రాజా చారి తండ్రి శ్రీనివాసా చారి తెలంగాణకు చెందిన వారు. ఆయన హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదివి అమెరికాకు చేరుకున్నారు. వాటర్‌లూలోని జాన్ డీర్ సంస్థలో పనిచేశారు. రాజా చారి మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఏరోనాటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ, మేరీల్యాండ్‌లోని యూఎస్ నేవల్ టెస్ట్ పైలట్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 461వ ఫ్లైట్ టెస్ట్ స్క్వాడ్రన్ కమాండర్‌గా, ఎడ్వర్డ్స్ ఎయిర్ ఫోర్స్ బేస్‌లో ఎఫ్-35 ఇంటిగ్రేటెడ్ టెస్ట్ ఫోర్స్‌కు డైరెక్టర్‌గాను వ్యవహరించారు. రాజా చారి తన కెరీర్‌లో 2,500 గంటలకు పైగా ఫ్లైట్ టైంను సాధించారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్‌లో బ్రిగేడియర్ జనరల్(బీడీ) ఒన్ స్టార్ జనరల్ ఆఫీసర్ స్థాయి. ఇది కల్నల్‌కు ఎక్కువ, మేజర్ జనరల్ స్థాయికి తక్కువ.

సింధు జలాల ఒప్పందాన్ని మారుద్దాం

పాకిస్తాన్‌కు భారత్ నోటీసులు

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య దశాబ్దాల క్రితం నాటి సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఒప్పందాన్ని సవరించాలంటూ పాకిస్తాన్‌కు భారత్ నోటీసులు పంపింది. ఒప్పందం అమలు విషయంలో పాక్ అనుసరిస్తున్న మొండి వైఖరిని భారత్ ఎండగట్టింది. సింధు నదీ జలాల ఒడంబడికకు సంబంధించిన కమిషనర్ల ద్వారా జనవరి 25 పాకిస్తాన్‌కు నోటీసులు పంపినట్టుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందం అమలులో దశాబ్దాలుగా విభేదాలు సాగుతున్నాయి. 'సింధు నదీ జలాల ఒప్పందం అమలుకు అడ్డంకి కలిగించేలా పాకిస్తాన్ చర్యలు ఉంటున్నాయి. నోటీసు అందుకున్న 90 రోజుల్లోగా భారత్, పాకిస్తాన్ మధ్య చర్చలు జరగాల్సి ఉంటుంది. గత 62 ఏళ్లుగా నేర్చుకున్న పాఠాలతో ఒప్పందాన్ని సవరించుకొని ముందుకు సాగే అవకాశం లభిస్తుంది'' అని ఆ వర్గాలు వివరించాయి.

ఏమిటీ ఒప్పందం?

భారత్, పాక్ సరిహద్దుల్లో పారే సింధు నదీ జలాల పంపిణీపై 1960లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం సింధు ఉప నదుల్ని తూర్పు, పశ్చిమ నదులుగా విభజించారు. సట్లెజ్, బియాస్, రావి తూర్పు నదుల జలాలను భారత్ వాడుకోవచ్చు. ఇక జీలం, చీనాబ్, సింధులను పశ్చిమ నదులుగా పేర్కొంటూ వాటిపై హక్కుల్ని పాక్‌కు కట్టబెట్టారు. అయితే పశ్చిమ నదుల్లో జల విద్యుత్, వ్యవసాయ అవసరాలకు నీటిని భారత్ కూడా వినియోగించుకునే హక్కు ఉంది. ఒప్పందం అమలును పర్యవేక్షించడానికి శాశ్వత సింధు కమిషన్ ఏర్పాటైంది. 2017-2022 మధ్య అయిదు సార్లు సమావేశమైనా సమస్యలపై ఏకాభిప్రాయం కుదరలేదు. చివరికి భారత్ ఆ ఒప్పందాన్ని మారుద్దామంటూ పాక్‌కు నోటీసులు పంపింది.

మహారాష్ట్రలో పరువు హత్య

ముంబై: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో వైద్య విద్యార్థిని పరువు హత్యకు గురైంది. ప్రేమ వ్యవహారంతో తమ పరువు తీసిందనే కోపంతో తండ్రి, సోదరుడు ఇతర కుటుంబసభ్యులు కలిసి ఆమెను ఉరి వేసి చంపి, ఆపై దహనం చేశారు. లిబ్‌గావ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పింప్రి మహిపాల్ గ్రామంలో ఈ నెల 22వ తేదీన ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్) మూడో సంవత్సరం చదువుతున్న శుభాంగి జోగ్‌దండ్‌కు ఇటీవల కుటుంబసభ్యులు పెళ్లి సంబంధం కుదిర్చారు. అయితే, తను గ్రామానికే చెందిన మరో వ్యక్తిని ప్రేమిస్తున్నానని, అతడినే పెళ్లి చేసుకుంటానని శుభాంగి వరుడికి తెలిపింది. పెళ్లి ఆగిపోవడంతో గ్రామంలో పరువు పోయిందని కుటుంబసభ్యులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నెల 22 రాత్రి తండ్రి, సోదరుడు, మరో ముగ్గురు కుటుంబసభ్యులు కలిసి శుభాంగిని తమ పొలానికి తీసుకెళ్లి తాడుతో ఉరివేశారు. అనంతరం మృతదేహాన్ని కాల్చివేసి, మిగిలిన ఆనవాళ్లను నీళ్లలో పడవేశారు. ఈ మేరకు ఐదుగురిపై హత్య, తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.


ఢిల్లీ యూనివర్సిటీలో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నం

న్యూఢిల్లీ: గుజరాత్ మత ఘర్షణలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే బాధ్యుడని ఆరోపిస్తూ బీబీసీ రూపొందించిన వివాదాస్పద డాక్యుమెంటరీ స్క్రీనింగ్ సెగలు పెట్టిస్తోంది. ఢిల్లీ యూనివర్సిటీ కేంపస్‌లోని ఆర్ట్స్ ఫ్యాకల్టీ భవనంలో కొంత మంది బయటవారు ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనకు ప్రయత్నించడంతో పోలీసుల్ని పిలవాల్సి వచ్చిందని రిజిస్ట్రార్ వికాస్ గుప్తా చెప్పారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శుక్రవారం 24 మంది విద్యార్థుల్ని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామై మిలియా ఇస్లామియాలో డాక్యుమెంటరీ ప్రదర్శనకు సంబంధించి ఇదే తరహాలో ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే.

ఆరోగ్య పంజాబ్ సృష్టికి తీవ్ర కృషి: సీఎం మాన్

అమృత్‌సర్: పంజాబ్‌ను ఆరోగ్యకరంగా, శక్తివంతంగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తోందని ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ చెప్పారు. ప్రతి రంగంలోనూ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమన్నారు. శుక్రవారం అమృత్‌సర్‌లో ఆయన ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో కలిసి 400 ఆమ్ ఆద్మీ క్లినిక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ ఇచ్చిన హామీలన్నిటినీ మాన్ సర్కార్ నెరవేరుస్తుందని కేజ్రీవాల్ చెప్పారు. ఆప్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పంజాబ్ ప్రజలు ఆకాంక్షలు నెరవేరేందుకు కొద్దిగా ఓపిక పట్టాలన్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 500 ఆమ్ ఆద్మీ క్లినిక్కులను ఏర్పాటు చేయనుండటం సంతోషకరమని చెప్పారు.

దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు 12 చీతాలు



జోహన్నెస్‌బర్గ్/న్యూఢిల్లీ: భారత్‌కు మరో డజను చీతాలు రాబోతున్నాయి. ఈ మేరకు దక్షిణాఫ్రికా, భారత్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా నుంచి విమానంలో వచ్చే చీతాలను మధ్యప్రదేశ్‌లో కునో జాతీయ ఉద్యానవనంలో ఉంచుతారు. దేశంలో అంతరించిపోయిన చీతాల సంతతిని మళ్లీ పెంచేందుకు కొద్ది నెలల క్రితం నమీబియా నుంచి 8 చీతాలను ప్రత్యేక విమానంలో తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాటికి తోడుగా ఫిబ్రవరిలో 12 చీతాలు దక్షిణాఫ్రికా నుంచి వస్తాయని అటవీ, మత్స్య సంపద సంరక్షణ, పర్యావరణ (డీఎఫ్ఎఫ్ఈ) శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణాఫ్రికాతో కుదిరిన ఒప్పందంలో భాగంగా తొలి దశలో 12 చీతాలు వస్తే, ఆ తర్వాత ఎనిమిది నుంచి పదేళ్ల పాటు ఏడాదికి 12 చీతాలు చొప్పున వస్తాయి. ప్రపంచంలోనున్న 7 వేల చీతాల్లో అత్యధికం దక్షిణాఫ్రికా, నమీబియా, బోట్స్‌వానా దేశాల్లో ఉన్నాయి.

నన్ను చంపించేందుకు జర్దారీ కుట్ర: ఇమ్రాన్

ఇస్లామాబాద్: మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తనను చంపించేందుకు ఉగ్రవాదులకు ముడుపులిచ్చారని పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(70) ఆరోపించారు. ఇప్పటికే తనపై జరిగిన రెండు హత్యాయత్నాలు విఫలం కావడంతో ఈ కొత్త పథకం వేశారని పేర్కొన్నారు. అవినీతితో సంపాదించిన డబ్బు జర్దారీ వద్ద చాలానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తాజా కుట్రలో జర్దారీతోపాటు మరో ముగ్గురికి కూడా భాగముందని ఇమ్రాన్ విమర్శించారు. వజీరాబాద్ హత్యాయత్నంతో ఏర్పడిన బుల్లెట్ గాయాలు మానాక తిరిగి పోరాటం మొదలుపెట్టడం ఖాయమన్నారు. తనకు ఏదైనా జరిగితే అందుకు కారణమైన వారిని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని ఇమ్రాన్ అన్నట్లు ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పత్రిక పేర్కొంది.

పాక్ రూపాయి మరింత పతనం

కరాచీ: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ రూపాయి విలువ మరింత దిగజారింది. అమెరికా డాలరుతో పోలిస్తే మారకం విలువ రూ.262.6కు పడిపోయింది. శుక్రవారం బహిరంగ మార్కెట్‌లో ఒక దశలో డాలరుతో పోలిస్తే రూ.265కు, ఇంటర్ బ్యాంకింగ్‌లో రూ.266కు క్షీణించింది. చివరికి కోలుకుని రూ.262.6 వద్ద స్థిరపడింది. గురువారంతో పోలిస్తే శుక్రవారం కరెన్సీ విలువ రూ.7.17 అంటే 2.73% మేర పడిపోయినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్తాన్(ఎస్‌బీపీ) తెలిపింది. ఇంటర్ బ్యాంకింగ్ కార్యకలాపాల్లో రూపాయి విలువ గురు, శుక్రవారాల్లో రూ.34 మేర దిగజారిందని, దేశం 1999లో నూతన ఎక్స్చేంజి రేట్ విధానాన్ని వచ్చాక ఇంత భారీగా పతనమవడం ఇదే మొదటిసారి. కాగా, అమెరికా డాలరుతో భారత్ రూపాయి మారకం విలువ రూ.81.61గా ఉంది.

భరోస్.. డేటా భద్రతకు ఓఎస్!

తొలిసారిగా దేశీయ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్

- అభివృద్ధి చేసిన ఐఐటీ-మద్రాస్
- నిధులు సమకూర్చిన కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ
- 'డిజిటల్ ఇండియా'కు మరింత ఊతం

ప్రపంచమంతటా కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు విలాసాలు కాదు.. నిత్యావసరాలుగా మారిపోయాయి. మన దేశం కూడా అందుకు మినహాయింపు కాదు. దాదాపు అన్ని రంగాల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల వాడకం తప్పనిసరిగా మారింది. ఇక ఫోన్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. ధనవంతుల నుంచి సామాన్యుల దాకా అందరి చేతుల్లోనూ దర్శనమిస్తున్నాయి. కంప్యూటర్లు, ఫోన్లు పని చేయాలంటే అందులో ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్) కచ్చితంగా ఉండాలి. ఇలాంటి ఓఎస్ కోసం మనం ఇన్నాళ్లూ విదేశాలపైనే ఆధారపడుతున్నాం. ఓఎస్‌ను దేశీయంగా మనమే తయారు చేసుకోలేమా? అన్న ప్రశ్నకు సమాధానమే 'భరోస్'. డిజిటల్ ఇండియా కలను సాకారం చేసే దిశగా ఫోన్లలో ఉపయోగపడే ఓఎస్‌ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-మద్రాస్ అభివృద్ధి చేసింది. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్వినీ వైష్ణవ్ స్వయంగా పరీక్షించారు. భరోస్ పరీక్ష విజయవంతమైందని ప్రకటించారు. ఈ ఓఎస్ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములైన వారిని అభినందించారు.

ఏమిటీ భరోస్?

- విదేశీ ఓఎస్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవడం, స్థానికంగా అభివృద్ధి చేసిన టెక్నాలజీ వాడకాన్ని ప్రోత్సహించడాన్ని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- ఇందుకోసం భరోస్ పేరిట దేశీయ ఆపరేటింగ్ సిస్టమ్ అభివృద్ధికి నిధులు సమకూర్చింది.
- ప్రపంచవ్యాప్తంగా గూగుల్ ఆండ్రాయిడ్, ఆపిల్ ఐఓఎస్ ఆపరేటింగ్ సిస్టమ్స్ బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈ ఓఎస్‌లతో డిఫాల్ట్ యాప్‌లు, గూగుల్ సర్వీసులు తప్పనిసరిగా వస్తాయి. వాటిలో చాలావరకు మనకు అవసరం లేనివే ఉంటాయి. అవి ఏ మేరకు భద్రమో తెలియదు.
- భరోస్ ఓఎస్ వీటి కంటే కొంత భిన్నమనే చెప్పాలి. ఇదొక ఉచిత, ఓపెన్-సోర్స్ ఆపరేటింగ్ సిస్టమ్. ఇది నో డిఫాల్ట్ యాప్స్(ఎన్‌డీఏ)తో వస్తుంది. అంటే భరోస్ ఓఎస్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న ఫోన్‌లో ఎలాంటి యాప్‌లు కనిపించవు.
- గూగుల్ ఆండ్రాయిడ్ వెర్షన్లతో క్రోమ్, జీమెయిల్, గూగుల్ సెర్చ్, యూట్యూబ్, మ్యాప్స్ వంటివి డిఫాల్ట్‌గా వస్తుండడం తెలిసిందే.
- డిఫాల్ట్‌గా వచ్చే యాప్‌లతో మోసాలకు గురవుతుండడం వినియోగదారులకు అనుభవమే. అందుకే భరోస్ ఓఎస్ ఉన్న ఫోన్లలో అవసరమైన యాప్‌లను ప్రైవేట్ యాప్ స్టోర్ సర్వీసెస్(పాస్) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- 'పాస్'లో బాగా నమ్మకమైన, ప్రభుత్వ అనుమతి ఉన్న, అన్ని రకాల భద్రత, గోప్యత ప్రమాణాలు కలిగిన యాప్‌లు మాత్రమే ఉంటాయి. దీనివల్ల ఫోన్లలోని డేటా చోరీకి గురవుతుందన్న ఆందోళన ఉండదు.
- స్మార్ట్‌ఫోన్ల కంపెనీలకు ఈ ఓఎస్‌ను ఎలా అందజేస్తారు? ప్రజలకు ఎప్పటి నుంచి అందుబాటులోకి తీసుకొస్తారు? రెగ్యులర్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరికీ ఇస్తారా? లేదా? అనేదానిపై ఐఐటీ-మద్రాస్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ఎవరు వాడుతున్నారు?

- కఠినమైన భద్రత, గోప్యత అవసరాలు కలిగిన కొన్ని సంస్థలు ప్రస్తుతం భరోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను పరీక్షిస్తున్నాయి.
- రహస్య సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకొనే ప్రభుత్వ కంపెనీలు ఈ ఓఎస్‌ను వాడుతున్నట్లు సమాచారం.

ఎందుకీ ఓఎస్?

- గూగుల్ మొబైల్ ఓఎస్ ఆండ్రాయిడ్‌పై కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖకు చెందిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసింది.
- ఆండ్రాయిడ్‌తో డిఫాల్ట్‌గా వస్తున్న కొన్ని యాప్‌ల్లో భద్రతాపరమైన లోపాలు ఉన్నట్లు తెలియజేసింది.
- ఈ నేపథ్యంలోనే దేశీయ ఆపరేటింగ్ సిస్టమ్ తయారీపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

విప్లవాత్మక ముందడుగు

ఐఐటీ-మద్రాసు ఆధ్వర్యంలో స్థాపించిన జండ్ కే ఆపరేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(జండ్‌కాప్స్) అనే లాభాపేక్ష లేని స్టార్టప్ కంపెనీ భరోస్ ఓఎస్‌ను అభివృద్ధి చేసింది. 'నేషనల్ మిషన్ ఆన్ ఇంటర్ డిసిప్లినరీ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్' కింద కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ నిధులు అందజేసింది. నమ్మకం అనే పునాదిపై భరోస్ మొబైల్ ఆపరేటింగ్ వ్యవస్థను రూపొందించినట్లు ఐఐటీ-మద్రాస్ డైరెక్టర్ చెప్పారు. తమ అవసరాలను తీర్చే యాప్‌లను పొందే స్వేచ్ఛను వినియోగదారులకు కల్పించాలన్నదే ఈ ప్రాజెక్టు ఉద్దేశమని వివరించారు. దీనివల్ల సంబంధిత యాప్‌లపై వారికి తగిన నియంత్రణ ఉంటుందన్నారు. ఫోన్లలోని డేటా భద్రతకు భరోసా కల్పించే విషయంలో ఇదొక విప్లవాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. మన దేశంలో ఈ ఓఎస్ వినియోగాన్ని పెంచేందుకు ప్రైవేట్ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, వ్యూహాత్మక సంస్థలు, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లతో కలిసి పని చేస్తామని వివరించారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
శనివారం । 28 । జనవరి । 2023

వేడుకగా మహా కుంభాభిషేకం



పళ్లిపట్టు: ఆర్కేపేట యూనియన్ పైవలసలోని ద్రౌపదీదేవి అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేకం శుక్రవారం వేడుకగా జరిగింది. రూ.1.50 కోట్లతో ఆలయాన్ని పునఃనిర్మించారు. తొలుత హోమ పూజలు, కలశాభిషేకాలు చేశారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా బాలాలయ స్థాపన




బాలాలయ స్థాపనలో ఆలయ కమిటీ సభ్యులు

కొరుక్కుపేట : చెన్నై పాత చాకలిపేటలోని పరుశురామన్ వీధిలో వెలసిన మాతమ్మ దేవస్థానం పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాతమ్మకు బాలాలయ స్థాపన మహోత్సవాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9:30 గంటల నుంచి రెండవ కాల పూజలను వైభవంగా నిర్వహించారు. గోపూజతో ఆరంభమైన ఈ వేడుకల్లో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవులకు పసుపు కుంకుమలతో పూజలు, ప్రదక్షిణలు చేశారు. అనంతరం మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, దీపారాధన, అభిషేకాలు, బాలాలయ ప్రతిష్ట పూజలను వేద పండితులు కనులపండువుగా నిర్వహించారు. రూ.55 లక్షలతో జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టామని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి ట్రాఫిక్‌లో మార్పులు

కొరుక్కుపేట: చెన్నై టీ.నగర్‌లోని సౌత్ ఉస్మాన్ రోడ్డులో ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ మార్పులు చేస్తున్నట్టు ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి సెప్టెంబర్ 27వ తేదీ వరకు ఈ మార్పులు ఉంటాయని తెలిపారు. అన్నాసాలై సీఐటీ 1వ ప్రధాన రహదారి సౌత్‌ఉస్మాన్‌రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి అన్నాసాలై సీఐటీ ఒకటో ప్రధాన రహదారికి వెళ్లే వాహనాలు నిషేధించారని, కన్నమ్మపేట జంక్షన్, సౌత వెస్ట్‌రోడ్డు, మూపరాయన్ వీధి, లింక్‌రోడ్ మీదుగా అన్నాసాలైకు చేరుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సౌత్ ఉస్మాన్ రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి వచ్చే సిటీ బస్సులు సౌత్ ఉస్మాన్ రోడ్ మీదుగా వెళ్లడం నిషేధించారు. బర్కిట్ రోడ్డు, మూపరాయన్ వీధి మీదుగా అన్నాసాలైకి చేరుకోవచ్చునని తెలిపారు. 1వ మెయిన్ రోడ్ జంక్షన్ నుంచి సౌత్ ఉస్మాన్ రోడ్డు మీదుగా త్యాగరాయనగర్ బస్ టెర్మినల్ వైపు వెళ్లే వాహనాలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

జూడో రత్నంకు
కన్నీటి వీడ్కోలు




కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రజనీ

తమిళ సినిమా : సీనియర్ ఫైట్ మాస్టర్ జూడో రత్నం గురువారం సాయంత్రం కన్నుమూసిన విషయం తెలిసింది. ఈయన మృతికి పలువురు సినీ రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా జూడో రత్నం భౌతిక కాయానికి శుక్రవారం ఉదయం స్థానిక వాడపళనిలోని స్టంట్ యూనియన్ ఆవరణలో సందర్శకుల దర్శనార్థం ఉంచారు. నిర్మాతల మండలి, దక్షిణ భారత నటీనటుల సంఘం సభ్యులు, సినీనటులు, స్టంట్ మాస్టర్లు నివాళులర్పించారు. నటుడు రజనీకాంత్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూడో రత్నం కన్నడ చిత్రాలు చేస్తున్నప్పుడే తెలుసన్నారు. నటీనటులకు, స్టంట్ కళాకారులకు షూటింగ్‌లో ఎలాంటి ప్రమాదం జరగకుండా భద్రత కల్పించడానికి ప్రాముఖ్యత ఇచ్చే వారన్నారు. మురట్టుకాళ్లై చిత్రం కోసం కంపోజ్ చేసిన రైలు పోరాట దృశ్యాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. నటుడు, మక్కళ్ నీదిమయ్యం పార్టీ అధ్యక్షుడు కమలహాసన్ ట్విట్టర్ ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. పలు భాషల్లో 1500లకు పైగా చిత్రాలు చేసిన జూడో రత్నం గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాల్సిన వ్యక్తి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని స్వగ్రామంలో జూడో రత్నం భౌతిక కాయానికి శుక్రవారం సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

పులకించిన పళని

పళని ఆలయం శుక్రవారం ఆధ్యాత్మిక శోభతో అలలారింది. మహా కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. హరో హర నామస్మరణతో మార్మోగాయి. సరిగ్గా 8:46 గంటల శుభ ముహూర్తాన ఆలయ రాజ గోపుర శిఖరాలను వేదపండితులు పుణ్యజలాలతో అభిషేకించారు. డిప్ ద్వారా ఎంపికైన 2 వేల మంది ఈ ఘట్టాన్ని ప్రత్యక్షంగా తిలకించి తన్మయత్వం చెందారు. మిగిలిన భక్తులు 19 చోట్ల ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా వీక్షించి తరించారు. తొలిసారి తమిళంలో మంత్రోచ్ఛారణ చేయడం విశేషం.

- ఆధ్యాత్మిక క్షేత్రంలో ఘనంగా మహా కుంభాభిషేకం
- 90 హోమగుండాలతో పూజాది కార్యక్రమాలు
- మిన్నంటిన మురుగన్ నామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తులు
- 19 చోట్ల ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు
- హెలికాప్టర్ నుంచి గోపురంపై పుష్పాభిషేకం
- తొలిసారి తమిళంలో మంత్రోచ్ఛారణ





కుంభాభిషేకం నిర్వహిస్తున్న శివాచార్యులు



హాజరైన దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు

సాక్షి, చెన్నై: పళని ఆధ్యాత్మిక క్షేత్రం భక్త జనంతో పులకించింది. శుక్రవారం మహా కుంభాభిషేక మహోత్సవం కనుల పండువగా జరిగింది. హెలికాప్టర్ నుంచి బంగారు రాజగోపురం, బంగారు గోపురంలపై పుష్పాలను చల్లడంతో ఆధ్యాతికత మిన్నంటింది.

16 ఏళ్ల తర్వాత..

దిండుగల్ జిల్లా పళనిలో దండాయుధ పాణి స్వామిగా కొలువైన సుబ్రమణ్యస్వామి వారిని దర్శించుకునేందుకు నిత్యం భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. స్వామికి ఉన్న ఆరుపడై వీడుగల్‌లలో ఈ ఆలయం మూడోదిగా ప్రసిద్ధి చెందింది. పళని అంటే మొదటగా గుర్తుకొచ్చేది పంచామృతం. తిరుపతి లడ్డూ ఏ విధంగా ప్రసిద్ధి చెందిదో పళని పంచామృతం కూడా అంతే పేరు గడించింది. పంచామృతం జీఐ గుర్తింపు కూడా పొందింది. ఇంతటి ప్రసిద్ధి చెందిన పళణి ఆలయంలో 16 ఏళ్ల తర్వాత కుంభాభిషేక ఏర్పాట్లపై దేవదాయ శాఖ దృష్టిపెట్టింది.

తమిళ మంత్రాలతో....

ఆలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. యాగశాలలో 90 హోమగుండాలు ఏర్పాటు చేసి హోమాది పూజలు నిర్వహించారు. పుణ్య నదుల నుంచి పవిత్ర జలాలను తీసుకొచ్చి కలశాలలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా ఆలయ మూల విరాటు దర్శన సేవలను నిలుపుదల చేసి పూజలు నిర్వహించారు. శుక్రవారం మహా కుంభాభిషేకానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల కోసం కొండ చుట్టు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన 2 వేల మంది భక్తులను మాత్రమే అనుమతించారు. కొండ చుట్టూ నిలబడి కింది నుంచి కుంభాభిషేక ఉత్సవాన్ని తిలకించారు. వీరి కోసం 19 చోట్ల ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేసి కుంభాభిషేకాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. పిల్లయార్ పట్టి శివగామి పాఠశాల వేద పండితులు పిచ్చై శివాచార్యులు, పళణి ప్రధాన ఆలయ శివాచార్యులు అమృత లింగం, సహ శివాచార్యులు సెల్వ సుబ్రమణియం, కుంబేశ్వరర్, మణి నేతత్వంలో కుంభాభిషేక పూజలు జరిగాయి.

శుభ ముహూర్తంలో..

తొలుత పరివార ఆలయాల్లోని చిన్న గోపురాలకు అభిషేకాలు, పూజలు జరిగాయి. ఉదయం 8.15 గంటలకు యాగశాలలోని తీర్థ కలశాలను ఊరేగింపుగా రాజగోపురం, బంగారు గోపురం వద్దకు తీసుకొచ్చారు. ప్రపథమంగా తమిళంలో మంత్రోఛ్చారణ చేశారు. సరిగ్గా 8.46 గంటలకు శుభ ముహూర్తంలో బంగారు, రాజ గోపురంలపై ఉన్న కలశాలకు పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. అదే సమయంలో ఆకాశంలో చక్కర్లు కొడుతూ హెలికాప్టర్ నుంచి గోపురాలపై పుష్పాలు కురిపించడంతో హరో హర నామస్మరణ మార్మోగింది. భక్తులపై పవిత్ర జలాలను పరికరాల ద్వారా చల్లారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఐజీ అస్రకర్గ్ నేతృత్వంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.



కల్యాణ మహోత్సవం

కుంభాభిషేక వేడుకకు మంత్రులు శేఖర్‌బాబు, చక్రపాణి హాజరయ్యారు. ఈ వేడుక అనంతరం స్వామి మూల విరాట్ దర్శనార్థం భక్తులు ఆలయం వైపుగా బారులు తీరారు. తొలుత 2 వేల మందిని దర్శనానికి అనుమతించగా, ఆ తర్వాత అందరికి దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 6 గంటలకు కొండ ఆలయంలో వళ్లి, దేవసేన సమేత దండాయుధ పాణి స్వామి వారికి కనుల పండువగా కల్యాణ మహోత్సవం జరిగింది.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం

- ముఖ్యమంత్రి స్టాలిన్
- ప్రత్యేక వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని ఎస్సీ, ఎస్టీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శుక్రవారం ఈ పథకాన్ని సచివాలయంలో సీఎం స్టాలిన్ ప్రారంభించారు. అలాగే, ఆర్థికశాఖ నేతృత్వంలో స్టార్టప్ ఫండ్ ఏర్పాటుతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్, నిధుల సమీకరణను సీఎం ఆవిష్కరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగం నేతృత్వంలో గిరిజన సామాజిక వర్గం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారు. 5 పారిశ్రామిక కంపెనీల్లో రూ. 7.50 కోట్ల ఈక్విటీ పెట్టుబడికి చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం తమిళనాడు ప్రభుత్వం కొత్త పథకం అమలుకు చర్యలు తీసుకుంది. అలాగే, ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సురక్షిత పెట్టుబడులకు నిర్ణయించారు. ఇందు కోసం తొలి విడతగా రూ. 30 కోట్లతో నిధి ఏర్పాటు చేశారు. ఈ పథకం మేరకు షేర్ల విక్రయానికి సిద్ధంగా ఉన్న ఐదు సంస్థలను ఎంపిక చేశారు. వీటిలో రూ.7.50 కోట్ల వాటా కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన పెట్టుబడులకు ఉత్తర్వులు సీఎం జారీ చేశారు. ఈ పరిశ్రమల్లో ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంది. కొత్త మార్కెట్ అవకాశాలను కల్పిస్తుంది.

స్టార్టప్ ఫండ్

అభివృద్ధి చెందుతున్న రంగాల కోసం స్టార్టప్ ఫండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకు సంబంధించి ఎంపిక చేసిన 5 కంపెనీలకు పెట్టుబడి అనుమతి లేఖలను సీఎం స్టాలిన్ అందజేశారు. అలాగే, ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి కొత్తగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు మానిటరింగ్ సిస్టమ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ ఫండ్ ఆధారంగా అధునాతన ఉత్పత్తులు, మెకానికల్, ఏరోస్పేస్, డిఫెన్స్ టెక్నాలజీ, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, వెబ్ 3.వో, తదితర రంగాల్లో పెటుటబడులు విస్తృతం చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఫండ్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని, ఈ ఫండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు వివరించారు. దీనిని 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 500 కోట్లకు పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. కార్యక్రమంలో మంత్రులు అన్బరసన్, పళణి వేల్ త్యాగరాజన్, సీఎస్ ఇరై అన్బు తదితరులు పాల్గొన్నారు.

విచారణ వేగవంతం

- కొడనాడు కేసులో దూకుడు పెంచిన సీబీసీఐడీ
- కోర్టుకు 1500 పేజీల విచారణ నివేదిక
- మరింత సమయం కావాలని విజ్ఞప్తి
- ఫిబ్రవరి 24కు వాయిదా



కొడనాడు ఎస్టేట్


సాక్షి, చెన్నై: కొడనాడు కేసులో ఇది వరకు ఎస్పీగా పనిచేసిన మురళి రంభతో పాటు 48 మంది వద్ద విచారణ జరిపినట్లు సీబీసీఐడీ ఊటి కోర్టుకు సమాచారం అందించింది. విచారణలో భాగంగా ఇంటర్నెట్, మొబైల్ సంస్థల నుంచి సమాచారం సేకరించాల్సి ఉందని వివరించారు. దివంగత సీఎం జయలలిత మరణం తర్వాత ఆమెకు సంబంధించిన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడి గురించి తెలిసిందే. గత పాలకులు ఈ కేసును మమా అనిపించినా, ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం మిస్టరీ ఛేదించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తొలుత ప్రత్యేక సిట్ విచారించగా, ప్రస్తుతం సీబీసీఐడీని రంగంలోకి దించారు. సీబీసీఐడీ అదనపు ఎస్పీ మురుగ వేల్, డీఎస్పీ చంద్రశేఖర్, అన్నాదురై నేతృత్వంలోని బృందం విచారణ వేగాన్ని పెంచింది. ఇప్పటి వరకు జరిగిన విచారణ వివరాలను కోర్టుకు సమర్పించాలని ఇది వరకే ఊటీ కోర్టు ఆదేశించింది. దీంతో శుక్రవారం పిటిషన్ విచారణకు వచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సయన్, మనోజ్, సతీష్, జితిన్, సంతోష్ స్వామి కోర్టుకు హాజరయ్యారు. సీబీసీఐడీ అధికారులు కూడా విచారణకు వచ్చారు. సీబీసీఐడీ తరపున న్యాయవాదులు సాజహాన్, కనకరాజ్‌లు వాదనలు వినిపించారు. ఇప్పటికే 300 మంది వద్ద జరిగిన విచారణ మేరకు 1,500 పేజీలతో నివేదికను కోర్టులో సమర్పించినట్లు వివరించారు. ప్రస్తుతం సంఘటన జరిగినప్పుడు నీలగిరి ఎస్పీగా ఉన్న మురళి రంభతోపాటు 48 మందిని సీబీసీఐడీ విచారించినట్లు పేర్కొన్నారు. ఆ వివరాలను కోర్టుకు సమర్పించారు. మొబైల్ నెట్ వర్క్ సంస్థల నుంచి కొంత సమాచారాన్ని రాబట్టాల్సి ఉందని, ఆ వివరాల కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. ఇందు కోసం కొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో కేసు విచారణను ఫిబ్రవరి 24వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

కల చెదిరింది

- ఐటీ ఉద్యోగినిని బలిగొన్న ప్రహరీ గోడ
- మరొకరికి గాయాలు
- అన్నాసాలైలో ఘటన
- పురాతన భవనం కూల్చుతుండగా ప్రమాదం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తూ..



పద్మప్రియ (ఫైల్)

సాక్షి, చెన్నై: అన్నాసాలైలో శుక్రవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పురాతన భవనం కూల్చే సమయంలో గోడ కూలి ఐటీ ఉద్యోగిని మృతిచెందింది. ఎన్నో కలలతో చెన్నైలో అడుగు పెట్టిన యువతి మృతితో సహచరులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. చెన్నై అన్నా సాలైలోని ఆనంద్ థియేటర్ వద్ద ఓ పురాతన భవనం శిథిలావస్థలో ఉంది. ఈ భవనాన్ని కూల్చేందుకు యజమాని చర్యలు చేపట్టారు. అయితే, రోడ్డుపై వెళ్తున్న వాహనాలు, ఫుట్ పాత్‌పై నడిచే పాదచారుల భద్రతను గాల్లోకి వదిలేశాడు. ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టకుండా, ప్రొక్లెయినర్ ద్వారా ఉదయం కూల్చివేత పనులపై దృష్టి పెట్టారు.

హఠాత్తుగా ప్రమాదం

కూల్చివేత పనులు జరుగుతున్న ప్రదేశం వద్ద అతి పెద్ద ప్రహరీ గోడ కూడా ఉంది. ఈ గోడకు అనుకునే ఫుట్ పాత్ ఉంది. కూల్చే సమయంలో అటు వైపుగా వెళ్తున్న యువతి, యువకుడిపై ఆ గోడ కూలింది. గోడ శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర గాయాలైన యువతిని, స్వల్పంగా గాయపడ్డ యువకుడిని చికిత్స నిమిత్తం రాయపేట ఆసుపత్రికి తరలించారు. అయితే, యువతి అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. జన సంచారంతో నిండిన ప్రాంతంలో ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకుండా భవనాన్ని ఎలా కూలుస్తారని జనం ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారిని కట్టడి చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

తల్లిదండ్రులను ఒప్పించి చెన్నైకు..

మృతురాలు పద్మ ప్రియ(22), గాయపడిన విఘ్నేష్(24) అన్నాసాలైలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నారు. పద్మప్రియ మదురై జిల్లా ఉసిలం పట్టికి చెందిన మురుగేషన్, మురుగేశ్వరి దంపతుల కుమార్తెగా గుర్తించారు. ఐటీ ఉద్యోగం చేయాలన్న ఆశతో ఇంటి వద్ద పట్టుబట్టి మరీ తల్లిదండ్రులను ఒప్పించి చెన్నైకు వచ్చినట్టు విచారణలో తేలింది. చెన్నై శివారులోని పల్లావరం పంబల్‌లోని చిన్నమ్మ ఇంట్లో ఉంటూ ఉద్యోగం చేసుకుంటోంది. గత నెల ఉద్యోగంలో చేరిన ఆమె విమానాశ్రయం నుంచి థౌజండ్ లైట్స్ వరకు ప్రతి రోజు మెట్రో రైలులో ప్రయాణం చేసి, ఆతర్వాత ఫుట్ పాత్ మార్గంలో ఆఫీసుకు వెళ్లేది. ఐటీ ఉద్యోగం చెన్నైలో చేయాలని, ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలన్న ఆశతో ఉన్న తమ బిడ్డ ప్రహరీ గోడ కూలిన ప్రమాదంలో మరణించిన సమాచారంతో ఉసిలం పట్టిలోని కుటుంబీకులు కన్నీటి సంద్రంలో మునిగారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండాకుల కోసం సుప్రీంకోర్టుకు

- ఎస్ఈసీని ఆదేశించాలని పళణిస్వామి మనవి
- అభ్యర్థుల జాబితాలో ముగ్గురు సీనియర్లు
- అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థిగా శివప్రశాంత్



ప్రసంగిస్తున్న పళణిస్వామి

సాక్షి, చెన్నై: ఉపఎన్నికలో రెండాకుల చిహ్నం కైవసం చేసుకునేందుకు అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణిస్వామి శుక్రవారం కోర్టు తలుపుతట్టారు. రెండాకుల చిహ్నం తనకు అప్పగించేలా ఎస్ఈసీని ఆదేశించాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఉపఎన్నికల ప్రచారబాటకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇళంగోవన్‌కు మద్దతుగా డీఎంకే మంత్రులు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. శుక్రవారం మంత్రి నాజర్‌తో పాటు పలువురు నియోజకవర్గం పరిధిలోని మసీదుల వద్ద ప్రచారంలో నిమగ్నం అయ్యారు. డీఎండీకే అభ్యర్థి ఆనందన్ భద్రకాళి అమ్మన్ ఆలయంలో పూజల అనంతరం ప్రచారబాట పట్టారు. ఆలయం పరిసరాలలో ఓట్లను అభ్యర్థించారు

అభ్యర్థి కసరత్తు..

అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణిస్వామి శుక్రవారం కూడా ఈరోడ్‌లో మకాంవేసి అభ్యర్థి ఎంపిక కసరత్తుల్లో నిమగ్నమయ్యారు. ఆ పార్టీకి చెందిన ఈరోడ్ సీనియర్ నేతలు ముగ్గురి పేర్లతో జాబితా సిద్ధం చేశారు. ఇందులో ఒకరిని అభ్యర్థిగా ప్రకటించనున్నారు. ఈ విషయగా పళణి స్వామిని మీడియా కదిలించగా త్వరలో అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. నమ్మక ద్రోహులకు ప్రజలు గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ప్రత్యర్థులతో కలిసి అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిని క్షమించే ప్రసక్తే లేదని పరోక్షంగా ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరుసెల్వంను ఉద్దేశించి మండి పడ్డారు.

రెండాకుల కోసం...

అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం వివాదం సుప్రీం కోర్టులో ఉన్న విషయం తెలిసిందే. ఈరోడ్ ఉప ఎన్నిక ద్వారా రెండాకుల చిహ్నం, పార్టీని తన కైవసం చేసుకునే వ్యూహాలకు పళణి శ్రీకారం చుట్టారు. ఇందులోభాగంగా రెండాకుల చిహ్నం కోసం సుప్రీం కోర్టు తలుపు తట్టారు. తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా తనను అంగీకరించాలని, తనకు రెండాకుల చిహ్నం అప్పగించే విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని న్యాయమూర్తి దినేష్ మహేశ్వరి బెంచ్‌లో పళణిస్వామి అప్పీలు చేసుకున్నారు. ఆయన తరఫున న్యాయవాది అరిమా సుందరం కోర్టును ఆశ్రయించారు. ఈరోడ్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థికి అన్నాడీఎంకే రెండాకుల చిహ్నం అప్పగించాలని, ఇది తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా సర్వసభ్య సమావేశం సభ్యుల చేత ఎన్నుకున్న పళణిస్వామికి అందజేయాలని కోరారు. చివరకు సోమవారం ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించాలని న్యాయమూర్తి సూచించారు. అలాగే, తీర్పు విషయంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.

అమ్మ అభ్యర్థిగా శివ ప్రశాంత్

అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం తన అభ్యర్థిని ప్రకటించింది. అన్నాడీఎంకేలో చీలికతో ఈ కళగం ఆవిర్భవించిన విషయం తెలిసిందే. తానే స్వయంగా ఎన్నికల్లో పోటీ చేసే విధంగా తొలుత ఆ పార్టీ నేత టీటీవీ దినకరన్ నిర్ణయించారు. అయితే, మనస్సు మార్చుకున్నట్టున్నారు. తమ అభ్యర్థిగా ఈరోడ్ నగర పార్టీ కార్యదర్శి శివ ప్రశాంత్ పేరును ఖరారు చేశారు.శుక్రవారం సాయంత్రం అభ్యర్థిని పరిచయం చేశారు. అన్నాడీఎంకేలో చీలిక, వివాదాలు, తమకు అనుకూలంగా ఉంటుందని టీటీవీ ధీమా వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

సహాయకాల పంపిణీ



సహాయకాల పంపిణీ చేస్తున్న ప్రసన్నకుమార్

తిరువొత్తియూరు: ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ నేతృత్వంలో రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా గురువారం సహాయకాలను పంపిణీ చేశారు. ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ అధ్యక్షుడు, మేనేజ్‌మెంట్ బోర్డు డైరెక్టర్ ప్రసన్నకుమార్ మేట్టుపల్లి, నైవేలి భారత క్రీడా ఆడిటోరియంలో ఈ సహాయకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ సీనియర్ ఉద్యోగ సేవకన్, భార్య పళని అమ్మాల్‌ను సత్కరించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లను వితరణగా అందజేశారు. విద్యుత్ శాఖ డైరెక్టర్ షాజిజాన్, పథకాలు, ఎగ్జిక్యూటివ్ విభాగం డైరెక్టర్ మోహన్‌రెడ్డి, గనుల శాఖ డైరెక్టర్ సురేష్‌చంద్రసుమన్, ప్రధాన సూపరింటెండెంట్ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ వద్దని తీర్మానం

- విస్తరణ జరిగితే 4 వేల ఇళ్లు ఖాళీ
- వ్యవసాయ భూములకు భారీగా నష్టం
- గ్రామసభ తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేత



గ్రామసభలో పంచాయతీ అధ్యక్షుడు రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న మహిళలు

తిరువళ్లూరు: కుత్తంబాక్కంలో 80 అడుగులు రోడ్డు విస్తరణ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లి యూనియన్‌లోని కుత్తంబాక్కం గ్రామం. గతంలో ఇక్కడ వ్యవసాయ భూములు, పచ్చని పొలాలు కనిపించేవి. అయితే కరోనా తరువాత ఇక్కడి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కుత్తంబాక్కం గ్రామంలో 400 ఎకరాల భూమిని సేకరించిన ప్రభుత్వం శాటిలైట్ గ్రామం, రూ.364 కోట్లతో నూతన బస్టాండు, రూ.60 కోట్లతో డంపింగ్ యార్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. బస్టాండు పూర్తయితే వేలూరు, తిరువణ్ణామలై, తిరుపతి, బెంగళూరు వెళ్లే బస్సులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది. దీంతో ఇటీవల ప్రభుత్వం కుత్తంబాక్కం వరకు మెట్రోరైలు సేవలకు విస్తరణకు అనుమతి ఇచ్చింది. అయితే మెట్రో, బస్టాండు, శాటిలైట్ సిటీ పూర్తయితే ట్రాఫిక్ సమస్య మరింత సమస్యగా మారే అవకాశం ఉన్నట్టు నిర్ధారించిన సీఎండీఏ, కుత్తంబాక్కం నుంచి పూందమల్లి వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే రోడ్డు విస్తరణకు ప్రణాళికలు తయారు చేసి పనులను 2026 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే రోడ్డు విస్తరణకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గురువారం నిర్వహించిన గ్రామ సభలోనూ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలను విరమించాలని, తమ గ్రామంలో ఇకపై వేర్వేరు పనులకు భూసేకరణ చేయొద్దని కోరుతూ తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని శుక్రవారం ఉదయం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు అందజేశారు. గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ వ్యవసాయానికి మంచి పట్టున్న గ్రామం. అయితే అభివృద్ధి పేరుతో 400 ఎకరాలను సేకరించి తమ గ్రామాన్ని నిర్వీర్యం చేశారని వాపోయారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ వల్ల నాలుగు వేల నివాసాలను కూల్చాల్సిన వేయాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. కలెక్టర్‌ను కలిసి విస్తరణ పనులను చేయొద్దని కోరినట్టు వారు వివరించారు. వినతిని పరిశీలించాలని లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తిరుత్తణిలో ప్రేమలతకు చేదు అనుభవం

- దర్శనం కోసం గంటపాటు పడిగాపులు
- అభిషేకం టికెట్ బుక్ చేసుకున్నా దర్శనానికి అనుమతించని వైనం
- పట్టించుకోని డిప్యూటీ కమిషనర్



దర్శనం చేసుకున్న ప్రేమలత విజయకాంత్

తిరుత్తణి: తిరుత్తణి ఆలయంలో డీఎండీకే కోశాధికారి ప్రేమలత విజయకాంత్‌కు శుక్రవారం ఉదయం చేదు అనుభవం ఎదురైంది. స్వామి దర్శనం కోసం గంటపాటు కొండ ఆలయ ప్రధాన గేటు వద్ద వేచివుండాల్సి రావడంతో అధికారుల తీరును తప్పుబట్టారు. డీఎండీకే కోశాధికారి, నటుడు విజయకాంత్ సతీమణి ప్రేమలత విజయకాంత్ కుటుంబీకులతో కలిసి తిరుత్తణి కొండ ఆలయంలో శుక్రవారం ఉదయం జరిగిన బంధువుల పెళ్లికి హాజరయ్యారు. తర్వాత స్వామిని దర్శించుకునేందుకు ఉదయం 6 గంటల సమయంలో అభిషేకసేవల్లో పాల్గొనేందుకు వీలుగా ప్రేమలత పేరిట టికెట్ బుక్‌చేసుకున్నారు. అయితే అభిషేకం సమయానికి రాకపోవడంతో ఉదయం 7 గంటల సమయంలో స్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. అయితే అనుమతిలేకుండా వీఐపీ దర్శనానికి అనుమతి లేదని సిబ్బంది చెప్పడంతో వంద రూపాయల టికెట్ తీసుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయకు విజయకు విషయం తెలియడంతో హిందూ దేవదాయ శాఖ కమిషనర్ సూచన మేరకు ప్రత్యేక మార్గంలో ప్రేమలత, డీఎండీకే ఉప ప్రధాన కార్యదర్శి ఎల్‌కే.సుధీష్‌తో పాటు వారి కుటుంబీకులు ఐదుగురిని అనుమతించారు.

ఆలయంలో కొనసాగుతున్న దర్శన వివాదాలు

డిప్యూటీ కమిషనర్ విజయ స్థానికులు ప్రతి మంగళవారం రూ.300 ప్రవేశ మార్గంలో ఉచిత దర్శనానికి వెళ్లడం గతంలో రద్దు చేసిన క్రమంలో వీఐపీ దర్శనానికి బ్రేకులు వేశారు. డిప్యూటీ కమిషనర్ అనుమతి లేకుండా వీఐపీ దర్శనానికి అనుమతి లేదని సిబ్బందిని ఆదేశించడంతో సమస్య తీవ్రమైంది. అయితే ముందస్తుగా అనుమతి ఉత్తరం అందజేసి అభిషేకం టికెట్ ఉన్నా దర్శనానికి గంట ఆలస్యం చేయడం పట్ల డీఎండీకే శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



హాజరైన భక్తులు



గోపురంపై పుణ్యజలాలు వదులుతున్న పీఠాధిపతులు

వేలూరు : వేలూరు సత్‌వచ్చారిలో పురాతన శపర్వత వర్ధిని సమేత శ్రీ కైలాసనాదర్ ఆలయం ఉంది. ఇక్కడ వినాయకుడు, మురుగన్ సహా 63 మంది నయన్‌మార్లకు ఉత్సవ మూర్తుల ఆలయాలు నిర్మించి మహాకుంభాభిషేకాన్ని శుక్రవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ముందుగా రత్నగిరి బాల మురుగన్ స్వామిజీ, లోకనాతస్వామిజీ పాల్గొని మేళ తాళాల నడుమ స్వామి వారి కలశాలను మహిళా భక్తులచే ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం కలశ నీటిని ఆలయ రాజగోపురంపైకి తీసుకెళ్లి చల్లి కుంభాభిషేకం చేశారు. అనంతరం కలశ నీటిని భక్తులపై చల్లి స్వామివారికి దీపారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

కోలాహలంగా కైలాసనాథర్ కుంభాభిషేకం



ఆలయ గోపురంపై పుణ్యజలాలను వదులుతున్న అర్చకులు

తిరువళ్లూరు: తిరువళ్లూరు సమీపంలోని కైలాసనాథర్ ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం కోలాహలంగా జరిగింది. కడంబత్తూరు యూనియన్ ఏకాటూరు గ్రామంలో కామాక్షి అమ్మవారి సమేత కైలాసనాథర్ ఆలయం వుంది. ఈ ఆలయం మరమ్మతులకు గురికావడంతో ప్రభుత్వం రూ.8 లక్షల వ్యయంతో ఆలయాన్ని పునరుద్ధరించి మహాకుంభాభిషేకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 5గంటలకు నాల్గవ యాగశాల పూజ, 7.50 గంటలకు కలశం ఊరేగింపు నిర్వహించి 8.15 గంటలకు ఆలయ గోపురంపై పుణ్యజలాలను వదిలి కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం 9.30 గంటలకు దీపారాధన చేశారు. సాయంత్రం 5.30గంటలకు స్వామి వారికి తిరుకల్యాణంతో పాటు ఊరేగింపు నిర్వహించారు.

రైతుల కోసం ప్రత్యేక యాప్



రైతుల గ్రీవెన్స్‌డేలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, హాజరైన రైతులు

తిరువళ్లూరు: రైతులకు సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన ప్రత్యేక యాప్‌ను రూపొందించి త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ హామీ ఇచ్చారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టరేట్‌లో అగ్రి గ్రీవెన్స్‌డేను శుక్రవారం ఉదయం నిర్వహించారు. కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ ఆధ్వర్యం వహించగా రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి యత్నించారు. రైతులు తమ సమస్యలను నేరుగా చెప్పుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కోరగా, అందుకు ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారి సురేష్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ జబకుమారి, రైతు సంఘం అధ్యక్షుడు నొచ్చిలి వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అవార్డు ..

సైనికుల సంక్షేమార్థం 2021వ సంవత్సరంలో అత్యధికంగా ఫ్లాగ్‌డే వసూలు చేసి రెండవ స్థానంలో నిలిచిన తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ అవార్డును అందజేశారు. అవార్డును అందుకున్న కలెక్టర్‌ను పలువురు అభినందించారు.

కొత్త చాకలిపేటలో కుంగిన రోడ్డు

తిరువొత్తియూరు: చెన్నై కొత్త చాకలిపేటలో హఠాత్తుగా నాలుగు అడుగులకు రోడ్డు కుంగడంతో ఏర్పడడంతో కలకలం ఏర్పడింది. కొత్తచాకలిపేట లక్ష్మీ కోయిల్ ప్రాంతంలో బస్సు డిపో ఉండడంతో రద్దీ ఉంటుంది. ఈ క్రమంలో మెట్రో రైల్ స్టేషన్ సమీపంలో ఉన్న రోడ్డు గురువారం బస్టాండ్ సమీపంలో హఠాత్తుగా రెండు అడుగుల వెడల్పుతో నాలుగడుగుల లోతుతో రోడ్డు కుంగింది. కార్పొరేషన్ అధికారులు అక్కడికి చేరుకుని రోడ్డుకు మరమ్మతులు చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు.

ధోనీ చిత్రం మొదలైంది



ఎల్‌జీఎం చిత్ర ప్రారంభోత్సవం

తమిళసినిమా: భారత క్రికెటర్ ధోని చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతున్న విషయం ఇంతకుముందే ప్రకటించిన విషయం తెలిసిందే. ధోని ఎంటర్‌టెయిన్ పతాకంపై తమిళం, తెలుగు, హిందీ భాషల్లో చిత్రాలు నిర్మించనున్నట్లు ఆయన ఇప్పటికే వెల్లడించారు. అందులోభాగంగా తొలి ప్రయత్నంగా తమిళంలో చిత్రాలు నిర్మిస్తున్నారు. దీనికి ఎల్‌జీఎం (లెట్స్ గెట్ మ్యారీడ్) అనే టైటిల్‌ను నిర్ణయించారు. నవ దర్శకుడు రమేశ్ తమిళమణి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో నటి నదియా, నటుడు హరీష్ కల్యాణ్, నటి ఇవానా, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిత్ర షూటింగ్ శుక్రవారం ఉదయం చెన్నైలో పూజాకార్యక్రమంతో ప్రారంభమైంది. పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ధోని సతీమణి సాక్షిసింగ్ ధోని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మా చిత్ర యూనిట్‌తో ఇక్కడ ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు జనరంజకంగా రూపొందిస్తున్నారని చెప్పారు. మరింత కథాబలం కలిగిన చిత్రాలు నిర్మించడానికి తాము సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ధోని ప్రొడక్షన్స్ వాణిజ్య విభాగ నిర్వాహకుడు వికాస్ అసిజ, మరో నిర్వాహకుడు ఫియాన్సీ చోప్రా పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్

వదంతులను నమ్మొద్దు!



మావీరన్‌లో శివకార్తికేయన్, అతిథి శంకర్

తమిళసినిమా: శివకార్తికేయన్ హీరోగా నటించిన ప్రిన్స్ చిత్రం దీపావళికి తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన విషయం తెలిసిందే. ఈ చిత్రం ఆశించిన విజయం సాధించలేదు. తాజాగా ఈయన మావీరన్ అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శివకార్తికేయన్‌కు జంటగా దర్శకుడు శంకర్ వారసురాలు అతిథి శంకర్ నటిస్తున్నారు. ఈమె ఇంతకుముందు కార్తీకి జంటగా విరుమాన్ చిత్రంతో కథానాయకగా పరిచయమైన విషయం తెలిసింది. దీంతో ఈ చిత్రం ఈమెకి రెండో చిత్రం. కాగా ఏది బాబు నటించిన మండేలా చిత్రం ద్వారా పరిచయమైన మడోనా అశ్విన్ ఈ చిత్రానికి కథ దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. దర్శకుడు మిష్కిన్, నటి సరిత ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని శాంతి టాకీస్ సంస్థ నిర్మిస్తోంది. ఇదు అయాన్ ఛాయాగ్రహణం, భరత్ శంకర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చాలా రోజుల క్రితం ప్రారంభమైంది. అయితే ఈ చిత్రం గురించి రకరకాల వార్తలు ప్రచారం అవుతున్నాయి. ముఖ్యంగా విచిత్రం ఆగిపోయిందనే వదంతులు దొర్లుతున్నాయి. దీంతో స్పందించిన నిర్మాతల వర్గం ఒక ప్రకటనను మీడియాకు విడుదల చేసింది. అందులో తమ చిత్రం గురించి జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని అలాంటి వార్తలను ఎవరూ నమ్మవద్దని పేర్కొన్నారు. అసత్యాలు తాత్కాలికమేనని, నిజమే గెలుస్తుందని అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు.



ఈ ఏడాది నో డైరెక్షన్



రన్ బేబీ రన్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళసినిమా: రేడియో జాకీగా పరిచయమై ఆ తర్వాత నటుడుగా మారి హాస్యపాత్రలు పోషిస్తూ మెప్పించిన ఆర్జే బాలాజి ప్రస్తుతం కథానాయకుడిగా, దర్శకుడుగా రాణిస్తున్నారు. ఈయన ఎల్కేజీ చిత్రంతో కథానాయకుడిగా అవతారం ఎత్తారు. ఆ తర్వాత నయనతార ప్రధాన పాత్రను పోషించిన మూక్కుత్తి అమ్మన్ చిత్రంతో దర్శకుడిగానూ పరిచయం అయ్యారు. ఈ రెండు చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఆ తర్వాత వీట్ల విశేషం అనే చిత్రంలో కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించి సక్సెస్ అయ్యారు. తాజాగా ఈయన కథానాయకుడిగా నటించిన రన్ బేబీ రన్ చిత్రానికి మలయాళం జీఎస్ కృష్ణ కుమార్ దర్శకత్వం వహించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఫిబ్రవరి 3న విడుదలకు సిద్ధమవుతోంది. దీన్ని ఇంతకుముందు కార్తీ కథానాయకుడిగా సర్దార్, శశి కుమార్ హీరోగా కారి వంటి విజయవంతమైన చిత్రాలు నిర్మించిన ఎస్.లక్ష్మణన్ తన ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మించారు. ఇందులో నటి ఐశ్వర్యరాజేష్ ప్రధాన పాత్ర పోషించిన ఇందులో నటి ఇషా తల్వార్ నాయకిగా నటించారు. సీఎస్.శ్యామ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం గురించి బాలాజి గురువారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ థ్రిల్లర్ జానర్ రూపొందించిన చిత్రం రన్ బేబీ రన్ అని చెప్పారు. తన తొలి చిత్రం ఎల్కేజీ రాజకీయ నేపథ్యంలోనూ రెండవ భక్తి కథా చిత్రంగానూ, మూడో చిత్రం వీట్ల విశేషం కుటుంబ కథా చిత్రంగానూ రూపొందాయి అన్నారు. ఈ తాజా చిత్రం వాటికి భిన్నంగా రూపొందిన చిత్రం అని చెప్పారు. ఇది సీరియస్ కథాచిత్రంగా ఉన్నా, జనరంజకంగా ఉంటుందన్నారు. దర్శకుడు చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారన్నారు. మళ్లీ దర్శకత్వం ఎప్పుడు చేస్తారు అనే ప్రశ్నకు ప్రస్తుతం నటుడిగా బిజీగా ఉన్నానని, మరో రెండు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయని, చిత్రం తర్వాత చిత్రం చేయడానికే తాను ఇష్టపడతానని, దీంతో ఈ ఏడాది దర్శకత్వం వహించే పరిస్థితి లేదు అని చెప్పారు. అయితే నటుడు విజయ్ హీరోగా నటించే చిత్రానికి కచ్చితంగా దర్శకత్వం వహిస్తానని, అయితే అందుకు ఇంకా సమయం ఉంది అని ఆర్జే బాలాజి పేర్కొన్నారు.

పతనానికి ఆ మూడే కారణం!



చారుకేశి చిత్ర ప్రారంభోత్సవంలో రజనీకాంత్

తమిళసినిమా: మొదట్లో నటుడు రజనీకాంత్ దురలవాట్ల గురించి సినీ వర్గాలు రకరకాలుగా చెప్పుకునేవారు. వాటిని కొందరు నమ్మినా మరికొందరు వాటిలో నిజమెంతలే అని కొట్టిపారేసిన వారూ ఉన్నారు. అయితే తన 73 ఏళ్ల వయసులో 43 ఏళ్ల సినీ కెరీర్‌లో తొలిసారిగా రజనీకాంత్‌నే తన దుర అలవాట్ల గురించి స్వయంగా బహిరంగంగా చెప్పారు. గురువారం రాత్రి నటుడు వైజీ.మహేంద్రన్ చారుకేశి నాటకం 50వ ప్రదర్శనను స్థానిక టీనగర్‌లోని వాణి మహల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రజనీకాంత్ మాట్లాడుతూ తను 1975లో అపూర్వరాగంగల్ చిత్రంలో నటించానన్నారు. ఆ సమయంలో స్థానిక మైలాపూర్‌లో ఏర్పాటుచేసిన రహస్యం పరమ రహస్యం అనే నాటకానికి తనను ఆహ్వానించారని, ఆ నాటకంలో నటుడు సుందర్‌రాజన్, జయసుధ నటించారన్నారు. అయితే ఆ నాటకం చూడ్డానికి వెళ్లిన తనను మొదట లోపలికి అనుమతించలేదని, తెలిసిన కాస్ట్యూమర్ ఒకరు తనను తీసుకెళ్లాడని చెప్పారు. ఆ సంఘటన జరిగి 47 ఏళ్లు అయిన తర్వాత ఇప్పుడు ఇదే వేదిక పైకి తాను ముఖ్యఅతిథిగా విచ్చేశానని, ఇదే కాలం ఆడే క్రీడ అని పేర్కొన్నారు. ఇక నటుడు వైజీ.మహేంద్రన్ గురించి చెప్పాలంటే మొదట తన భార్య లతను తనకు పరిచయం చేసింది ఆయనేనని చెప్పారు. తమ పెళ్లి చేసింది కూడా ఆయనేనని తెలిపారు. తను ఇప్పుడు 73 ఏళ్ల వయసులోనూ ఆరోగ్యంగా ఉన్నానంటే అందుకు కారణం తన భార్యనేనని చెప్పారు. తాను బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నప్పుడు కొందరి చెడు సావాసం కారణంగా పలు దురలవాట్లకు బానిసయ్యానని చెప్పారు. రోజుకు రెండు సార్లు మాంసాహారం తినడం, నిత్యం మద్యం తాగడం, సిగరెట్లు కాల్చడం చేసేవాడిన్నారు. సినీ రంగప్రవేశం చేసిన తర్వాత డబ్బు, పేరు రావడంతో ఈ అలవాట్లు మరింతగా పెరిగిపోయాయి అన్నారు. ఉదయాన్నే పాయ, ఆప్పం, చికెన్ తినేవాడినని, అప్పుడు శాఖాహారం భుజించే వాళ్లని పాపం ఎలా తింటున్నారో అని జాలిపడేవాడినని అన్నారు. నిజానికి మద్యం, సిగరెట్లు, మాంసాహారం అలవాట్లు చెడు అలవాట్లు అన్నారు. ఈ మూడు మితిమీరి తీసుకున్న వాళ్లు 60 ఏళ్లు కూడా ఆరోగ్యంగా జీవించలేరన్నారు. అలాంటి దురలవాట్లు కలిగిన తనను తన భార్య ప్రేమతో మార్చేశారని చెప్పారు. అయితే కొన్ని అలవాట్లను త్వరగా మార్చుకోవడం సాధ్యం కాదని ప్రేమ మంచి వైద్యుల సహకారంతో తన అలవాట్లను మార్చింది తన భార్య లత అని రజనీకాంత్ పేర్కొన్నారు. అందుకు కారణమైన వైజీ.మహేంద్రన్‌కు తాను కృతజ్ఞతలు తెలుపుకుంటానన్నారు. చారుకేశి నాటకాన్ని స్వీయ దర్శకత్వంలో సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఆయనే ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని ఈ వేదికపై లాంచనంగా ప్రారంభించారు. దీని ముహూర్తం షాట్‌కు రజనీకాంత్ క్లాప్ కొట్టి ప్రారంభించారు.

జమున బయోపిక్‌లో మిల్కీబ్యూటీ?

తమిళసినిమా : దివంగత ప్రఖ్యాత నటీమణి జమున బయోపిక్‌లో మిల్కీబ్యూటీ తమన్న నటించనున్నారా? అన్న ప్రశ్నకు కోలీవుడ్లో అలాంటి అవకాశం ఉందనే సమాధానం వస్తోంది. ప్రఖ్యాత నటీమణుల జీవిత చరిత్రతో చిత్రాలు తెరకెక్కించడం సాధారణ విషయమే. ఇంతకుముందు నటి సావిత్రి జీవిత చరిత్రతో రూపొందిన మహానటి చిత్రంలో కీర్తీసురేష్ టైటిల్ పాత్రను పోషించారు. పోషించిన కీర్తీసురేష్ సినీ ప్రముఖుల అభినందనలు, జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. అదేవిధంగా ప్రముఖ శృంగార తార సిల్క్ స్మిత బయోపిక్‌ను హిందీలో ది డర్టీ పిక్చర్స్ పేరుతో రూపొందింది. సిల్క్‌స్మిత పాత్రలో నటించిన అవార్డులు గెలుస్తున్నారు. ఇకపోతే ప్రఖ్యాత నటి, దివంగత ముఖ్యమంత్రి జయలలిత జీవిత చరిత్రతో రూపొందిన తలైవి చిత్రంలో బాలీవుడ్ సంచలన నటి కంగనారనౌత్ టైటిల్ పాత్రలో నటించిన విషయం తెలిసిందే. ప్రఖ్యాత నటీమణి జమున జీవిత చరిత్రను తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం. నటి జమున తెలుగు, తమిళం, కన్నడం, హిందీ భాషల్లో 190 చిత్రాలకు పైగా నటించారు. ఇందులో నటి తమన్న జమున పాత్రను పోషించనున్న కథ విన్న ఆమె వెంటనే అంగీకరించినట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే దీనికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడేలేదన్నది గమనార్హం.

క్లుప్తంగా

రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం

అన్నానగర్: మదురై అనుప్పాండిలో గురువారం రైలు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. అనుప్పానడి ప్రాంతానికి చెందిన శివకుమార్ (43), ఇతని స్నేహితుడు ఇద్దరూ కలిసి విపరీతంగా మద్యం తాగారు. అక్కడ దుకాణదారులతో గొడవకు దిగారు. అనంతరం దుకాణంలో భోజనం తీసుకొని మద్యం మత్తులో రైలుపట్టాలపై కూర్చుని తింటున్నారు. ఆ సమయంలో వచ్చిన రామేశ్వరం – కన్యాకుమారి రైలు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. విషయం తెలిసి రైల్వేపోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరి మృతి

అన్నానగర్: స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. వివరాలు.. తిరుచ్చి జిల్లా మానపరైకి చెందిన సాదిక్ అలీ (52), మదురై జిల్లా మేలూరుకు చెందిన మహ్మద్ అలీ(47) స్నేహితులు. గురువారం ఇద్దరూ స్కూటర్‌పై ద్వారంకురిచ్చి వద్ద వెళుతున్నారు. ఈ క్రమంలో మదురై నుంచి తిరుచ్చి వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో సాదిక్ అలీ, మహమ్మద్ అలీ అక్కడికక్కడే మృతి చెందారు. ద్వారంకురిచ్చి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మనపారై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

అన్నానగర్: తేనిలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కేఆర్ఆర్ నగర్‌కు చెందిన పరమస్ కుమార్తె వినీత (24) కంభానికి చెందిన సెల్వకుమార్‌తో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. నాలుగు నెలల క్రితం సెల్వకుమార్ మృతి చెందాడు. దీంతో వినీత తేనిలోని పుట్టింట్లో ఉంటోంది. కడుపునొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి బాలమణి సమాచారంతో తేని పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుగుండు సామగ్రి పేలి..

- ఇద్దరు చిన్నారులకు గాయాలు

తిరుత్తణి: టపాసుల గోడౌన్‌లో మందుగుండు సామగ్రి పేలి ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. తిరుత్తణి ఎంజీఆర్ నగర్‌లో టపాసుల గుడౌన్ ఉంది. అదే ప్రాంతానికి చెందిన వెంకటేశన్, నగ్మ దంపతులు టపాసులు తయారుచేసి మందుగుండు సామగ్రిని ఇంటికి తీసుకెళ్లారు. శుక్రవారం ఉదయం టపాసులకు వినియోగించే ఒత్తులు తయారు చేసి ఇంటి బయట ఆరబెట్టారు. వాటిని పిల్లలు తీసుకుని ఆడుకుంటున్న క్రమంలో మందుగుండు సామగ్రి పేలింది. అశ్విన్ (2), అనుపవల్లి (1) గాయపడ్డారు. వారిని తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వృద్ధులకు ఆర్థిక సాయం



పింఛన్ అందజేస్తున్న చంద్రశేఖర్

కొరుక్కుపేట: చెన్నైకు చెందిన ఎస్‌కేపీడీ అండ్ చారిటీస్ నిర్వహణలో నడుస్తున్న యేల్చూర్ వెంకట కోటయ్య చారిటీస్ కాంచీపురంలోని పేద వృద్ధులకు ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చారిటీస్ తరపున అనేక ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యాన తెలిపారు.

బాలిక కిడ్నాప్

తిరువొత్తియూరు: బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై చూలైమేడు ప్రాంతానికి చెందిన మహిళ (35). ఈమె గత 22వ తేదీ చూలైమేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో తన 13 ఏళ్ల కుమార్తె అదే ప్రాంతంలో ఉన్న ఒక యువకుడు అదృశ్యమయ్యారని, కుమార్తెను ఆచూకీ కనిపెట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి బాలిక కోసం సెల్‌ఫోన్ ఆధారంగా గాలింపు చేపట్టారు. వారు మహాబలిపురం ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు అక్కడికి వెళ్లి లాడ్జిలో ఉన్న బాలికను యువకుడి నుంచి విడిపించారు. యువకుడిని చూలైమేడు పోలీసుస్టేషన్ తీసుకెళ్లారు. విచారణలో అతను అదే ప్రాంతానికి చెందిన తులసిధరన్ (24) అని తెలిసింది. ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం చేసుకుని బాలికను నమ్మించి కిడ్నాప్ చేసి లైంగికదాడి చేసినట్టు తెలిసింది. అతన్ని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచి పుళల్ జైలుకు తరలించారు

శ్రీవారి దర్శనానికి 36 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో మొత్తం కంపార్టుమెంట్లు నిండిపోయాయి. క్యూ వెలుపల ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 58,379 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,950 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 36 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

నత్తనడకన భూగర్భ డ్రైనేజీ పనులు

వేలూరు: వేలూరు కార్పొరేషన్‌లోని అన్ని వార్డుల్లోనూ స్మార్ట్ సిటీ పథకం కింద పార్కు, భూగర్భ డ్రైనేజీ పనులతో పాటు పలు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే భూగర్భ డ్రైనేజీ పనులు ఇప్పటికే కాట్పాడి, గాంధీనగర్, సత్‌వచ్చారి, తొరపాడి ప్రాంతాల్లో 80 శాతం పనులు పూర్తి కాగా మిగిలిన అన్ని ప్రాంతాల్లో నత్త నడకన పనులు జరుగుతున్నాయి. ఇదిలాఉండగా వేలూరు ఆర్కాడు రోడ్డులో ప్రస్తుతం పనులు జరుగుతున్నందున వివిధ రాష్ట్రాల నుంచి వేలూరు సీఎంసీ ఆస్పత్రికి వచ్చే రోగులు ఆర్కాడు రోడ్డులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అంబులెన్స్‌లో రోగులను తీసుకొచ్చే సమయంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వీటిపై ఇప్పటికే ప్రజలు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా కాంట్రాక్టర్‌లు పనులను నత్త నడకన చేస్తుండడంతో అధికారులు చేసేదిలేక చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం సీఎంసీ ఆస్పత్రి నుంచి రోగులను యాజమాన్యం ప్రయివేటు వాహనాల్లో నూతనంగా రాణిపేట జిల్లా కనికాపురం వద్ద ప్రారంభించిన సీఎంసీకి తీసుకెళుతున్నారు. అయితే తరచూ ట్రాఫిక్ సమస్యతో రోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్కాడు రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

కారు బోల్తా.. విద్యార్థినికి తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: కారు బోల్తా పడి వైద్య విద్యార్థిని గాయపడిన ఘటన చెన్నై టీనగర్ జీఎన్ చెట్టి రోడ్డులో జరిగింది. చెన్నై కోడంబాక్కం ప్రాంతానికి చెందిన వర్ష (22) ఓమందురు ప్రభుత్వ ఆసుపత్రి కళాశాలలో చదువుతోంది. పారిశ్రామిక వేత్త కుమార్తె అయిన ఈమె కళాశాలకు కారులో వెళ్లేది. కోడంబాక్కంలో ఉన్న తన ఇంటి నుంచి శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే కారులో కళాశాలకు బయలుదేరారు. టీనగర్ జీఎన్ చెట్టి రోడ్డు వంతెన వద్ద వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడింది. వర్షకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పాండీ బజార్ పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం 108లో చెన్నై ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పాండి బజార్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కేన్సర్ నుంచి రక్షణకు జన్యుపరీక్షలు కీలకం



సిల్వర్ జూబ్లీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చాన్స్‌లర్ వీఆర్ వెంకటాచలం

కొరుక్కుపేట: కేన్సర్ నుంచి సంరక్షణకు జన్యు పరీక్షలు, మందులు కీలకం అని యూఏఈలోని ఫుజైరా హాస్పిటల్ పీడియాట్రిక్స్ డిపార్ట్‌మెంట్ కన్సల్టెంట్,తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ నిపుణుల సలహా మండలి సభ్యుడు, జెనెటిక్ డాక్టర్ మహమ్మద్ నవీద్ తెలిపారు. ఈమేరకు రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో జెనెటిక్స్ డిపార్ట్‌మెంట్ రజతోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈవేడుకలను ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. జెనెటిక్స్ విభాగం రజతోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన శిలా ఫలకాన్ని చాన్సలర్ వీ ఆర్ వెంకటాచలం ఆవిష్కరించారు. ఇందులో వైస్ చాన్సలర్ డాక్టర్ ఉమాశేఖర్, డీన్ రీసెర్చ్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్, శ్రీహెర్‌లోని జెనిటిక్స్ వ్యవస్థాపక హెచ్‌ఓడీ డాక్టర్ విక్రమ్ జయంత్, డాక్టర్. సోలమన్ పాల్, డాక్టర్.పి.వెంకటాచలం పాల్గొన్నారు.

భావితరాలకు మన సంస్కృతిని తెలియజేయాలి



చర్చా కార్యక్రమంలో పాల్గొన్న అతిథులతో శరణ్యకుమార్

కొరుక్కుపేట: భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయ వినోద ఆటలను తెలియజేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నట్టు చిత్తం సంస్థ వ్యవస్థాపక సీఈఓ శరణ్యకుమార్ తెలిపారు. ఈ మేరకు చిన్నపిల్లలలో విద్యా వినోదాన్ని పంచే విధంగా చిత్తం పేరిట అనే విప్లవాత్మకమైన పిల్లల గేమ్స్ బ్రాండ్‌ను శుక్రవారం సాయంత్రం ఘనంగా ఆవిష్కరించారు. దీనిని ప్రముఖ జర్నలిస్టు, చాణక్య టీవీ వ్యవస్థాపక సీఈఓ రంగరాజ్ పాండే లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సంస్కృతి పిల్లల మనసులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన చర్చ వేదికలో భారత జ్ఞాన్ వ్యవస్థాపకులు డీకే హరి, హేమ హరి, విద్యావేత్త, రమణ విద్యాలయ ఎండీ లలిత చంద్రశేఖరన్ పిల్లల మనస్తత్వాన్ని, జ్ఞాన వికాసం గురించి చక్కగా చర్చించారు.

ఎంవీఐ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేంద్రన్

తిరుత్తణి: తిరుత్తణి మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి తిరువళ్లూరు ఎమ్మెల్యే రాజేంద్రన్ శుక్రవారం భూమి పూజ చేశారు. తిరుత్తణిలోని ఓ అద్దె భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. సిబ్బందితో పాటు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ క్రమంలో చెన్నై–తిరుపతి జాతీయ రహదారిలోని లక్ష్మాపురం వద్ద నూతన భవనం నిర్మాణానికి వీలుగా రూ. 2.42 కోట్లు కేటాయించారు. ఎమ్మెల్యే రాజేంద్రన్ పనులకు శ్రీకారం చుట్టారు.

రూ.3కే బిర్యానీ..

క్యూ కట్టిన జనం

పట్టణంలో రూ.3కే బిర్యానీ అని ఆఫర్ ప్రకటించడంతో వేకువజామున 3 గంటల నుంచి మాంసాహార ప్రియులు క్యూకట్టారు. తిరుత్తణి –చిత్తూరు రోడ్డులోని ఓ హోటల్‌లో తొలి 300 మందికి రూ.3కే బీఫ్ బిర్యానీ అని ప్రకటన చేశారు. దీంతో శుక్రవారం వేకువజాము నుంచే భారీగా జనం గుమిగూడారు. గంటల తరబడి క్యూలో ఉన్నారు. ఉదయం 5 గంటలకు ప్రారంభం కాగా నిమిషాల్లోనే ఖాళీ అయిపోయింది. ఆ తర్వాత వచ్చిన వారికి రూ.50కు విక్రయించారు. వ్యాపారం ప్రమోషన్ కోసమే ఇలాంటి ఆఫర్ పెట్టినట్లు దుకాణాదారుడు తెలిపాడు.

– తిరుత్తణి



బిర్యానీ కోసం క్యూలో ఉన్న మాంసాహార ప్రియులు

బీబీసీ డాక్యుమెంటరీపై నిషేధం

- ఉల్లంఘించి ల్యాప్‌టాప్‌లలో వీక్షణ

సాక్షి, చెన్నై: గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శనపై మద్రాసు వర్సిటీ నిషేధం విధించింది. దీంతో విద్యార్థులు వర్సిటీ ఆవరణలో ల్యాప్‌టాప్‌లలో ఆ డాక్యుమెంటరీని వీక్షించారు. గుజరాత్‌లో గతంలో జరిగిన అల్లర్లపై బీబీసీ ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించింది. దీనిని దేశ వ్యాప్తంగా ఉన్న వర్సిటీలలో శుక్రవారం ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. చెన్నైలో మద్రాసు వర్సిటీ సెంటినరీ ఆడిటోరియంలో ప్రదర్శనకు ఎస్ఎఫ్ఐ ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మక అంశం కావడంతో మద్రాసు వర్సిటీ అప్రమత్తమైంది. ప్రదర్శనపై నిషేధం విధించింది. దీనిని విద్యార్థి సంఘం నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. సెంటినరీ ఆడిటోరియం పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వీక్షించి తీరుతామని విద్యార్థులు తేల్చి చెప్పడంతో ఉత్కంఠ నెలకొంది. వర్సిటీ పరిసరాల్లో భద్రతను పెంచారు. అయితే, విద్యార్థులు ఆడిటోరియంలో కాకుండా చెట్ల కింద, కళాశాలల ఆవరణలో కూర్చుని ల్యాప్‌టాప్‌ల ద్వారా వీక్షించారు. నిషేధాన్ని ఉల్లంఘించి డాక్యుమెంటరీ వీక్షించిన వారిని మద్రాసు వర్సిటీ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

పెట్టుబడిదారులకు అనుకూలంగా నిధులు

సాక్షి, చెన్నై: పెట్టుబడులు పెట్టే వారికి అనుకూలంగా ఉండే విధంగా ఐటీఐ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని ఆ సంస్థ ప్రధాన అధికారి రాజేష్ భాటియా తెలిపారు. ఐటీఐ ఫండ్స్, దీర్ఘ కాలిక పెట్టుబడులు, ప్రక్రియలు, ఫండ్ ఉత్పత్తుల గురించి స్థానికంగా ఆయన వివరించారు. తమ ఫండ్ హౌస్ గత నెల 31వ తేదీ నాటికి రూ.3,557 కోట్ల ఆస్తులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో ఈక్విటీ ఏయూఎంగా రూ. 2,774.94 కోట్లు ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఎన్ఎఫ్ఓ– ఐటీఐ ఫ్లెక్సీ క్యాప్ పేరిట ఫండ్‌ను ఏర్పాటుచేశామని, ఇది పెట్టుబడిదారులకు అనుకూలంగా పేర్కొన్నారు. తమ నేతృత్వంలోని 16 పథకాలు పూర్తిగా పెట్టుబడి దారులకు ఉత్తమ అవకాశాలు, అనుభవాన్ని కల్పించే విధంగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. తాజాగా ప్రకటించిన ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 10వ తేదీతో ముగుస్తుందని చెప్పారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

తిరువొత్తియూరు: వందవాసి సమీపంలో బైక్, వ్యాను ఢీకొన్న ప్రమాదంలో సినిమా చిత్రం షూటింగ్ ఉద్యోగి మృతి చెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపం దేసూరు అరసమరం వీధికి చెందిన ముత్తులింగం చెన్నై కార్పొరేషన్ రవాణా సంస్థలో డ్రైవర్. ఇతని కుమారుడు విశ్వ (22) చెన్నై సినిమా చిత్రం షూటింగ్ ఉద్యోగి. చెన్నై తండయార్ పేట ప్రాంతంలో విశ్వ నివాసం ఉంటున్నాడు. దేసూర్‌లో ఇల్లు కట్టడానికి భూమిపూజ గురువారం జరిగింది. ఇక్కడికి స్నేహితుడు ఇంజినీర్ అభినేష్ (23)తో బైకులో వెళ్లాడు. భూమిపూజ అనంతరం సాయంత్రం ఇద్దరూ బైకులు చెన్నైకి బయలుదేరారు. చేత్తుపట్టు హైవే రోడ్డు అరసూర్ గ్రామం వద్ద వెళుతుండగా చెన్నై నుంచి సెంజీకి వెళ్తున్న వ్యాన్ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్వ మృతి చెందాడు. గాయపడ్డ అతని స్నేహితుడు అభినేష్‌ను చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీని గురించి సమాచారం పొన్నూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ జవాన్ ఆత్మహత్య

అన్నానగర్: తిరుమకోట్టైలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరువారూర్ జిల్లా మన్నార్గుడి సమీపంలోని కలవైకరైకి చెందిన రఘుపతి (58) రిటైర్డ్ ఆర్మీ జవాన్. ఇతని భార్య సుమతి. వీరికి కుమారుడు, కూమర్తె ఉన్నారు. ప్రస్తుతం రఘుపతి తిరుమకోట్టైలోని గ్యాస్ టర్బైన్ పవర్ ప్లాంట్‌లో వాచ్‌మన్. తిరుమకోట్టై దుకాణం వీధిలోని ఓ గదిలో ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో రఘుపతి మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి తాను బస చేసిన గది కిటికీకి ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రఘుపతి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మన్నార్గుడి ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



కొండపై నుంచి మృతదేహాన్ని కిందకు తీసుకొస్తున్న సిబ్బంది

వేలూరు: వేలూరు సమీపంలోని బాలమది కొండపై బండరాళ్ల మధ్యలో ఓ వివాహిత (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు ముఖాన్ని రాయితో కొట్టినట్లు ఉన్నట్టు గుర్తించారు. ఆమె పంజాబ్ డ్రస్ వేసుకుని మెడలో తాళిబొట్టు ఉండడంతో ఆమె వివాహిత అని నిర్ధారించారు. అయితే ఈమెను కొండపై నుంచి కిందకుతోసి హత్య చేశారా లేక హత్యచేసి కొండపై నుంచి మృతదేహాన్ని కింద పడేశారా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కొండపై నుంచి మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలమది కొండ కింద ఉన్న సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను పోలీసులు తనఖీ చేస్తున్నారు.

వ్యాన్ టైర్ పేలి ముగ్గురు మృతి

అన్నానగర్ : టైర్ పేలి వ్యాన్ రోడ్డు బారికేడ్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటనలో ముగ్గురు మృతిచెందారు తిరువణ్ణామలై జిల్లా వందవాసి సమీపంలోని బాదూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళకు శుక్రవారం చెన్నైలోని వేలచ్చేరిలో పెళ్లి అయ్యింది. గురువారం రాత్రి వెలచ్చేరీలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో వివాహ రిసెప్షన్ జరిగింది. దీనికి హాజరయ్యేందుకు బాదూర్ గ్రామానికి చెందిన 25 మంది వ్యానులో వేలచ్చేరికి బయలుదేరారు. వందవాసికి చెందిన డ్రైవర్ సురేష్ వ్యాన్‌ నడిపాడు. తిరుచ్చి–చెన్నై మధురాంతకం సమీపంలోని కరుంగులీ ప్రాంతంలో వెళుతుండగా వ్యాన్ వెనుక టైరు పగిలింది. దీంతో వ్యాన్ అదుపుతప్పి రోడ్డు బారికేడ్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న బాదూర్ గ్రామానికి చెందిన సవిత (12) అక్కడికక్కడే మృతిచెందింది. గోకుల్ (14), అజిత్ (7) సహా 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న మధురాంతకం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గోకుల్, అజిత్ మృతి చెందారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మధురాంతకం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెయ్యూరులో ఫైనాన్సియర్ కిడ్నాప్



అరెస్టయిన కిడ్నాపర్లు

- ఆరుగురు అరెస్ట్

తిరువణ్ణామలై(వేలూరు): అప్పు ఇవ్వలేదని ఓ ఫైనాన్షియర్‌ను కిడ్నాప్ చేశారు. ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువణ్ణామలై జిల్లా వేపాక్కం తాలుకా నాటేరి గ్రామానికి చెందిన రామచంద్రన్(45). ఇతను సోదరులు సురేష్, వడివేలుతో కలిసి ఆసనాంబట్టు క్రాస్‌రోడ్డులో ఫైనాన్స్ సంస్థ నడుపుతున్నాడు. ఈనెల 24న సాయంత్రం రామచంద్రన్ కార్యాలయానికి తాళం వేసి ఇంటికి బైకులో బయలుదేరాడు. ఆ సమయంలో కారులో వచ్చిన ఐదుగురు రామచంద్రన్‌పై దాడి చేసి కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. కిడ్నాపర్‌లు రామచంద్రన్ తమ్ముడు రవిచంద్రన్‌కు ఫోన్ చేసి రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రవిచంద్రన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో గురువారం సాయంత్రం 8 గంటల సమయంలో కిడ్నాపర్లు రామచంద్రన్‌ను పుదూరు క్రాస్ రోడ్డు వద్ద వదిలి వెళ్లారు. రామచంద్రన్ వద్దనున్న రూ.50 వేల నగదు, మూడు సవర్ల బంగారు చైన్‌ను దోచుకున్నట్లు తెలిసింది. డీఎస్పీ వెంకటేశన్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. రాణిపేట జిల్లా కావేరి పాక్కం సమీపంలోని మామండూరు గ్రామానికి చెందిన ప్రభాకరన్, రామచంద్రన్‌ను ఫైనాన్స్ అడగడంతో నిరాకరించడంతో కిడ్నాప చేసినట్లు విచారణలో తేలింది. దీనికి సంబంధించి ప్రభాకరన్ స్నేహితులు మామండూరుకు చెందిన రమేష్, రాజేంద్రన్, సిరుకరంబూరు రాజేంద్రప్రసాద్, కాంచీపరరం తాలుకా తామల్ గ్రామానికి చెందిన విఘ్నేష్, తమిళరసన్ కిడ్నాప్‌నకు సహకరించినట్లు తెలిసింది. పాయిగైకి చెందిన మోహన్‌రాజ్ కారును వినియోగించినట్లు తెలిసింది. పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు.

ప్రియురాలిపై కోపం

- రూ.70 లక్షల కారు తగులబెట్టిన ప్రేమికుడు

అన్నానగర్: ప్రియురాలిపై కోపంతో రూ.70లక్షలు విలువ చేసే కారును ఓ యువకుడు తగులబెట్టాడు. ధర్మపురి జిల్లాకు చెందిన కవిన్ (28). కాంచీపురం సమీపంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలో గతేడాది మెడిసిన్ పూర్తి చేశాడు. ఇతను, అదే కాలేజీలో చదువుతున్న విద్యార్థినిని ప్రేమించుకుంటున్నారు. ఈ స్థితిలో గురువారం సాయంత్రం ధర్మపురి నుంచి కాంచీపురం వెళ్లిన కవిన్, ప్రియురాలు కాంచీపురం పక్కనే ఉన్న రాజకులం కులకరై ప్రాంతంలో మాట్లాడుకుంటున్నారు. అప్పుడు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన కవిన్ తన రూ.70 లక్షల విలువైన కారును పెట్రోల్ పోసి తగులబెట్టాడు. స్థానికులు అగ్నిమాపకశాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు రంగంలోకి దిగారు. అయితే కారు పూర్తిగా దగ్ధమైంది. కాంచీపురం తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో 8 సవర్ల నగలు చోరీ

తిరువళ్లూరు: ఇంటి ముందు ముగ్గువేస్తున్న మహిళపై కారంపొడి చల్లి దుండగుడు బంగారు నగలను లాక్కెళ్లిన సంఘటన తిరువళ్లూరు జిల్లా కాకలూరులో కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా కాకలూరు హౌసింగ్ బోర్డు ప్రాంతంలో హరిహరన్(52) ఇతడి భార్య శ్యామల(46) నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 5 గంటలకు శ్యామల ఇంటి గుమ్మం వద్ద ముగ్గువేస్తుండగా ఆమెపై కారంపొడి చల్లి మెడలో వున్న 8 సవర్ల బంగారు నగలను లాక్కెళ్లాడు. బాధితురాలు తిరువళ్లూరు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ కమలహాసన్ విచారణ చేపట్టారు. విచారణలో అదే ప్రాంతానికి చెందిన పరమశివం కుమారుడు రాజన్(48) చోరీకి పాల్పడినట్టు నిర్ధారించారు. అతడ్ని అరెస్టు చేసిన పోలీసులు 8 సవర్ల బంగారు నగలను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

బోర్డు తిప్పేసిన పీటీ టెక్స్

- బాధితుల ఆందోళన

అన్నానగర్: రాజపాళయంలో చిట్ ఫండ్స్ నిర్వహించి రూ. 10 కోట్లు మోసం చేశారు. బాధితులు శుక్రవారం చిట్ ఫండ్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసనకు దిగడంతో తోపులాట చోటుచేసుకుంది. విరుదునగర్ జిల్లా రాజపాళయం సమీపంలోని దళవాయిపురంలో 'పీటీ టెక్స్' పేరుతో 7 మంది భాగస్వాములతో టెక్స్ టైల్స్ నడుపుతున్నారు. అందులో చిట్ ఫండ్స్ కూడా నిర్వహిస్తున్నారు. 40 ఏళ్లుగా స్థానికుల నుంచి చీటీ డబ్బులు వసూలు చేస్తున్నారు. గత ఏడాది కాలంలో 85 మందికి పైగా చీటీ డబ్బులు చెల్లించకుండా రూ. 10 కోట్ల వరకు మోసం చేశారు. దీంతో బాధితులు దలవాయిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా ఎలాంటి చర్యలు లేవు. దీంతో బాధిత ప్రజలు శుక్రవారం చిట్ ఫండ్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసనకు దిగారు. దలవాయిపురం పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. న్యాయం చేయకుంటే విరుదునగర్ కలెక్టర్, ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని బాధితులు హెచ్చరించారు.

నేడు కళాశాలలు పనిచేస్తాయ్

తిరువొత్తియూరు: పాఠ్యాంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు శనివారం కూడా పనిచేస్తాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు యథావిధిగా తరగతులు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ట్స్ కళాశాలల్లో 3 లక్షలకు పైగా విద్యార్థులు మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. పాఠ్యాంశాలను పరీక్షలకు ముందుగానే పూర్తి చేసి మే నెలలో విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. పాఠ్యాంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఉద్దేశంతో శనివారం కూడా తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ, గ్రాంటు పొందుతున్న కళాశాలలు శనివారం పనిచేస్తాయని ప్రకటించారు.

కుమారులు మందలించారని తల్లి ఆత్మహత్య

అన్నానగర్: మద్యం తాగొద్దని కుమారులు మందలించినందుకు తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నై కొలత్తూరు, శివశక్తి నగర్, 6వ వీధికి చెందిన కాత్తాయ్ (38). ఈమె భర్త మునుస్వామి మానసికవ్యాధితో వన్నామలైలోని బంధువుల ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. దీంతో కాత్తాయ్ మేస్త్రీ పనికి వెళుతూ ఇద్దరు కుమారులు ధర్మదురై (17), తంగదురై (13)తో కలిసి ఉంటోంది. కాత్తాయ్ మద్యానికి బానిసైంది. మద్యం తాగొద్దని ఇద్దరు కుమారులు మందలించారు. దీంతో కాత్తాయ్ మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

మరింత ప్రతిభ కనబరచాలి

పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

సాక్షి, అమరావతి: రాబోయే రోజుల్లో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ అధికారులు, సిబ్బంది మరింత ప్రతిభ కనబరచాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి కోరారు. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పురపాలక శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విభాగాలు గృహ నిర్మాణ శాఖ, గ్రామ,వార్డు సచివాలయ శాఖ శకటాలు ప్రథమ, తృతీయ అవార్డులు సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

శరత్‌చంద్రారెడ్డికి బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో శరత్‌చంద్రారెడ్డికి రౌజ్ అవెన్యూ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. శరత్ బెయిలు పిటిషన్‌పై శుక్రవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ విచారణ చేపట్టారు. శరత్‌చంద్రారెడ్డి నానమ్మ మృతిచెందారని, అంత్యక్రియలు, కర్మకాండల నేపథ్యంలో బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది కోరారు. శరత్ చిన్నప్పటి నుంచి నానమ్మ దగ్గరే పెరిగారని, నానమ్మ చివరి కోరిక మేరకు అంత్యక్రియల్లో పాల్గొనాల్సి ఉందని తెలిపారు. ఈ దశలో శరత్‌కు బెయిల్ మంజూరు చేయద్దని ఈడీ వాదనలు వినిపించింది. వాదనల అనంతరం శరత్‌కు రూ.2లక్షల పూచీకత్తుతో 14 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు.

• తెలంగాణ

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నేషనల్ గైడ్స్ కమిషనర్‌గా కవిత

సాక్షి, హైదరాబాద్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నేషనల్ గైడ్స్ కమిషనర్‌గా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియమితులయ్యారు. ఈ విషయాన్ని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైరెక్టర్ రాజ్‌కుమార్ కౌశిక్ శుక్రవారం ప్రకటించారు.

బండి కుమారుడికి పోలీసుల నోటీసు

దుండిగల్: సహ విద్యార్థిపై దాడి కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు పోలీసులు నోటీసు అందజేశారు. బహదూర్‌పల్లిలోని మహేంద్ర వర్సిటీలో బీటెక్ చదువుతున్న భగీరథ్ డిసెంబర్ 17న.. తోటి విద్యార్థి శ్రీరామ్‌ను తీవ్రంగా కొట్టాడు. దీనిపై ఈ నెల 18న భగీరథ్‌పై దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ నెల 20న 41 సీఆర్‌పీసీ కింద భగీరథ్‌కు నోటీసు అందజేశారు.

గ్రూపు-1 ప్రిలిమినరీ ఫలితాల వెల్లడి

రికార్డు స్థాయిలో పరీక్షలు జరిగిన 19 రోజుల్లో ఫలితాలు

- ఏప్రిల్ 23 నుంచి మెయిన్స్ పరీక్షలు
- వారం రోజుల షెడ్యూల్‌ను ప్రకటించిన ఏపీపీఎస్సీ

సాక్షి, అమరావతి: గ్రూపు-1 ప్రిలిమినరీ రాత పరీక్ష ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం ప్రకటించింది. ఈ నెల 8న ఇందుకు సంబంధించి రాతపరీక్షలు నిర్వహించారు. అయితే, ఏపీపీఎస్సీ చరిత్రలోనే రికార్డు వ్యవధిలో కేవలం 19 రోజుల్లో ఫలితాలు వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబరు 30న ప్రభుత్వం గ్రూపు-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీచేయగా.. రాష్ట్రవ్యాప్తంగా 1,26,449 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 1,06,473 మంది హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో 87,718 మంది ఈనెల 8న రాతపరీక్షకు హాజరయ్యారు. మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మొత్తం 6,455 మందిని ఏపీపీఎస్సీ మెయిన్స్ పరీక్షలకు ఎంపిక చేస్తూ అందుకు సంబంధించిన ఫలితాలను శుక్రవారం ప్రకటించింది. మరోవైపు.. ఏప్రిల్ 23 నుంచి వారం రోజులపాటు



జరిగే మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను కూడా ఏపీపీఎస్సీ ప్రకటించింది. ప్రిలిమినరీ పరీక్షల తుది కీ వివరాలు www.psc.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని ఏపీపీఎస్సీ కార్యదర్శి జె. ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేగంగా ఉద్యోగ నియామకాలకు సీఎం ఆదేశాలు

ప్రభుత్వోద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యానికి లోనుకాకుండా నియామకాల ప్రక్రియ వేగంగా పూర్తికావాలని బోర్డు చైర్మన్‌కు సీఎం వైఎస్ జగన్ స్పష్టమైన సూచనలు చేశారని ఏపీపీఎస్సీ బోర్డు సభ్యులు సలాం బాబు 'సాక్షి'కి తెలిపారు. ఏపీపీఎస్సీ చరిత్రలో ఇంత స్వల్ప వ్యవధిలో రాతపరీక్షల ఫలితాలు ప్రకటించడం ఎప్పుడూ జరగలేదని ఆయన వివరించారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్..

23-04-2023	పేపర్ ఇన్ తెలుగు
24-04-2023	పేపర్ ఇన్ ఇంగ్లీషు
25-04-2023	పేపర్-1, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలపై జనరల్ ఎస్సే
26-04-2023	పేపర్-2, హిస్టరీ, కల్చరల్, జాగ్రఫీ ఆఫ్ ఇండియా అండ్ ఆంధ్రప్రదేశ్
27-04-2023	పేపర్-3, పాలిటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్, లా అండ్ ఎథిక్స్
28-04-2023	పేపర్-4, ఎకానమీ, డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా అండ్ ఆంధ్రప్రదేశ్
29-04-2023	పేపర్-5, సైన్స్, టెక్నాలజీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సంబంధిత అంశాలు

3న 'స్థానిక' సంస్థలకు ఉప ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్‌లు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 'స్థానిక' సంస్థల ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని శుక్రవారం వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేశారు. ఫిబ్రవరి మూడో తేదీ రాష్ట్రంలో ఏడు మండలాల్లో మండల పరిషత్ అధ్యక్ష(ఎంపీపీ) పదవులతో పాటు 11 మండలాల్లో ఉపాధ్యక్ష, ఆరు మండలాల్లో మండల కో- ఆప్షన్ సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటిలో ఓ ఎంపీపీ, మూడు ఉపాధ్యక్ష పదవులు గతంలో వివిధ కారణాలతో వాయిదా పడినవి. మిగిలిన చోట్ల ఆయా పదవుల్లో పనిచేసే వారు మరణించడం లేదా రాజీనామాల కారణంగా ఖాళీలు ఏర్పడ్డాయి. ఇవి కాకుండా.. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ పదవికి కూడా ఫిబ్రవరి 3వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. మరో 30 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచి పదవులకూ అదే రోజు ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇవన్నీ పరోక్ష పద్ధతిన జరిగే ఎన్నికలు కావడం గమనార్హం. ఏదైనా కారణాలతో ఎన్నిక వాయిదా పడితే ఆ మరుసటి రోజు అంటే నాలుగో తేదీన తిరిగి నిర్వహించాలని నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక జరిగే దాచేపల్లితో పాటు ఎంపీపీ, మండల ఉపాధ్యక్ష, మండల కో- ఆప్షన్ ఎన్నికలు జరిగే చోట్ల గెజిటెడ్ స్థాయి అధికారిని ఎన్నికలాధికారిగా నియమించాలని ఎన్నికల కమిషనర్ ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. ఉప సర్పంచి ఎన్నికలు జరిగే చోట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయికి పైబడిన అధికారులను ఎన్నికలాధికారిగా నియమించాలని సూచించారు.

- ▲ **చైర్మన్ పదవికి ఎన్నిక జరిగే మునిసిపాలిటీ:** దాచేపల్లి నగర పంచాయతీ
- ▲ **ఎంపీపీ ఎన్నికలు జరిగే మండలాలు:** రామకుప్పం(చిత్తూరు), ఎస్.రాయవరం(అనకాపల్లి), పిడుగురాళ్ల(పల్నాడు), సంతమాగులూరు(బాపట్ల), ఆలూరు(కర్నూలు), విడపనకల్లు(అనంతపురం), చెన్నేకొత్తపల్లి(శ్రీసత్యసాయి)
- ▲ **ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు జరిగే మండలాలు:** గార (శ్రీకాకుళం), జియ్యమ్మవలస(పార్వతీపురం మన్యం), పాయకరావుపేట(అనకాపల్లి), సామర్లకోట(కాకినాడ), నరసరావుపేట, పెదకూరపాడు (పల్నాడు), వెంకటాచలం(నెల్లూరు), రామకుప్పం, పూతలపట్టు(చిత్తూరు), ఎమ్మిగనూరు(కర్నూలు), కలికిరి(అన్నమయ్య)
- ▲ **మండల కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక జరిగే మండలాలు:** కొత్తవూరట్ల (అనకాపల్లి), గంపలగూడెం (ఎన్టీఆర్), జలదంకి(నెల్లూరు), చిల్లకూర్(తిరుపతి), చిత్తూరు(చిత్తూరు), మద్దికేర(కర్నూలు).
- ▲ **ఉప సర్పంచ్ ఎన్నికలు జరిగే పంచాయతీలు:** 30 (29 మండలాల పరిధి)

ఎవరేం మాట్లాడాలో న్యాయస్థానాలు నిర్దేశించలేవు

- బిగ్‌బాస్ అభ్యంతరకరంగా ఉంటే చూడకండి: హైకోర్టు

సాక్షి, అమరావతి: ఎవరు ఏం మాట్లాడాలో న్యాయస్థానాలు నిర్దేశించలేవని హైకోర్టు స్పష్టం చేసింది. టీవీల్లో ప్రసారమయ్యే ఫలానా షో అభ్యంతరకరంగా ఉందనుకుంటే దాన్ని చూడొద్దని స్పష్టం చేసింది. బిగ్‌బాస్ కంటే అభ్యంతరకరమైన షోలు వివిధ రకాల వేదికల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. బిగ్‌బాస్ షో అభ్యంతరకరంగా ఉందనుకుంటే దాన్నీ చూడొద్దని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. టీవీలో ప్రసారమయ్యే షోలపై అభ్యంతరాలుంటే దానిపై ఫిర్యాదు చేసేందుకు చట్టప్రకారం తగిన వేదికలున్నాయని, అక్కడికి వెళ్లకుండా నేరుగా కోర్టును ఆశ్రయించడానికి వీల్లేదని స్టార్ టీవీ యాజమాన్యం చెప్పిన నేపథ్యంలో.. అందుకు సంబంధించిన వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆ సంస్థ న్యాయవాది తూము శ్రీనివాస్‌ను ఆదేశించింది. విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అశ్లీలత, అసభ్యత, అనైతిక, హింసాత్మక చర్యలను ప్రోత్సహించడంతోపాటు యువతను పెడదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్ షో ప్రసారాన్ని నిలిపేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త, నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై శుక్రవారం సీజే ధర్మాసనం మరోసారి విచారించింది. పిటిషనర్ న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బిగ్‌బాస్ షోలో అశ్లీలత ఎక్కువైపోయిందన్నారు. పోటీలో పాల్గొనే మహిళలకు గర్భధారణ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమయంలో స్టార్ టీవీ న్యాయవాది శ్రీనివాస్ స్పందిస్తూ.. బిగ్‌బాస్ షో ఈ సీజన్ ముగిసిందని చెప్పారు.

• తెలంగాణ

హలంతో పాటు కలం

- రైతులు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా చట్టసభల్లోకి వెళ్లాలి
- ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: 'రైతులు తమ హక్కుల కోసం దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలల పాటు ఆందోళన చేయాల్సిన దుస్థితి భారతదేశంలో తప్ప మరే దేశంలోనైనా ఉంటుందా? ఇంత సుదీర్ఘకాలం ఆందోళన చేసినా ఫలితం శూన్యం. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క పరిష్కారం కానీ, భరోసా కానీ లభించలేదు. దేశ ప్రజలు, రైతులు, పేదలను కేంద్రం ఇలా హేళన చేయడం భావ్యమేనా? అందుకే భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పార్టీ 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదాన్ని ఎత్తుకుంది. ఈ దేశ రైతులు నాగలితో పాటు పెన్ను పట్టడం కూడా నేర్చుకుని ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చట్టసభల్లోకి వెళ్లాలి..' అని తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్, ఆయన భార్య, మాజీ ఎంపీ హేమ గమాంగ్‌తోపాటు ఆ రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల నేతలు తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. గిరిధర్ గమాంగ్‌తో పాటు ఒడిశా నుంచి వచ్చిన నేతలకు కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. భారతదేశ భవిష్యత్తును, ఆలోచనను, భావజాలాన్ని మార్చే సంకల్పంతోనే భారత్ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. గిరిధర్ గమాంగ్ లాంటి మచ్చలేని సీనియర్ రాజకీయ నాయకుడు బీఆర్‌ఎస్‌లో చేరడం తనకు వేయి ఏనుగుల బలాన్ని ఇచ్చిందన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన ఒడిశా నాయకుల్లో గిరిధర్ గమాంగ్ కుమారుడు శిశిర్ గమాంగ్, శౌర్య గమాంగ్, ఒడిశా బీజేపీ రాష్ట్ర యువ మోర్చా ప్రధాన కార్యదర్శి స్నేహరంజన్ దాస్ తదితరులున్నారు.

బీఈడీ కౌన్సెలింగ్ గడువును 31 వరకు పొడిగించండి

- కోర్టుకొచ్చిన కాలేజీలను కౌన్సెలింగ్ జాబితాలో చేర్చండి
- ఉన్నత విద్యామండలికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: బీఈడీ మొదటి విడత కౌన్సెలింగ్ గడువు తేదీని ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించాలని ఉన్నత విద్యామండలిని హైకోర్టు ఆదేశించింది. అదేవిధంగా హైకోర్టును ఆశ్రయించిన బీఈడీ కాలేజీలను కౌన్సెలింగ్ జాబితాలో చేర్చాలని కూడా ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. తమ కాలేజీలను కౌన్సెలింగ్ జాబితాలో చేర్చకపోవడాన్ని సవాలు చేస్తూ పలు బీఈడీ కాలేజీలు హైకోర్టును ఆశ్రయించాయి. అలాగే ఈ నెల 25వ తేదీ నుంచి కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని నిర్ణయించారని, ఈ తేదీని పొడిగించేలా ఆదేశాలివ్వాలంటూ పలువురు విద్యార్థులు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ మన్మథరావు విచారించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్, మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపిస్తూ.. జీరో అడ్మిన్ పేరుతో తమ కళాశాలలను ఏకపక్షంగా కౌన్సెలింగ్ జాబితా నుంచి తొలగించారన్నారు. కౌన్సెలింగ్ జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ఈ నెల 24న తెలియచేసి, 25 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించారని తెలిపారు. తమ కాలేజీలు కౌన్సెలింగ్‌కు అర్హమైనవేనంటూ ప్రభుత్వం ధ్రువపత్రాలిచ్చినా ఉన్నత విద్యామండలి అధికారులు ఏకపక్షంగా కౌన్సెలింగ్ జాబితా నుంచి తొలగించారని వివరించారు. ఉన్నత విద్యాశాఖ తరఫున సహాయ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆయా కాలేజీల్లో పలు లోపాలున్నాయని చెప్పారు. అందువల్లే నిబంధనల మేరకు ఆ కాలేజీలను కౌన్సెలింగ్ జాబితా నుంచి తొలగించామన్నారు. విద్యార్థులు ఈ కాలేజీల్లో చేరితే నష్టపోవాల్సి ఉంటుందని, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కోర్టును ఆశ్రయించిన కాలేజీలను కౌన్సెలింగ్ జాబితాలో చేర్చాలని ఉన్నత విద్యామండలిని ఆదేశించారు. అలాగే మొదటి విడత కౌన్సెలింగ్ తేదీని ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించాలని ఆదేశించారు. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేశారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక పరుగులు



- మూడున్నరేళ్లలో 22 పెద్ద పరిశ్రమల స్థాపన
- వీటికి రూ.14,790 కోట్ల వరకు పెట్టుబడులు
- వీటిలో 12,785 మందికి ఉద్యోగావకాశాలు
- రూ.674 కోట్లతో 1,532 ఎంఎస్‌ఎంఈలు
- వీటిలో 11,312 మందికి ఉద్యోగాలు

శ్రీ సత్యసాయి జిల్లాలో 2019 జూన్ తర్వాత ఏర్పాటైన కంపెనీలు, పెట్టుబడుల వివరాలు

లార్జ్ అండ్ మెగా ఇండస్ట్రీ యూనిట్లు	22
భారీ పరిశ్రమల ద్వారా పెట్టుబడులు	రూ.14,790 కోట్లు
వీటిలో ఉద్యోగావకాశాలు పొందినవారి సంఖ్య	12,785
ఎంఎస్‌ఎంఈలు	1,532
వీటిద్వారా పెట్టుబడులు	రూ.674 కోట్లు
వీటిలో ఉద్యోగావకాశాలు పొందినవారి సంఖ్య	11,312

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 2020 సంవత్సరంలో పెనుకొండ నియోజకవర్గం గుడిపల్లి వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన సింటెక్స్ కార్ల అద్దాల తయారీ పరిశ్రమ ఇది. నాలుగెకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమలో ఇప్పుడు 250 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సర్కారు వెన్నుదన్నుతో శ్రీ సత్యసాయి జిల్లా పారిశ్రామికంగా దూసుకెళుతోంది. భారీ, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమల స్థాపనలో గతంలో ఎన్నడూ లేనంతగా జిల్లాలో దూకుడు పెరిగింది. గత మూడున్నరేళ్లలో వివిధ పరిశ్రమల స్థాపన ద్వారా 24 వేలమందికి ఉద్యోగావకాశాలు లభించాయి. సింగిల్ డెస్క్ పాలసీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు ఇవ్వడం, బ్యాంకు లింకేజీ, ప్రభుత్వ సబ్సిడీ, తక్కువ ధరకు ప్రభుత్వ భూములు ఇవ్వడం వంటి చర్యల వల్ల జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. గత మూడున్నరేళ్లలో భారీ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈల స్థాపనలో భాగంగా రూ.15,464 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీన్నిబట్టే పారిశ్రామికంగా ఈ ప్రాంతం ఎంత అనువైనదో అంచనా వేయవచ్చు. హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో ఎక్కువ పరిశ్రమలు వచ్చాయి. భారీ ప్రాజెక్టుల ద్వారా రూ.14,790 కోట్లు, ఎంఎస్‌ఎంఈల ద్వారా రూ.674 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. భారీ పరిశ్రమల్లో 12,785 మందికి, చిన్న ప్రాజెక్టుల్లో 11,312 మందికి ఉద్యోగాలు లభించాయి.

అధికారులు వెంటనే స్పందించారు



సీపీవీసీ మెటీరియల్ ఏర్పాటు చేద్దామని ముందుగా కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్నా. ఆరు మాసాలైనా అక్కడ స్పందన లేదు. దీంతో శ్రీ సత్యసాయి జిల్లాలో పరిశ్రమలశాఖ పోర్టల్‌లో దరఖాస్తు చేశా. వెంటనే అధికారులు ఫోన్‌చేసి ప్రోత్సహించారు. భూముల కేటాయింపు మొదలుకొని అన్ని అనుమతులు వెంటనే ఇచ్చారు. దీంతో రూ.7 కోట్లతో ప్రైమ్ ఇంటర్నేషనల్ కంపెనీ పెట్టా. 200 మందిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

– డాక్టర్ నాగేంద్ర (ఆర్థోపెడిక్), బెంగళూరు

పాలసీ మారాక మంచి ప్రగతి

సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల పాలసీలో మార్పులు వచ్చాయి. కొత్త పాలసీ తీసుకువచ్చాక కంపెనీల ఏర్పాటు సులభతరమైంది. చాలామంది ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. ఉద్యోగావకాశాలు బాగున్నాయి.

– చాంద్‌బాషా, జనరల్ మేనేజర్, పరిశ్రమలశాఖ

ఇక్కడే ఉద్యోగం



గుడిపల్లి సమీపంలో సింటెక్స్ కంపెనీ ఏర్పాటయ్యాక నాకు ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.15 వేల వేతనం వస్తోంది. నాలాంటి వాళ్లు చాలామంది ఇక్కడ పనిచేస్తున్నారు.

– మాల హరి, సోమందేపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా

గోదారి గట్టు విలపిస్తోంది..

అలనాటి అందాల తార జమున అస్తమయంతో జిల్లాలో విషాదం

- గోదావరితో ఈమెకు విడదీయలేని బంధం
- మూగమనసులతో మనసు దోచుకున్న నటి
- రాజమహేంద్రి ఎంపీగా రాజకీయ ప్రస్తానం



సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం).. మలాపురం టౌన్..సామర్లకోట..కొవ్వూరు: గోదారీ గట్టుంది.. గట్టుమీన సెట్టుంది.. సెట్టుకొమ్మన పిట్టుంది.. పిట్ట మనసులో ఏముంది..ఈ పాట వినగానే ఠక్కున గుర్తుకు వచ్చేది గలగల పారే గోదావరి మాత్రమే కాదు..అమాయకత్వాన్ని..అందాన్ని..అభినయాన్ని మూటగట్టుకున్న అలనాటి సినీనటి జమున..గోదావరిని..ఆ నదీమతల్లి పేరును తెరకు బలంగా పరిచయం చేసిన ఆమె మూగ మగమనసులు ఎప్పటికీ చిరస్మరణీయం ..రాజమహేంద్రవరానికి చెందిన దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు తాను అమితంగా ప్రేమించే గోదావరిని 1964లో ఈ చిత్రం ద్వారా తెరకెక్కించారు. గోదారి గట్టుంది పాటకు తన అభినయంతో జమున ప్రాణం పోశారు. శుక్రవారం ఉదయం జమున కన్నుమూశారని తెలియగానే జిల్లా ప్రజానీకం కంటతడి పెట్టింది. ఈ అందాల తారతో తమ గోదారి ప్రాంతానికి ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుంది. చాలామంది ఈమెను గోదావరి జిల్లా వాసిగా భావిస్తారు. కర్నాటక హంపీలో పుట్టినా ఈమె మన జిల్లాతో మమతానురాగాలను పెనవేసుకున్నారు. అందుకే ఇక్కడి ప్రజలు కూడా ఆమెను తమ ఆడపడుచుగా ఆదరించారు.

గలగల పారుతున్న గోదారిలా..

1953లో జమున పుట్టిల్లు సినిమాతో తెరంగేట్రం చేసినా అంత గుర్తింపు రాలేదు. 1964లో ఆదుర్తి దర్శకత్వంలో నిర్మించిన మూగమనసులు చిత్రంలో ఈమె గౌరమ్మ పాత్ర పోషించారు. ఈ చిత్రం ద్వారా జమున ప్రేక్షకుల గుండెల్లో స్థిరమై స్థానం సంపాదించుకున్నారు. అదే సినీమా హిందీలో మిలన్‌గా రీమేక్ చేస్తే అందులో కూడా నటించి మెప్పించారు. ఉత్తమ సహాయనటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. సఖినేటిపల్లి–నర్సాపురం మధ్య వశిష్ట గోదావరి గట్ల పైన..పడవలపైన ఈమెతో తీసిన 'గోదారి గట్టుంది.. పాట ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'నా పాట నీ నోట పలకాలా చిలకా' పాట కూడా గోదావరి అందాల బ్యాక్ డ్రాప్‌లోనే చిత్రీకరించారు. గోదావరికీ జమునకు విడదీయరాని బంధముందేమో. 1974లో చిత్రీకరించిన గౌరి సిమిమాలో 'గల గల పారుతున్న గోదారిలా' పాటలో కృష్ణతో ఇక్కడి గోదావరి పాయల్లోనే నర్తించారు. 2014లో జరిగిన గోదావరి పుష్కరాలకు ఆమె పనిగట్టుకుని మరీ వచ్చారు.'గోదారి గట్టుంది' పాట తాను జీవించి ఉన్నంత కాలం గుర్తుంటుందని చెప్పడం విశేషం

శతదినోత్సవ వేడుకలకు...

రాజమహేంద్రవరం గురుకుల పాఠశాల జరిగిన తహసీల్దార్ గారి అమ్మాయి సినీమా శతదినోత్సవ కార్యక్రమానికి జమున హాజరయ్యారు. మిలాన్ షూటింగ్ సమయంలో రామకృష్ణ మఠం వద్ద గల ఫైనాన్స్ సాయిబాబా ఇంటి వద్ద 25 రోజులు బస చేశారు. రోజూ ఉదయం జమునను చూడడానికి అభిమానులు వచ్చేవారు. అందరినీ పలకరించి షూటింగుకు వెళ్లేవారు. సంసారాలు చిత్ర షూటింగ్ కూడాగోదావరి గట్టున జరిగింది. భర్త రమణారావుకు రాజమహేంద్రవరంలోనూ, కాకినాడలోనూ బంధువులుండటంతో తరచుగా జిల్లాకు వస్తుండేవారు.

పెద్ద మనసున్న నటి

1977లో సంభవించిన దివిసీమ ఉప్పెనతో కనీవిని ఎరుగని నష్టం వాటిల్లింది. ఆ క్లిష్ట సమయంలో బాధితులకు అండగా ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్ వంటి అగ్రతారలతో కలిసి జమున జోలు పట్టి చందాలు వసూలు చేశారు. ఇక్కడి ప్రజలు తమ ఆడపడుచు వచ్చినట్లుగా భావించి స్పందించారు. వంద రూపాయలిస్తే షేక్‌హ్యాండ్ ఇస్తానని సరదాగా అనడంతో అభిమానులు ఎగబడి ఆమెకు కరచాలనం చేసి విరివిరగా విరాళాలు అందజేశారు.

రాజమహేంద్రి ఎంపీగా..

ఇందిరా గాంధీ మీద ఉన్న అభిమానంతో జమున రాజకీయాలలో అడుగుపెట్టారు. తనను సినీరంగంలో ఆదరించిన రాజమహేంద్రవరం నుంచి 1989లో పోటీ చేశారు. లోక్‌సభ సభ్యురాలిగా 1991 వరకూ కొనసాగారు. తెలుగు అర్టిస్టు అసోసియేషన్‌ను ప్రారంభించారు. రంగ స్థల వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న తరుణంలో సామర్లకోట మండలం మాధవపట్నం శివారున ఉన్న తోలు బొమ్మ కళాకారుల జీవన పరిస్థితులు చూసి చలించిపోయారు. అప్పటి కలెక్టరుతో వారి ఇళ్ల స్థలాల గురించి మాట్లాడారు. గ్రామ సమీపంలో సుమారు 10 ఎకరాలను ప్రభుత్వంతో కొనుగోలు చేయించి మూడేసి సెంట్లు వంతున 176 మంది కళాకారులకు ఇళ్ల స్థలాలు అందజేశారు. ఎంపీగా ఉన్నప్పుడు తమ వద్దకు వచ్చి యోగ క్షేమాలు అడిగే వారని ఈ కళాకారుల సంఘ నాయకులు తోట బాలకృష్ణ, తోట గణపతి, రాష్ట్ర బొందిలిల కార్పొరేషన్ డైరెక్టరు తోట సత్తిబాబులు గుర్తు చేసుకున్నారు. అందుకే మాధవపట్నం శివారు ప్రాంతాన్ని జమునానగర్‌గా వ్యవహరిస్తున్నారు.



- ➡ ఎంపీ హోదాలో జమున రాజమహేంద్రవరంలో 1991 ఏప్రిల్ 5న ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొవ్వూరు మండలం నందమూరులో అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించిన వైనాన్ని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.
- ➡ 1989లో కొవ్వూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన రఫీయుల్లా బేగ్ తరుపున జమున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాపవరంలో రఫీ మోటారు బైకు ఎక్కి ఆమె ప్రధాన వీధుల్లో తిరిగి ఓట్లు అభ్యర్థించారు.

రాజమహేంద్రి ఆడపడుచు జమున: ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: జమున మృతికి వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమె నటన తెలుగు ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమేనన్నారు. అగ్ర కథానాయకుల చెంత దీటుగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సత్యభామ పాత్రలో ఆమె జీవించారన్నారు. 70 ఏళ్ల సినీ ప్రస్థానంలో ఎన్నో విజయాలు అందుకున్నారన్నారు. రాజమండ్రి నుంచి ఎంపీగా విజయం సాధించి ఈ ప్రాంత ఆడపడుచుగా పేరొందారని నివాళులర్పించారు.



మాధవపట్నంలో తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమావేశంలో పాల్గొన్న సినీనటి జమున



1989 ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి జమునను కొవ్వూరు అసెంబ్లీ అభ్యర్థి మహ్మద్ రఫీయుల్లాబేగ్ మోటారుసైకిలు ఎక్కించుకుని ప్రచారం చేస్తున్న దృశ్యం



నివాళి

జమున
(1936 - 2023)

అలిగితివా సత్యభామ



తెలుగు అలక నీవే.. తెలుగు మొలక నీవే
వాల్జడను విసిరి వలపు చూపును దూసేది నీవే
అతిశయము నీవే.. స్వాతిశయము నీవే
కనుచూపులో ధిక్కరింపు దుడుకువు నీవే
నీవు సత్యభామవు.. నీవే సతీ అనసూయవు
నీవే రాణి మాలినీదేవివి.. నీవే కలెక్టర్ జానకివి.
పాతికేళ్లపాటు తెలుగు తెరను ఏలావు.
నీ మార్గము నీదయ్యి నీ దుర్గము నీకు నిలిచింది.

ప్రజల అభిమానమే నీకు పద్మభూషణ్.
ప్రేక్షకుల ఆరాధనే రఘుపతి వెంకయ్య.
నీకు అలంకారమైన అలకతో మా నుంచి
వీడ్కోలు తీసుకున్నావని సర్ది చెప్పకుంటున్నాము.
మరోసారి దుగ్గిరాల నుంచి పద్యమై పలుకు.
మరోసారి అపర సత్యభామవై
మువ్వల సడి చెయ్యి.
అలక తీరాక తిరిగి వస్తావు కదూ!

● ఖదీర్

సత్రాజిత్తు కుమార్తె సత్యభామ.

తప్పు.

నిప్పాణి శ్రీనివాసరావు కుమార్తె సత్యభామ.

ఒప్పు.

తెలుగువారికి సంబంధించినంత వరకు సత్యభామది దుగ్గిరాల.

•••

'అమ్మా... కాఫీ'...

బంగారు బుగ్గలతో, మెరిసే కళ్లతో, గారాబంగా పెరిగి, పెంకిగా మారి, కాలు నేలన పెట్టకుండా, నిద్ర కళ్లతో లేచి కాఫీ అడిగే గారాల పట్టి ఎవరు? ఇంకెవరు జమున. 'గుండమ్మ కథ'లో ఆ పాత్రను జమునే చేయాలి. కానీ...

•••

'గుండమ్మ కథ' సినిమా తీయబోయే ముందు.

నిర్మాత చక్రపాణి ఇంట్లో పంచాయితీ.

ఒక గదిలో ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్. మరో గదిలో జమున, ఆమె తండ్రి నిప్పాణి శ్రీనివాస రావు.

'క్షమాపణ పత్రం రాసివ్వమనండి సరిపోతుంది... జమునతో కలిసి పని చేస్తాం' అని ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌ల గది నుంచి ప్రతిపాదన వచ్చింది.

'క్షమాపణ రాసేది లేదు. నా తప్పేమిటో చెప్పమనండి' జమున నుంచి జవాబు.

ఈ తగాదా తీర్చకపోతే గుండమ్మ కథ పట్టాలెక్కదు.

చక్రపాణి రెండు గదుల వైపు మార్చి మార్చి చూశాడు.

•••

'భూకైలాస్' క్లయిమాక్స్ సీన్. మద్రాసు సముద్ర ఒడ్డున తీస్తున్నారు. ఆత్మలింగం చేజార్చుకున్న రావణుడు అంతకంతకూ పెరిగి పెద్దదవుతున్న ఆ లింగాన్ని మోయలేక, తనతో తీసుకెళ్లలేక, దానికి తల కొట్టుకుని ఆత్మత్యాగం చేయబోతున్న దృశ్యం అది. ఎన్.టి.ఆర్ మీద తీస్తున్నారు. ఆ సమయంలో నారదుడైన అక్కినేని పరిగెత్తుకొని రావాలి. మండోదరి పాత్ర పోషిస్తున్న జమున కూడా పరిగెత్తుకుని రావాలి.

ఎండ మండిపోతోంది.

అప్పటికే జమున షూటింగ్‌కి ఆలస్యంగా వస్తున్నదని అక్కినేనికి అభ్యంతరం ఉంది. కాలు మీద కాలు వేసుకుని కూచుంటున్నదని ఎన్.టి.ఆర్‌కు అసౌకర్యం ఉంది. జమునకు ఇవన్నీ తెలియవు. ఆ ఎండలో ఇంకా రాని జమున కోసం ఎదురు చూస్తూ అక్కినేని, ఎన్.టి.ఆర్ ఒక నిర్ణయం తీసుకున్నారు. మరునాడు ఇండస్ట్రీ అంతా ఆ నిర్ణయం విని హాహాకారాలు చేసింది. అచ్చొచ్చోలు విడిచింది. ఇక మీదట ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు జమునతో నటించబోవడం లేదు. బాయ్‌కాట్ ట్రెండ్ ఇటీవల మొదలైంది. కాని తెలుగులో బాయ్‌కాట్ చూసిన తొలి హీరోయిన్ జమున.

•••

ఊ... అంటావా మావా ఉహూ అంటావా మావా. కొత్త పాట. విశేషం ఏముంది?

ఊ అను ఉఊ అను ఔనను ఔనవునను... జమున పాట. ఏనాడో జమున ఉఊ అంది. ఔనవునని అనలేకపోయింది. పెద్ద హీరోలు బాయ్‌కాట్ చేస్తే ఏంటి? తానొక నటి. తనకు సామర్థ్యం ఉంది. తను పని చేయగలదు. ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు లేకపోతే ఇక హీరోలే లేరా? అయినా తెర మీద జమున ఉంటే ఇక ఆవిడే ఒక హీరో లెక్క.

1959, 60, 61... దాదాపు మూడేళ్ల పాటు అక్కినేని, ఎన్.టి.ఆర్ జమునతో పని చేయలేదు. జమున ఆగిందా... ఆగలేదు. హిందీకి వెళ్లింది. జూబ్లీ హీరో రాజేంద్ర కుమార్‌తో 'హమ్‌రాహీ' చేసి హిట్ కొట్టింది. అందులో 'ముజ్ కో అప్ నే గలే లగాలో' పాటకు ముబారక్ బేగం, 'మన్‌రే తూహీ బతా క్యా గావూ' పాటకు లతా మంగేష్కర్ జమునకు ప్లేబ్యాక్ ఇచ్చారు. 'మూగ మనసులు' హిందీ రీమేక్ మిలన్‌లో అదే గౌరి పాత్రను వేసి ఫిల్మ్‌ఫేర్ అవార్డు సాధించింది. 'బేటి బేటె' సినిమాలో సునీల్ దత్‌కు హీరోయిన్‌గా చేసింది. తెలుగులో జగ్గయ్య, జె.వి.రమణమూర్తి, కృష్ణ, శ్రీధర్, హరనాథ్ వీరితో పని చేసింది. ఈలోపు జమున లాంటి గ్లామర్ స్టార్ లేక కొన్ని సినిమాలు ఏ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్‌లవి వెలవెలబోయాయి. ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు లేక జమున పెద్ద సినిమాలు చేయలేకపోయింది. ఇరు పక్షాలా నష్టం. ఈ నష్టాన్ని నివారించి అందరినీ కలిపి 'గుండమ్మ కథ' తీయాలని చక్రపాణి నిశ్చయం.

•••

'సార్. క్షమాపణలు వద్దు ఏమొద్దు. వాళ్లనూ కూచోబెట్టండి. నన్నూ కూచోబెట్టండి. కావాలంటే నన్ను నాలుగు చివాట్లు పెట్టండి. ఏదో తెలియని రోజుల్లో తెలియని ప్రవర్తన. ఇక మీదట జాగ్రత్తగా ఉంటాను' అంది జమున, చక్రపాణితో.

'ఏమయ్యా రామారావు, నాగేశ్వరరావూ. ఈ బాయ్‌కాట్ వల్ల భవిష్యత్తు తరాలకు మీరో తప్పు మార్గం చూపిస్తున్నారు. ఇలా వద్దు. అంతా కలిసి పని చేయండి. నా గుండమ్మ ఇప్పటికే ఆలస్యమై ఏడుస్తోంది' అన్నాడు చక్రపాణి.

సమస్య సద్దుమణిగింది. జమున గెలవక పోయి ఉండవచ్చు. కాని ఓడలేదు.

•••

గుంటూరు జిల్లాలో పక్కపక్క ఊళ్ల నుంచి ఇద్దరు హీరోయిన్లు వచ్చారు. సావిత్రి, జమున.



కృష్ణా జిల్లాలో పక్క పక్క ఊళ్ల నుంచి ఇద్దరు హీరోలు వచ్చారు. అక్కినేని, ఎన్.టి.ఆర్.

ఈ నలుగురు తెలుగు సినిమాలకు 'స్వర్ణచతుష్టయం'. ఆ స్వర్ణ చతుష్టయం నటించి సూపర్‌హిట్ కొట్టిన సినిమా గుండమ్మ కథ.

•••

జమున తండ్రి నిప్పాణి శ్రీనివాసరావు మధ్వ బ్రాహ్మణులు. కన్నడిగులు. జమున తల్లి కౌసల్యా దేవి వైశ్యులు. తెలుగు. వ్యాపారం నిమిత్తం శ్రీనివాసరావు హంపిలో ఉండగా పెద్ద కూతురుగా జమున పుట్టింది. ఆమెకు ఆరేడేళ్లు ఉండగా శ్రీనివాసరావు పసుపు, పొగాకు వ్యాపారానికి వీలుగా ఉంటుందని కాపురాన్ని 'దుగ్గిరాల'కు మార్చాడు. అలా దుగ్గిరాల జమునకు రెండో జన్మస్థలం అయ్యింది. జమున తల్లికి హరికథలు చెప్పడం వచ్చు. ఆమె కచ్చేరీల్లో మధ్య మధ్య చిన్నారి జమునను స్టేజీ ఎక్కించి పాట పాడించేది. దుగ్గిరాలలో చదువుతూ స్కూల్లో కూడా జమున ఆడేది, పాడేది. నాటకాల వాళ్లు విని బాలనటిగా బతిమిలాడి తీసుకెళ్లేవారు. 'ఢిల్లీ చలో', 'మా భూమి', 'ఖిల్జీ రాజ్య పతనం'... వీటిలో జమున బాలనటి. మండూరులో 'ఖిల్జీ రాజ్యపతనం' నాటకం వేయాలని ఒక తెలుగు మాస్టారు వచ్చి జమునను తీసుకెళ్లాడు. రైలు దిగి పొలాల మీద నడుస్తూ మండూరు చేరుకోవాల్సి ఉంటే జమున నడవలేక మారాము చేసింది. పాపం... ఆ తెలుగు మాస్టారు జమునను ఎత్తుకొని అంతదూరమూ నడిచి వెళ్లాడు. ఇది జరిగిన కొన్నాళ్లకు ఒక సినిమాలో జమున–

అనురాగము విరిసేనా ఓ రేరాజా
అనుతాపము తీరేనా...

అనే పాటకు అభినయించింది. ఆ రోజు ఆమెను భుజాల మీద ఎత్తుకుని నడిచిన తెలుగు మాస్టారు ఆ పాటలో పడక్కుర్చీలో కూచుని ఆస్వాదిస్తుంటాడు. అతని పేరు జగ్గయ్య.

•••

గరికపాటి రాజారావు నటించి, నిర్మించి, దర్శకత్వం వహించిన 'పుట్టిల్లు' జమున మొదటి సినిమా. షావుకారు జానకి, కృష్ణకుమారి, జమున... వీరు మాత్రమే స్ట్రయిట్‌గా హీరోయిన్ వేషాలతో చిత్ర ప్రవేశం చేశారు. మిగిలిన వారు చిన్న పాత్రలు వేసి, ఎదిగి, హీరోయిన్‌లు అయ్యారు. 16 ఏళ్ల వయసులో జమున 'పుట్టిల్లు'లో చాలా మెచ్యూరిటీ ప్రదర్శించాల్సిన పాత్రను పోషించింది. కాని గరికపాటి, జమునల జంటను ప్రేక్షకులు మెచ్చలేదు. 'పతియే ప్రత్యక్షదైవమే' థీమ్‌తో సినిమాలు వస్తున్న ఆ రోజుల్లో 'పుట్టిల్లు' సినిమా వ్యసనపరుడైన భర్తను నిరాకరించి తనకు తాను నిలబడే భార్య పాత్రను చూపించేసరికి జనం హడలెత్తి తెరను చింపేస్తామన్నారు. మూడ్రోజుల్లో బాక్సులు తిరిగొచ్చేసరికి క్లయిమాక్స్ మార్చి తీసి మళ్లీ అతికించినా ఫలితం రాలేదు. ఆ తర్వాత జమున నటించిన రెండు మూడు సినిమాలు ఆడలేదు. వెనక్కు వెళ్లిపోదామనుకుంటూ ఉండగా 'మిస్సమ్మ' సినిమాలో మెరిసి నిలబడింది. ఆ సినిమా నాటికే స్టార్లుగా మారిన అక్కినేని, ఎన్.టి.ఆర్, సావిత్రిల సరసకు అతి త్వరగా చేరింది. అయితే ప్రతి నటికి ఒక సిగ్నేచర్ కేరెక్టర్ దొరకాలి. అలాంటి కేరెక్టర్ జమునకు దొరికింది. ఆ పాత్రే సత్యభామ.

•••

సత్యభామ పాత్రంటే తెలుగు నాటకాల్లో పాపులర్. స్థానం నరసింహారావు ఆ పాత్రను పోషిస్తూ పాత్ర ఆంగిక, అభినయ, ఆహార్యాలను స్థిరపరిచేశాడు. ప్రేక్షకులు ఎవరైనా ఆయనతో పోల్చి వెండితెర సత్యభామను అంచనా కడతారు. జమున సత్యభామ పాత్రను మొదట తెలిసీ తెలియని వయసులో 'వినాయక చవితి' చిత్రంలో పోషించింది. అసలైన సత్యభామగా ఎన్.టి.ఆర్‌తో 'శ్రీ కృష్ణ తులాభారం'లో నటించింది. స్థానం నాటకాల్లో పాపులర్ చేసిన 'మీరజాల గలడా నా యానతి' పాటను అంతకు దీటుగా అభినయించింది. పెంకితనం, మొండితనం, స్వాతిశయం వీటితో పాటు తెలియని అమాయకత్వాన్ని సత్యభామకు జోడించడంతో జమున సత్యభామ అయ్యింది. సత్యభామ జమున అయ్యింది. కృష్ణుడి వేషంలో ఉన్నా ఎన్.టి.ఆర్ అంతటి వాడి కిరీటాన్ని కాలితో తన్నాలి. జమున ధైర్యంగా తన్న గలిగింది. అలాంటి షాట్ చేశాక సీనియర్ ఆర్టిస్ట్‌కు 'సారీ' చెప్పాలన్న పరిణితి అప్పటికే ఆమెకు వచ్చేసింది. 'సారీ సార్' అని ఎన్.టి.ఆర్‌తో అంటే 'ఇట్స్ ఆల్‌రైట్... యాక్టింగే కదా' అని ఆయన ఈజీగా తీసుకున్నారు. తెలుగువారికి కృష్ణుడు ఎన్.టి.ఆర్. సత్యభామ జమునే.

•••

తెలుగువారి తొలి గ్లామర్ స్టార్ కాంచనమాల. తర్వాతి గ్లామర్ స్టార్ జమున. భానుమతి, సావిత్రి, అంజలి... వీరంతా పెర్‌ఫార్మర్లు. వీరి పక్కన అందరూ సరిపోరు. కాని ఎవరి పక్కనైనా అందంగా సరిపోయే స్టార్‌గా జమున తెలుగు సినిమా పరిశ్రమలో దాదాపు 25 ఏళ్లు ఏలింది. హరనాథ్‌తో 'లేత మనసులు' పెద్ద హిట్ సాధించింది. అందులోని 'హలో మేడమ్ సత్యభామా', 'అందాల ఓ చిలుకా అందుకో నా లేఖ' పాటల్లో జమున జాంపండులా ఉందని ప్రేక్షకులు మురిసిపోయారు. ఒక సీనియర్ హీరోయిన్ అయి ఉండి, పెద్ద స్టార్ అయి ఉండి చలంతో 'మట్టిలో మాణిక్యాలు' హిట్ కొట్టింది జమున. అందులో 'నా మాటే నీ మాటై చదవాలి' పాట అతి మధురం. ముచ్చటం. ఫీల్డ్‌కు వచ్చిన కొత్తల్లో జమునను 'హంపీ సుందరి' అని, 'ఆంధ్రా నర్గిస్' అని పిలిచేవారు. చిత్రంగా నర్గిస్‌కు చిరఖ్యాతి తెచ్చి పెట్టిన 'మదర్ ఇండియా'ను జమునే తెలుగులో చేసింది. ఆ సినిమా పేరు 'బంగారు తల్లి'.

•••

సినిమా వాళ్లు సినిమా వాళ్లనే చేసుకుంటున్న రోజుల్లో ఆ ఆనవాయితీని తప్పించి లెక్చరర్‌ను వివాహం చేసుకుంది జమున. కొడుకు పుడితే అక్కినేని భార్య అన్నపూర్ణ వచ్చి 'సిజేరియన్ అటగదా. ఇన్నాళ్లూ నువ్వొక్కదానివే సన్నగా ఉన్నావనుకున్నాను. ఇకపై లావెక్కిపోతావు' అని నిట్టూర్చి వెళ్లింది. కాని జమున మారలేదు. కొడుకు పుట్టిన తర్వాత కూడా పదేళ్ల పాటు హీరోయిన్‌గా కొనసాగింది. సగటు ప్రేక్షకుడి డ్రీమ్ గర్ల్‌గానే ఉంది. ఒక ఔత్సాహికుడికి జీవితంలో ఒక సారైనా జమున పక్కన నటించి ఆమెతో ఒక డ్యూయెట్ పాడాలని కోరిక. అందుకోసం ఆ ఔత్సాహికుడు భారీ డబ్బు ఖర్చు పెట్టి, పెద్ద తారాగణంతో సినిమా తీశాడు. జమునకు వారితో వీరితో రికమండేషన్ చేయించి తన పక్కన నటించేలా ఒప్పించాడు. ఆమె ఆకర్షణ అలా ఉండేది. అన్నట్టు ఆ సినిమా పేరు 'బొబ్బిలి యుద్ధం'. ఆ ఔత్సాహికుడు సీతారామ్.

మురిపించే అందాలే
అవి నన్నే చెందాలే...

•••

'మిస్సమ్మ', 'చిరంజీవులు', 'సతీ అనసూయ', 'గులే బకావళి కథ', 'మంగమ్మ శపథం', 'రాముడు భీముడు', 'మూగనోము'.... జమున హిట్లు ఎన్నో ఉన్నాయి. 'మూగ మనసులు' స్క్రిప్ట్ మొత్తం తయారయ్యాక సావిత్రి విని ఇందులో గౌరి పాత్ర నేను వేస్తాను... రాధ పాత్రను జమునకు ఇవ్వండి. గౌరి పాత్ర చాలా బాగుంది' అన్నదట. 'గౌరిగా నువ్వు బాగోవు. అది జమునకే కరెక్ట్' అని అక్కినేని సర్దిచెప్పారట. 'మూగ మనసులు' సినిమాలో జమున విశ్వరూపం చూపింది. గోదారి గట్టు మీద తన పాద ముద్రలను శాశ్వతంగా విడిచింది. రాయీ రప్పా కాని మామూలు మనుషులను కదిలించింది. కొత్త తరం వచ్చాక తన ప్రాభవాన్ని కాపాడుకుంటూ పక్కకు తప్పుకుంది జమున. చిల్లర మల్లర క్యారెక్టర్లు వేయలేదు. ఆమె వేసే క్యారెక్టర్ 'పండంటి కాపురం'లో రాణి మాలినీ దేవిలా ఉండాలి. అంత పవర్‌ఫుల్‌గా ఉండాలి. ఉంది. పండంటి కాపురం సూపర్ హిట్ కావడంలో జమున పాత్ర ఒక ముఖ్య కారణం.

•••

జమున తాను రిటైర్ పోయినా ఏదో ఒక కార్యక్రమంలో పాల్గొంటూ ప్రేక్షకులకు దగ్గరగానే ఉంది. చివరి నిమిషం వరకూ గ్లామర్‌తోనే కనిపించింది. తెల్లజుట్టు జమునను ఎవరూ చూడలేదు. ఉత్సాహం లేని జమునను ఎవరూ చూడలేదు. స్వాతిశయం తప్పిన జమునను ఎవరూ చూడలేదు. సినిమా రంగంలో ఎన్నో ప్రతికూలతలు దాటి, ఎదురు నిలిచి, తన స్థానాన్ని పొందింది జమున.

ఆమె రాకతో ఒక వెన్నెల వచ్చింది.

ఆమె వీడ్కోలుతో ఆ వెన్నెల జ్ఞాపకాల్లోనే మిగిలింది.

పగలే వెన్నెల... జగమే ఊయల
కదలే ఊహలకే కన్నులుంటే...




'గులేబకావళి కథ'లో ఎన్టీఆర్‌తో...



'ఇల్లరికం'లో అక్కినేనితో...



'గుండమ్మ కథ'లో అక్కినేని, ఎన్టీఆర్‌తో...



'హమ్‌రాహి'లో రాజేంద్రకుమార్‌తో...

జమున హిట్ సాంగ్స్‌లో కొన్ని..



1. గౌరమ్మా నీ మొగుడెవరమ్మా... (మూగ మనసులు)
2. నీ మది చల్లగా స్వామీ నిదురపో... (ధనమా దైవమా)
3. ఎవరికి తెలియదులే ఇంతుల సంగతి... (దొరికితే దొంగలు)
4. అంతగా నను చూడకు.. ఇంతగా గురి చూడకు... (మంచి మనిషి)
5. ఈ వేళ నాలో ఎందుకో ఆశలు... (మూగనోము)
6. తెలిసిందిలే తెలిసిందిలే నెలరాజ నీ గుట్టు తెలిసిందిలే... (రాముడు భీముడు)
7. మళ్లీ మళ్లీ పాడాలి ఈ పాట... (మట్టిలో మాణిక్యం)
8. వసంత గాలికి వలపులు రేగ... (శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు కథ)
9. నన్ను దోచుకొందువటే... (గులేబకావళి కథ)
10. బులి బులి ఎర్రని బుగ్గల దానా... (శ్రీమంతుడు)
11. మనసా కవ్వించకే నన్నిలా... (పండంటి కాపురం)
12. రివ్వున సాగే రెపరెపలాడే... (మంగమ్మ శపథం)
13. పచ్చని చెట్టు ఒకటి వెచ్చని చిలుకలు రెండు .. (రాము)
14. బృందావనమది అందరిదీ గోవిందుడు అందరివాడేలే... (మిస్సమ్మ)
15. ప్రేమ యాత్రలకు బృందావనమూ నందనవనమూ ఏలనో.. (గుండమ్మ కథ)
16. నువ్వూ నేనూ నడిచేది ఒకే బాట... ఒకే మాట (డబ్బుకు లోకం దాసోహం)











అలనాటి తార జమున కన్నుమూత

తెలుగువారి సత్యభామగా ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన జమున (86) ఇకలేరు. వయోభారం, అనారోగ్య కారణాలతో హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని తన స్వగృహంలో శుక్రవారం ఉదయం 7.30 ని॥లకు తుదిశ్వాస విడిచారామె. అమెరికాలో ఉంటున్న కుమారుడు వంశీకృష్ణ హైదరాబాద్ చేరడానికి ఆలస్యం కావడంతో కుమార్తె స్రవంతి తల్లికి అంత్యక్రియలు నిర్వహించారు.



● సత్యసాయిబాబాతో జమున దంపతులు

నిప్పాణి శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు 1936 ఆగస్ట్ 30న హంపిలో జన్మించారు జమున. తండ్రికి గుంటూరులో పొగాకు, పసుపు వ్యాపారాలుండేవి. శ్రీనివాసరావు వ్యాపార రీత్యా జమున బాల్యమంతా గుంటూరు జిల్లాలోని దుగ్గిరాలలో గడిచింది. చక్కని సంగీత విద్వాంసురాలు అయిన కౌసల్యాదేవి జమునకి శాస్త్రీయ సంగీతం, హార్మోనియంలలో శిక్షణ ఇప్పించారు. దుగ్గిరాల గ్రామస్తులు వేసిన 'ఛలో ఢిల్లీ' నాటకంలో తొలిసారి వసుంధర అనే పాత్ర వేశారు జమున. ఆ తర్వాత 'మా భూమి, ఖిల్జీ రాజ్యపతనం..' ఇలా పలు నాటకాలు వేశారు జమున. దుగ్గిరాలకు చెందిన శ్రీమన్నారాయణమూర్తి అనే నటుడు జమున గురించి నిర్మాత బీవీ రామానందంకు ('వరూధిని' సినిమా తీశారు) చెప్పారు. దీంతో ఆయన నిర్మిస్తున్న తర్వాతి చిత్రం 'జై వీర భేతాళ'(1952 మార్చిలో స్టార్ట్ అయింది) అనే సినిమాలో హీరోయిన్‌గా జమునకు అవకాశం ఇచ్చారు. ఈ చిత్రంలో గుమ్మడి హీరోగా ఎంపికయ్యారు. అయితే ఆ సినిమా ఎందుకో ఆగిపోయింది. ఆ తర్వాత గరికపాటి రాజారావు దర్శకత్వం వహించిన 'పుట్టిల్లు' (1953) సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారు జమున. ఆ తర్వాత ఎన్టీఆర్, ఏఎన్ఆర్, జగ్గయ్య వంటి అగ్రహీరోల సరసన కథానాయికగా నటించారు. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళంతో పాటు పలు హిందీ సినిమాల్లో నటించి భేష్ అనిపించుకున్నారామె.

దాదాపు 200 సినిమాల్లో ఎన్నో పాత్రల్లో జమున నటించినా బాగా పేరు తెచ్చినవాటిలో సత్యభామ పాత్రని ప్రముఖంగా చెప్పుకోవాలి. ఆ పాత్రలో ఆమెను తప్ప ఎవర్నీ ఊహించుకోలేం అన్నట్టుగా జీవించారు జమున. 'సంతోషం, మిస్సమ్మ, చిరంజీవులు, తెనాలి రామకృష్ణుడు, దొంగరాముడు, బంగారు పాప, వద్దంటే డబ్బు, చింతామణి, భూకైలాస్, భాగ్యరేఖ, గుండమ్మకథ' వంటి పలు హిట్ చిత్రాల్లో నటించారు జమున. 'తెలుగు ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారామె.

లెక్చరర్‌తో పెళ్లి...

హీరోయిన్లు సినిమా ఇండస్ట్రీలోని వారిని కాకుండా ఇతర రంగంలోని వారిని వివాహం చేసుకోవడం నటి పద్మినీతో ఆరంభమైంది. అలా వివాహం చేసుకున్న రెండో హీరోయిన్ జమున. దూరపు బంధువైన రమణారావుతో 1965లో జమున వివాహం తిరుపతిలో జరిగింది. రమణారావు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ, జువాలజీ లెక్చరర్‌గా చేసేవారు. డాక్టరేట్ అందుకున్న తర్వాత ఉస్మానియా విశ్వ విద్యాలయానికి బదిలీ అయ్యారాయన.. దీంతో కాపురాన్ని హైదరాబాద్‌కి మార్చారు. జమున కూడా మద్రాసు (చెన్నై) నుంచి హైదరాబాద్‌కి వచ్చేశారు. 1976లో బంజారా హిల్స్‌లో సొంత ఇల్లు కట్టుకుని స్థిరపడ్డారామె. రమణారావు–జమునలకు వంశీకృష్ణ, స్రవంతి సంతానం. తొలి సంతానం వంశీకృష్ణ పుట్టిన తర్వాత కూడా పదేళ్లపాటు హీరోయిన్‌గా బిజీగానే కొనసాగారు జమున. వంశీకృష్ణ శాన్‌ఫ్రాన్సిస్కో విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. బర్కిలీలోని స్టెయిన్డ్ గ్లాస్ గార్డెన్‌లో గ్లాస్ పెయింటింగ్‌లో శిక్షణ పొంది, అదే రంగంలో స్రవంతి స్థిరపడ్డారు. స్రవంతిని హీరోయిన్ చేయాలనుకున్నారు జమున. అయితే ఇండస్ట్రీలో వచ్చిన మార్పులతో ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారామె. కాగా ఓ నవల ఆధారంగా సినిమా తీయాలని, దానికి తనే దర్శకత్వం వహించాలని సంకల్పించారు జమున. నాలుగు పాటలు రికార్డు చేసిన తర్వాత ఈ సినిమా ఆగిపోయింది. అయితే దర్శకత్వంపై తనకున్న మమకారంతో 'డాక్టర్ మమత' అనే సీరియల్‌ని తెరకెక్కించారామె. దూరదర్శన్‌లో 15 ఎపిసోడ్స్‌గా ఆ సీరియల్ ప్రసారం అయింది కూడా!



● భర్త రమణారావుతో...



● రాజీవ్ గాంధీతో...

రాజకీయ రంగంలో...

1980లలో నాటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రోత్సాహంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు జమున. పార్టీ కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికై 1983లో ఆ పార్టీ తరపున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశారామె. తర్వాత రాజీవ్ గాంధీ సపోర్ట్‌తో 1989లో రాజమండ్రి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు జమున. ఆ తర్వాత వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొన్నాళ్ల చేసిన ఆమె ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి బయటికొచ్చేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వ్యవహార శైలి నచ్చి భారతీయ జనతా పార్టీలో చేరారు.. 1990వ దశకంలో ఆ పార్టీ తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ఆ తర్వాత 'రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య' అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రంలో పర్యటించి, పదివేల మంది కళాకారుల వివరాలు సేకరించారామె. అంతేకాదు.. 'రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య'కు 26 శాఖలు ఏర్పాటు చేశారు. నిరుపేద కళాకారులకు ఇళ్ల స్థలాలు, గృహ రుణాలు, పెన్షన్లు మంజూరు చేయించి పెద్ద మనసు చాటుకున్నారు జమున.

అవార్డులు...

1964లో విడుదలైన 'మూగమనసులు' (తెలుగు), 1968లో రిలీజైన 'మిలన్' (హిందీ) చిత్రాలకు ఉత్తమ సహాయ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, 2008లో 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారం' అందుకున్నారామె. అలాగే 2021 సంవత్సరానికిగాను 'సాక్షి' మీడియా గ్రూప్ ఎక్స్‌లెన్స్ అవార్డుల్లో భాగంగా 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు జమున. దాదాపు ఏడు దశాబ్దాల కెరీర్‌లో అద్వితీయమైన పాత్రలు చేసిన జమునకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే'పద్మ' పురస్కారం వరించలేదు. అయినా అవార్డులకు అతీతంగా 'సత్యభామ'గా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్రవేసిన ఈ అద్భుత నటి చరిత్ర ఎప్పటికీ నిలిచి పోతుంది.



● శంకర్ దయాళ్‌శర్మతో...



పేరు మారిందిలా...

జమున పేరు వెనక ఓ విశేషం ఉంది. ఆమె తల్లిదండ్రులు తీర్థయాత్రలు చేస్తూ, పండరీపురంలోని పాండురంగని దర్శనం చేసుకున్న తర్వాతే కౌసల్య కడుపులో పడ్డారట జమున. ఈ కారణం చేత 'జనాబాయి' అని పేరు పెట్టుకోవాలనుకున్నారు జమున తల్లిదండ్రులు. కానీ జన్మరాశి ప్రకారం ఏదైనా నది పేరు రావాలని పెద్దలు చెప్పడంతో 'జ'కి 'న'కు మధ్యలో 'ము' అక్షరాన్ని చేర్చి 'జనాబాయి' పేరును 'జమున'గా మార్చారు. ఉత్తరాదిలో 'యమున' నదిని 'జమున' అంటారు. 'ఇంత నాజూకైన పేరు పెట్టి సినిమారంగం కోసం మళ్లీ పేరు మార్చుకునే అవసరం లేకుండా చేసిన మా అమ్మను నిజంగా అభినందించాల్సిందే' అని పలు సందర్భాల్లో జమున గుర్తుచేసుకుని హ్యాపీ ఫీలయ్యేవారు.

పొగరుబోతు అనే పేరు ఎందుకు?

ఇండస్ట్రీలో మరింత మెరుగ్గా రాణించే క్రమంలో మద్రాస్‌కు మకాం మార్చారు జమున కుటుంబ సభ్యులు. అయితే ఓ సినిమాలో జమునకు అవకాశం ఇస్తామన్నట్లుగా ఆమె తండ్రి శ్రీనివాసరావును కొందరు అజ్ఞాతవ్యక్తులు కారులో తీసుకుని వెళ్లారు. కొంతదూరం ప్రయాణించిన తర్వాత వారిపై ఆయనకు అనుమానం రావడంతో సిగరెట్ల సాకుతో వారి నుంచి ఎలాగో తప్పించుకున్నారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న తన కుటుంబసభ్యులకు ఏమైనా ఆపద కలిగిందా? అని చాలా కంగారుపడ్డారట జమున తండ్రి. ఈ ఘటన తర్వాత తాను ఇంట్లో లేనప్పుడు ఇంటికి ఎవరొచ్చినా తలుపు తెరవొద్దని, అవసరమైతే కిటికీలోనుంచి చూసి, తెలిసిన వారైతేనే తలుపు తీయమని, ముఖ్యంగా తెలియనివారైతే తాను ఇంట్లో ఉన్నప్పుడే రమ్మని చెప్పాలన్నట్లుగా కుటుంబసభ్యులకు చెప్పారట శ్రీనివాసరావు. దీంతో తండ్రి చెప్పినట్లే చేశారట జమున. ఈ కారణంగా కొందరు దర్శక-నిర్మాతలు జమున ఇంటి వరకు వచ్చి.. ఆమెను కలవకుండానే వెళ్లిపోవాల్సి వచ్చేది. అయితే అసలు విషయం తెలియని కొందరు దర్శక-నిర్మాతలు 'జమున చాలా పొగరుబోతు.. ఇంట్లోకి కూడా రానివ్వదు' అని చెప్పుకునేవారట.



● పుట్టిల్లులో..



● తూంగాదే తంబిలో కమల్ హాసన్‌తో...

తమిళ్‌తో అనుబంధం

కథానాయికగా జమున తెలుగు సినిమా ద్వారా పరిచయమైనప్పటికీ తమిళ సినిమాకూ ఎనలేని సేవలు అందించారు. దివంగత మహానటులు ఎంజీఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ వంటి వారితో జమున నటించి ఆకట్టుకున్నారు. 'పణం పడత్తుం పాడు' (1954) చిత్రంతో కోలీవుడ్‌కి పరిచయం అయ్యారు జమున. 'మిస్సియమ్మ (మిస్సమ్మ), తెనాలి రామన్, తంగమలై రహస్యం, తిరుట్టు రామన్, నాళయ తీర్పు వంటి పలు విజయవంతమైన చిత్రాలు జమున ఖాతాలో ఉన్నాయి. ఇక క్యారెక్టర్ నటిగా 'తూంగాదే తంబి తూంగాదే' చిత్రంలో కమలహాసన్‌కు తల్లిగా నటించారామె. అప్పట్లో తమిళ పరిశ్రమలో హీరోలకు సమానంగా పారితోషకం పొందిన సావిత్రి తర్వాత ఆ స్థాయిలో అందుకున్న నటి జమున కావడం విశేషం.



సావిత్రితో ప్రత్యేక అనుబంధం

'మిస్సమ్మ', 'దొంగరాముడు', 'అప్పుచేసి పప్పుకూడు', 'గుండమ్మకథ' వంటి చిత్రాల్లో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్న సావిత్రి, జమునల మధ్య మంచి అనుబంధం ఉంది. అక్కాచెల్లెళ్లుగా అన్ని విషయాలను అరమరికలు లేకుండా చర్చించుకునేవారు. అయితే కొందరు వ్యక్తులు కావాలని వీరిద్దరి మధ్యలో తగవులు పెట్టడంతో ఏడాది పాటు సావిత్రి, జమున మాట్లాడుకోలేదు. ఆ తర్వాత అసలు విషయం గ్రహించి మునుపటిలానే ఉండసాగారు. ఈ విషయాన్ని జమున ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అంతేకాదు.. తన కొడుకు బారసాల వేడుకకు సావిత్రి వచ్చారని, ఆ సమయంలో ఆమె (సావిత్రి) జీవితం సజావుగా సాగనందుకు చాలా బాధపడి ఏడ్చారని, అప్పుడు తానే సావిత్రిని ఓదార్చినట్లుగా కూడా జమున ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. అలాగే ఒకానొక స్థితిలో సావిత్రి పరిస్థితిని చూసి తనకు చాలా బాధకలిగిందని కూడా జమున పేర్కొన్నారు.

నటన–డైరెక్షన్–మ్యూజిక్: జమున!

చిన్నతనం నుంచే జమునకు కళల పట్ల మక్కువ ఎక్కువ. అందుకే తొమ్మిదేళ్ల వచ్చేలోపే నాటకాల్లో నటించారు. ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో తిరునగరి రామాంజనేయులు, బుర్రకథ పితామహుడు నాజర్ తదితరుల నాయకత్వంలో 'మా భూమి', 'ముందడుగు' 'ఢిల్లీ', 'ఛలో', 'విందు' వంటి నాటకాల్లో నటించారు జమున. ముఖ్యంగా 'మా భూమి' నాటికలోని జమున నటనకు మంచి మార్కులు పడ్డాయి. మరో విశేషం ఏంటంటే... 'విందు' అనే నాటికలో యశోదగా నటించడమే కాదు.. ఆ నాటికకు దర్శకత్వం వహించడంతో పాటు, మ్యూజిక్‌ను కూడా కంపోజ్ చేశారట జమున. ఇలా నటనలో ఎదగడానికి సరిపడా ఓనమాలు నేర్చుకున్నది నాటక రంగం నుంచేనని చెబుతారు జమున. ఆ తర్వాత 'ఖిల్జీ రాజ్యపతనం' నాటకంతో జమున పేరు మరింత ప్రాచుర్యంలోకి వచ్చి, తొలి సినిమా 'పుట్టిల్లు'లో అవకాశం వచ్చేలా చేసింది.

ఎస్వీరంగారావు సలహా

సినిమా ఇండస్ట్రీలో బాగా రాణిస్తున్న సమయంలో ఓ హీరోను పెళ్లి చేసుకోవాలనుకున్నారట జమున. కానీ ఓ సందర్భంలో అప్పటి సీనియర్ నటులు ఎస్వీ రంగారావు జీవితం గురించి కొన్ని విషయాలు చెప్పి, అన్నీ ఆలోచించుకుని ముందడుగు వేయాలన్నట్లుగా హితబోధ చేశారట. దీంతో అప్పటి ఆ హీరోతో వివాహాన్ని వద్దనుకున్నారట జమున. ఆ తర్వాత రమణారావును పెళ్లి చేసుకున్నారు జమున.

తల్లి స్ఫూర్తితో...

ఇండస్ట్రీలో జమున చాలా ధైర్యంగా, ఆత్మాభిమానంతో ఉండేవారు. ఈ లక్షణాలతో పాటుగా ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవడం వంటి వాటిని తన తల్లి కౌసల్యాదేవి నుంచే అలవరచుకున్నారట జమున. విశేషం ఏంటంటే.. జమున తల్లి స్వాతంత్య్రోద్యమంలో పాల్గొని రెండు రోజులు జైల్లోనే ఉన్నారట.



కూతురే కుమారుడై...

2014 నవంబరు 10న జమున భర్త రమణారావు గుండెపోటుతో మృతి చెందారు. అప్పటినుంచి కుమార్తె స్రవంతి దగ్గరే ఉంటున్నారు జమున. తల్లికి అన్నీ తానయ్యారు స్రవంతి. శుక్రవారం ఉదయం జమున మరణించగా, మధ్యాహ్నం ఆమె పార్థివ దేహాన్ని ఫిలిం చాంబర్‌లో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆ సాయంత్రం 4.30 గంటలకు ఫిలిం చాంబర్ నుంచి జమున అంతిమ యాత్ర మహాప్రస్థానానికి చేరింది. అమెరికాలో ఉంటున్న కుమారుడు వంశీకృష్ణ నేడు (శనివారం) హైదరాబాద్ చేరుకుంటారు. దాంతో అన్నీ తానై అశ్రునయనాల మధ్య తల్లికి స్రవంతి అంత్యక్రియలు నిర్వహించారు. సినీ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ఆర్‌కే రోజాతోపాటు పలువురు పాల్గొని అశ్రునివాళులు అర్పించారు.

నటి జమునతో తన అనుబంధాన్ని 'సాక్షి'తో నటి కాంచన ప్రత్యేకంగా పంచుకున్నారు.

నన్ను ఏడిపించేశావ్ కాంచీ అన్నారు

- కాంచన

● వారానికి మూడు నాలుగు సార్లు జమున అక్క, నేను మాట్లాడుకునేవాళ్లం. అయితే ఈ నెల నాకు తీరిక లేకపోవడం, అక్క కూడా ఫోన్ చేయకపోవడంతో మాట్లాడుకోలేదు. మామూలుగా ఫోన్ చేసి, అప్పటి సినిమాల గురించి మాట్లాడుకుంటుంటాం. 'భోజనం చేశావా.. వంట ఏంటి?'.. ఇవన్నీ కూడా చెప్పుకునేవాళ్లం.

● జమున అక్క నా సీనియర్. నేను కాలేజీ డేస్ నుంచే సీనియర్లతో జూనియర్లు మాట్లాడకూడదా అనుకునేదాన్ని. ఆ ఫీలింగ్‌తో సీనియర్లతో కూడా బాగా మాట్లాడేదాన్ని. సినిమాల్లోకి వచ్చాక కూడా అంతే. పైగా మేం చిన్నవాళ్లం అనే ఫీలింగ్ ఏమీ పెట్టుకోకుండా జమునక్క, సావిత్రక్క బాగా మాట్లాడేవారు.

● ఇక దసరా వచ్చిందంటే చాలు... బొమ్మల కొలువు సందడి ఉండేది. ఒకరింటికి ఒకరు వెళ్లడం.. సుండల్ (శెనగలు) తినడం... అంతా బాగుండేది. పైగా జమున అక్క భలే డ్రెస్ చేసుకునేవారు. ఆవిడకు బాగా రెడీ అవ్వడం అంటే ఇష్టం. నా డ్రెస్సింగ్ డిఫరెంట్‌గా ఉండేది. సింపుల్‌గా రెడీ అయ్యేదాన్ని. బాగున్నావని మెచ్చుకునేవారు.



● అట్లతద్దిని అయితే ఎప్పటికీ మరచిపోలేను. అప్పట్లో అందరం మదరాసు (చెన్నై)లో ఉండేవాళ్లం కదా. అట్లతద్ది నాడు ఒకళ్లు అట్లు వేసేవాళ్లం. ఇంకొకరు చట్నీ చేసేవాళ్లం. ఇంకొకరు పులుసు.. జమున అక్క, నేను అందరం మెరీనా బీచ్‌కి వెళ్లిపోయేవాళ్లం. అక్కడ ఉయ్యాల కుదరదు కదా. పరుగు పందేలు పెట్టుకుని, చాలా హ్యాపీగా గడిపేవాళ్లం.

● ఆ మధ్య ఒకసారి జమున అక్క ఫోన్ చేసి, 'నన్ను ఇవాళ బాగా ఏడిపించేశావ్..' అంటే, నాకేం అర్థం కాలేదు. 'నేనేం ఏడిపించాను అక్కా...' అంటే... నువ్వు యాక్ట్ చేసిన 'కల్యాణ మంటపం' సినిమా చూశాను. 'ఎంత బ్రహ్మాండంగా యాక్ట్ చేశావ్. ఎమోషనల్ సీన్స్‌లో ఏడిపించావ్' అంటే నాకు పట్టరానంత ఆనందం కలిగింది.

● జమునక్క యాక్ట్ చేసినవాటిలో నాకు 'మూగ మనసులు' చాలా ఇష్టం. ఇక 'మిస్సమ్మ'లో 'బృందావనమది అందరిదీ..' పాటకి ఎంతో నాజూకుగా డ్యాన్స్ చేసింది. మనకు ఏమీ తెలియనప్పుడు టీచర్ చెప్పింది చెప్పినట్లు చేస్తాం... ఆ సినిమాలో డ్యాన్స్ నేర్చుకునే స్టూడెంట్‌గా టీచర్ చెప్పింది చెప్పినట్లు చేసే క్యారెక్టర్‌ని అక్క అద్భుతంగా చేసింది.

● మేం కలిసి నాటకాలు కూడా వేసేవాళ్లం. ముఖ్యంగా 'శ్రీకృష్ణ తులాభారం' నాటకం చాలాసార్లు వేశాం. అందరూ ఆడవాళ్లే నటించాలన్నది అక్క ఆశ. అలానే ఆడవాళ్లందరం కలిసి నటించాం. సినిమాలో కృష్ణుడిగా ఎన్టీఆర్ నటించారు. నాటకంలో ఆ పాత్ర నాది. సత్యభామగా జమున అక్క నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. అలాంటిది కృష్ణుడిగా నా నటనను మెచ్చుకునేది.

● మేమంతా సత్య సాయిబాబా భక్తులం. జీవితం అనేది పోరాటం. ఈ పోరాటంలో గెలిచి నిలబడటం చాలా కష్టమైన విషయం. జమున అక్క నిలబడింది. ఈ గెలుపు కన్నా కూడా బతికున్నంతవరకూ పోరాటం చేసే మనిషి పోయేటప్పుడు ప్రశాంతంగా పోవడమనేది ముఖ్యం. ఆ ప్రశాంతత అక్కకు దక్కింది. 'దేవుడా.. ఆస్పత్రిపాలు కాకుండా ప్రశాంతంగా తీసుకెళ్లు' అని కోరుకుంటాం. ఆ సత్య సాయిబాబా ఆశీస్సులతో అక్క ఎలాంటి ఇబ్బంది పడకుండా వెళ్లిపోయింది. ఆ జీవుడు చివరి నిమిషంలో ఎలాంటి బాధ పడకుండా నిష్క్రమించింది. ప్రశాంతమైన మనిషికి ప్రశాంతమైన నిష్క్రమణ దక్కింది. ఇది కదా కావాల్సింది (గద్గద కంఠంతో..)

గాయం చేసిన లేత మనసులు...

'లేత మనసులు' సినిమా తమిళ వెర్షన్ చేస్తుండగా జరిగిన ఓ ప్రమాదం వల్ల జమున మెడ బాగా దెబ్బతింది. 'అందాల ఓ చిలుకా..' పాట తమిళంలో తీస్తున్నారు. హీరో గడ్డిమేట మీద నుంచి జారుకుంటూ వచ్చి జమున పక్కన చేరాలి. అయితే కొత్తవాడైన ఆ చిత్ర హీరో జయశంకర్.. సీనియర్ హీరోయిన్ జమునతో చేస్తున్నాననే కంగారుతో అడ్డదిడ్డంగా వచ్చి జమున తలపై పడ్డారు.. దీంతో ఆమె మెడ విరిగినంత పనయింది. షూటింగ్ నిలిచిపోయింది. సున్నితమైన మెడ నరాలు దెబ్బతినడంతో కొన్నాళ్లు చికిత్స తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొన్నారు జమున. అయితే కొన్నేళ్ల తర్వాత ఆ సమస్య మళ్లీ మొదటికొచ్చింది.. దీంతో ఆమె మెడ ఎక్కువగా ఊగిపోయేది. 'రాజపుత్ర రహస్యం' సినిమాలో ఈ ఇబ్బంది ఆమెలో బాగా కనిపించేది. ఎన్ని చికిత్సలు తీసుకున్నా తల ఊగడం తగ్గలేదు. 1978లో విడుదలైన 'శ్రీ రామ పట్టాభిషేకం' తర్వాత సినిమాల నుంచి గౌరవంగా తప్పుకున్నారు జమున. ఆ తర్వాత 'బంగారు కొడుకు'(1982), 'జల్సా రాయుడు'(1983), 'రాజకీయ చదరంగం'(1989) వంటి చిత్రాల్లో ముఖ్యమైన పాత్రలు చేశారు. కాగా ఆమె నటించిన చివరి చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు' 2021 జనవరి 29న విడుదలైంది.

ప్రముఖుల నివాళి











● జమునకు నివాళులర్పిస్తున్న లక్ష్మీ పార్వతి, సుబ్బ రామిరెడ్డి, డి.సురేష్‌బాబు, ఆది శేషగిరిరావు, కరాటే కల్యాణి, అల్లు అరవింద్, మురళీమోహన్

జమున మృతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తం చేశారు. 70ఏళ్ల నట జీవితంలో ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించిన ఆమె చిరస్మరణీయంగా నిలిచి పోతారన్నారు. జమున కుటుంబ సభ్యులకు గవర్నర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారని రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

* * *

తెలుగు చలన చిత్ర పరిశ్రమ మొదటి తరం నటీమణుల్లో అగ్ర నాయికగా వెలుగొందిన సీనియర్ నటి జమున తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనియాడారు. ఆమె మృతి తెలుగు చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టుగా ట్విట్టర్ ద్వారా సీఎం వైఎస్ జగన్ తన సంతాపాన్ని తెలియజేశారు.

* * *

నటి జమున మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. జమున మరణం సినీ పరిశ్రమకు తీరని లోటని సీఎం కేసీఆర్ అన్నారు. తొలి తరం నటిగా వందలాది చిత్రాల్లో నటించి, తెలుగువారి అభిమాన తారగా వెలుగొందిన జమున జ్ఞాపకాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడంలోనే కాకుండా హిందీ సినిమాల్లోనూ నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన జమున, నటిగా కళా సేవనే కాకుండా పార్లమెంటు సభ్యురాలిగా ప్రజాసేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా జమున కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

* * *

సీనియర్ హీరోయిన్ జమునగారు స్వర్గస్తులయ్యారనే వార్త విచారకరం. ఆవిడ బహుభాషా నటి. మాతృభాష కన్నడం అయినా ఎన్నో విజయవంతమైన చిత్రాలతో తెలుగువారి మనసుల్లో చెరగని ముద్రవేశారు. మహానటి సావిత్రిగారితో జమునగారి అనుబంధం ఎంతో గొప్పది. ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను.

- చిరంజీవి

* * *

అల్లరి పిల్లగా, ఉక్రోషంతో ఊగిపోయే మరదలిగా, ఉత్తమ ఇల్లాలిగా, అన్నిటికీ మించి తెలుగు వారి సత్యభామగా మనల్ని ఎంతో మెప్పించారు జమునగారు. చిన్ననాటి నుంచే నాటకాల అనుభవం ఉండటంతో నటనకే ఆభరణంగా మారారామె. కేవలం దక్షిణాది సినిమాలకే పరిమితం కాకుండా ఆ రోజుల్లోనే హిందీ సినిమాల్లోనూ నటించి ఔరా అనిపించి అందరి ప్రశంసలు పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి జమునగారు.

- బాలకృష్ణ

* * *

జమునగారు మహానటి. ఆవిడతో కలిసి నేను ఆర్టిస్ట్‌గా పని చేశాను. ఆ మహానటి మరణం నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది. నాకు సన్నిహితురాలు. మేం కలిసినప్పుడు ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా మాట్లాడేవారు. ఆవిడ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.

- మంచు మోహన్‌బాబు

* * *

భారతీయ సినీ పరిశ్రమకు జమునగారి మరణం తీరని లోటు. సినిమా ఇండస్ట్రీలో ఆమె ఒక మహానటి. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీగణేశన్.. వంటి ఎంతోమంది మహానటులతో నటించి మెప్పించారామె. అన్ని భాషల్లో ఆమె ఒక సూపర్ స్టార్. కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని పోరాడారు. జమునగారికి కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డు ప్రకటించాలని కోరుతున్నాను.

- ఆర్. నారాయణమూర్తి

* * *

జమునగారు దివంగతులు కావడం బాధాకరం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అలనాటి తరానికి ప్రతినిధిగా ఉన్నారామె. వెండితెరపై విభిన్న పాత్రలు పోషించిన జమునగారు తెలుగు ప్రేక్షకులకు సత్యభామగానే గుర్తుండిపోయారు. ఆ పౌరాణిక పాత్రకు జీవం పోశారామె. ఠీవి, గడుసు పాత్రల్లోనే కాకుండా అమాయకత్వం ఉట్టిపడే పాత్రల్లోనూ ప్రేక్షకుల మెప్పు పొందారు. ప్రజా జీవితంలో లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించారు.

- పవన్ కల్యాణ్

* * *

జమునగారి మరణవార్త విని తీవ్రంగా కలత చెందాను. సినీ పరిశ్రమకు ఆమె చేసిన సేవలు, పోషించిన వైవిధ్యమైన పాత్రలతో ఎప్పటికీ గుర్తుండిపోతారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

- మహేశ్‌బాబు

* * *

దాదాపు 30 సంవత్సరాలు తెలుగు సినిమా ఇండస్ట్రీలో మహారాణిగా కొనసాగారు జమునగారు. 'గుండమ్మకథ', 'మిస్సమ్మ'లాంటి ఎన్నో మరపురాని చిత్రాలు, మరెన్నో వైవిధ్యమైన పాత్రలతో మా మనసుల్లో చెరపలేని ముద్ర వేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి. **- ఎన్టీఆర్**

* * *

జమునగారి మరణవార్త విని నా హృదయం ముక్కలైంది. క్లాసికల్ తెలుగు సినిమాకు ఆమె సేవలు మరువలేనివి. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నాను.

- అల్లు అర్జున్

* * *

జమునగారు లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నాను. కొంతకాలంగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 'మూగమనసులు' సినిమాలో ఆమె నటన అద్భుతం. సినిమాలతోపాటుగా రాజకీయాల్లోనూ ముందున్నారామె. జమునగారి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరిగి ఉంటే బాగుండేది. **- అలీ**

సాక్షి బిజినెస్
శనివారం
28-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	874	59,307
నిఫ్టీ ▽	287	17,604

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,617	▲	105
డోజోన్స్	33,949	▲	205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,765	▲	04
డాక్స్	15,150	▲	17
షాంఘై	3,265	▲	25
నికాయ్	26,397	▲	20

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	57,189
బంగారం (99.5 స్వచ్ఛత)	56,960
వెండి (కిలో)	68,192

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		80.85	82.52
£	బ్రిటన్ పౌండ్		87.51	90.58
€	యూరో		99.03	102.34
¥	జపాన్ ఎన్ (100)		61.61	63.63
AU$	ఆస్ట్రేలియా డాలర్		56.87	59.30
S$	సింగపూర్ డాలర్		60.99	63.00
SAR	సౌదీ రియాల్		20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్		21.32	23.11
¥	చైనా యువాన్		10.90	12.98

వేదాంత లాభం క్షీణత

- క్యూ3లో రూ. 2,464 కోట్లు
- షేరుకి రూ. 12.5 డివిడెండ్



న్యూఢిల్లీ: మెటల్, మైనింగ్ దిగ్గజం వేదాంత లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 41 శాతం క్షీణించి రూ. 2,464 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 4,164 కోట్లు ఆర్జించింది. పెరిగిన ముడివ్యయాలు, విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలను ప్రభావితం చేశాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 12.5 చొప్పున నాలుగో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. అల్యూమినియం, కాపర్, ఆయిల్‌గ్యాస్ కార్యకాలాపాల కోసం 91 మెగావాట్ల హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్, 600 మెగావాట్ల సౌర విద్యుత్‌ను పొందేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ తెలిపింది.

ఆదాయం అప్

ప్రస్తుత సమీక్షా కాలంలో వేదాంతా మొత్తం ఆదాయం రూ. 34,674 కోట్ల నుంచి రూ. 34,818 కోట్లకు స్వల్పంగా బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 26,777 కోట్ల నుంచి 31,327 కోట్లకు భారీగా ఎగశాయి. 2022 జూలైలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విండ్‌ఫాల్ ట్యాక్స్ కారణంగా రూ. 333 కోట్ల ప్రభావం పడినట్లు కంపెనీ వెల్లడించింది. జింక్ ఇంటర్నేషనల్ ఆస్తులను రూ. 2,981 కోట్ల విలువలో హిందుస్తాన్ జింక్‌కు విక్రయించనున్నట్లు పేర్కొంది. క్యూ3లో తరుగుదల, అమార్టైజేషన్ పద్దు 4 శాతం పెరిగి రూ. 2,720 కోట్లుగా నమోదైంది. 2022 డిసెంబర్ 31కల్లా స్థూల రుణభారం రూ. 61,550 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం నష్టంతో రూ. 320 వద్ద ముగిసింది.

టాటా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన దిగ్గజం టాటా మోటార్స్ కంబషన్ ఇంజిన్ ఆధారిత మోడళ్ల ధరలను 1.2% మేర పెంచుతోంది. ఫిబ్రవరి 1 నుండి ఈ నిర్ణయం అమలులోకి రానున్నట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. నూతన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా వాహనాల మార్పులు, ముడిసరుకు వ్యయాలు పెరగడంతో ధరలను సవరిస్తున్నట్టు టాటా మోటార్స్ వెల్లడించింది.

ఒక్క రోజులోనే సెటిల్‌మెంట్

- టీప్లస్1లోకి మొత్తం ఈక్విటీ స్టాక్స్
- రీట్, ఇన్విట్, గోల్డ్ బాండ్లు సైతం



న్యూఢిల్లీ: దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త మైలురాయిని అందుకున్నాయి. శుక్రవారం(27న) నుంచి మొత్తం ఈక్విటీ విభాగంలో లావాదేవీలను ఒక్క రోజులోనే సెటిల్ చేసే ప్రక్రియకు తెరతీశాయి. దీంతో మార్కెట్లో నమోదయ్యే లావాదేవీలను మరుసటి రోజులోనే క్లియర్ చేస్తారు. అంటే షేరు లేదా నగదు బదిలీని పూర్తి చేస్తారు. ఈక్విటీ విభాగంలోని సెక్యూరిటీలలో ఈ నెల 27 నుంచి ట్రేడ్‌ప్లస్(టీప్లస్)1 సెటిల్‌మెంట్‌ను అమలు చేస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా పేర్కొంది. తద్వారా దేశీ మార్కెట్లు సరికొత్త రికార్డును సృష్టించాయి. ఇప్పటివరకూ టీప్లస్2 సెటిల్‌మెంట్ అమల్లో ఉంది. అంటే లావాదేవీ జరిగిన రెండు రోజుల్లో క్లియరింగ్‌ను చేపడుతున్నారు. టీప్లస్1 సెటిల్‌మెంట్ వల్ల ఇన్వెస్టర్ల పెట్టుబడి సామర్థ్యాలు మెరుగుపడటంతోపాటు.. మొత్తం పరిశ్రమలో రిస్కులు తగ్గేందుకు వీలు చిక్కనుంది.

2021లోనే పునాది: నిజానికి టీప్లస్1 సెటిల్‌మెంట్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ 2021 సెప్టెంబర్ 7న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2022 జనవరి 1 నుంచి ప్రవేశపెట్టేందుకు ఎక్స్ఛేంజీలను అనుమతించింది. ట్రేడింగ్ సభ్యులు, కస్టోడియన్లు తదితర మార్కెట్ మౌలిక సంస్థలు దశలవారీగా టీప్లస్1 అమలుకు తెరతీశాయి. 2022 ఫిబ్రవరి 25న కొత్త సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. 2023 జనవరి 27కల్లా ఈక్విటీ విభాగంలోని అన్ని సెక్యూరిటీలనూ ఒక్క రోజు సెటిల్‌మెంట్‌లోకి తీసుకువచ్చాయి. వీటిలో ఎస్ఎంఈ షేర్లు సహా ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు), రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్(రీట్‌లు), సావరిన్ గోల్డ్ బాండ్లు(ఎస్‌జీబీలు), ప్రభుత్వ సెక్యూరిటీలు, కార్పొరేట్ బాండ్లు చేరాయి. పలు అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఇప్పటికీ టీప్లస్2 సెటిల్‌మెంటును అమలు చేస్తుండటం గమనార్హం!

టీప్లస్2 సెటిల్‌మెంట్‌కు ఫండ్స్

ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలు) ఫిబ్రవరి 1 నుంచి టీప్లస్2 విధానానికి మారిపోనున్నాయి. ప్రస్తుతం ఇవి టీప్లస్3 సెటిల్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ పథకం యూనిట్లను విక్రయించిన రోజు కాకుండా తర్వాతి మూడో పనిదినం రోజున బ్యాంకు ఖాతాకు నిధులు జమ అవుతున్నాయి. టీప్లస్2 విధానంలో విక్రయించిన రోజు కాకుండా, తర్వాతి రెండో పనిదినం (మార్కెట్లకు, బ్యాంకులకు) రోజున ఇన్వెస్టర్ల చేతికి నిధులు అందుబాటులోకి వస్తాయి. ఈ నెల 25 వరకు ఈక్విటీ మార్కెట్లలో టీప్లస్ 2 విధానం అమల్లో ఉంది. జనవరి 27 నుంచి టీప్లస్1 విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఫండ్స్ సంస్థలు కూడా ఒక రోజు ముందుకు సెటిల్‌మెంట్‌ను మార్చుకోనున్నాయి. ట్రేడ్ అయ్యే ఈక్విటీ షేర్లు, ఎస్ఎంఈ షేర్లు, ఈటీఎఫ్‌లు, రీట్స్, ఇన్విట్‌లు, సావరీన్ గోల్డ్ బాండ్లు, గవర్నమెంట్ బాండ్లు టీ ప్లస్ 1 సెటిల్‌మెంట్ పరిధిలోకి వచ్చేశాయి. ''ఈ ప్రయోజనాన్ని మా ఫండ్స్ ఇన్వెస్టర్లకు బదిలీ చేయాలనుకుంటున్నాం. కనుక ఈక్విటీ పథకాలకు టీప్లస్2 రిడెంప్షన్ (ఉపసంహరణ) చెల్లింపుల సైకిల్‌ను అమలు చేయనున్నాం''అని యాంఫీ చైర్మన్, ఎ.బాలసుబ్రమణియన్ తెలిపారు.

3 నెలల కనిష్టానికి సూచీలు

- మార్కెట్‌పై అదానీ గ్రూప్ షేర్ల అమ్మకాల ఒత్తిడి
- ప్రీ బడ్జెట్, వారాంతాపు అప్రమత్తత
- సెన్సెక్స్ 874 పాయింట్లు క్రాష్
- 287 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో విక్రయాల వెల్లువ



ముంబై: స్టాక్ మార్కెట్లో రెండోరోజూ అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. అదానీ గ్రూప్ సంస్థలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ నివేదిక మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. టీప్లస్1 సెటిల్‌మెంట్ ట్రేడింగ్ విధానం శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. వచ్చేవారం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం కూడా జరగనుంది. ఈ పరిణామాణాలకు తోడు వారాంతపు రోజు కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. బాండ్లపై రాబడుల పెరుగుదల, క్రూడాయిల్ ధరల ఒడిదుడుకులు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. బ్యాంకింగ్, మెటల్, ఫైనాన్స్ రంగ షేర్ల భారీ పతనంతో సెన్సెక్స్ 874 పాయింట్లు నష్టపోయి 59,307 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 287 పాయింట్లు క్షీణించి 17,604 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది మూడు నెలల కనిష్ట ముగింపు. అదానీ గ్రూప్ సంస్థలకు భారీగా రుణాలిచ్చాయన్న హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండుశాతం, మిడ్‌క్యాప్ సూచీ 1.30% నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.5,978 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.4,252 కోట్ల షేర్లను కొన్నారు. మార్కెట్లు ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 81.49 వద్ద నిలిచింది.

ఇంట్రాడేలో రెండు శాతం క్రాష్

అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ..., రిపబ్లిక్ డే సెలవు రోజు తర్వాత దేశీయ మార్కెట్ నష్టంతో మొదలైంది. సెన్సెక్స్ 38 పాయింట్ల నష్టంతో 60,167 వద్ద, నిఫ్టీ 15 పాయింట్ల పతనంతో 17,877 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆ తర్వాత అమ్మకాల వెల్లువతో ఒక దశలో సెన్సెక్స్ 1,231 పాయింట్లకు పైగా నష్టపోయి 58,975 దగ్గర, నిఫ్టీ 398 పాయింట్లు క్షీణించి 17,494 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ఎఫ్ఎంసీజీ, ఫార్మా, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి.

రెండు రోజుల్లో రూ.10.65 లక్షల కోట్ల నష్టం

గత రెండురోజుల్లో సెన్సెక్స్ 1,648 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో 10.65 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.269 లక్షల కోట్లకు దిగివచ్చింది. నిఫ్టీ సైతం 514 పాయింట్లు క్షీణించింది.

అదానీ గ్రూప్ షేర్లపై అమ్మకాల ఒత్తిడి

హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఇచ్చిన వివరణ, ఇన్వెస్టర్లలో నమ్మకం కలిగించలేకపోయింది. ఈ గ్రూప్‌నకు చెందిన మొత్తం ఏడు కంపెనీల్లో అదానీ టోటల్ గ్యాస్, అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ 20% లోయర్ సర్క్యూట్, అదానీ విల్మార్, అదానీ పవర్ షేర్లు ఐదుశాతం లోయర్ సర్క్యూట్ వద్ద లాకయ్యాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ షేర్లు వరుసగా 18%, 16% చొప్పున నష్టపోయాయి. ఇటీవల అదానీ గ్రూప్ విలీనం చేసుకున్న అంబుజా సిమెంట్స్, ఏసీసీ సిమెంట్స్ కంపెనీల షేర్లు సైతం 17%, 13% చొప్పున నష్టపోయాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ నివేదిక నేపథ్యంలో గడిచిన రెండు రోజుల్లో అదానీ గ్రూప్ సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.4.17 లక్షల కోట్లు హరించుకుపోయింది.

ఎఫ్‌పీవోకు బిడ్స్

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పీవోకు తొలి రోజు(27న) రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 4.7 లక్షల బిడ్స్ దాఖలయ్యాయి. 4.55 కోట్ల షేర్లను ఆఫర్ చేసింది. ఆఫర్‌కు ధరల శ్రేణి రూ. 3,112–3,276కాగా.. గడువు ఈ నెల 31న(మంగళవారం) ముగియనుంది. బీఎస్ఈలో షేరు 19 శాతం పతనమై రూ. 2,762 వద్ద ముగిసింది. చిన్న ఇన్వెస్టర్లకు కేటాయించిన 2.29 కోట్ల షేర్లకుగాను 4 లక్షల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. క్విబ్ విభాగంలో 1.28 కోట్ల షేర్లు ఆఫర్ చేయగా.. 2,656 షేర్లకు, నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి 96.16 లక్షల షేర్లకుగాను 60,456 షేర్ల కోసం బిడ్స్ లభించాయి. బుధవారం యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 5,985 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే.

మిలియన్ యూనిట్ల తయారీ మైలురాయి దాటిన కేటీఎం



హైదరాబాద్: ప్రపంచంలో నెంబర్ 1 ప్రీమియం మోటార్ సైకిల్ బ్రాండ్ కేటీఎం భారతదేశంలో మిలియన్ యూనిట్ల తయారీ మైలురాయిని అధిగమించింది. పుణేలోని బజాజ్ చకన్ ప్లాంట్ నుండి 1 మిలియన్ కేటీఎం మోటార్ సైకిల్- కేటీఎం అడ్వెంచర్ 390 విడుదలైంది. రికార్డు బైక్ ఆవిష్కరణ కార్యక్రమంలో బజాజ్ ఆటో ఎండీ, సీఈఓ రాజీవ్ బజాజ్, పియరర్ మొబిలిటీ ఏజీ (కేటీఎం మాతృ సంస్థ) సీఈఓ స్టీఫన్ పీరర్ (ఫొటోలో ఎడమ నుంచి కుడికి) తదితరులు పాల్గొన్నారు. ఆస్ట్రియన్ బ్రాండ్ కేటీఎం తన సబ్–400 సీసీ మోటార్‌సైకిళ్ల దేశీయ, ఎగుమతి యూనిట్ల తయారీకి బజాజ్ ఆటోతో భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది. కేటీఎం ఇండియా 2014లో 1,00,000వ మోటార్‌సైకిల్‌ను, 2020లో 5,00,000వ మోటార్‌సైకిల్‌ను విడుదల చేసింది. కేవలం మరో మూడేళ్ల వ్యవధిలోనే కీలక మిలియన్ మైలురాయికి చేరుకోవడం గమనార్హం.

సాక్షి స్పోర్ట్స్



లక్ష్య సేన్ పరాజయం

ఇండోనేసియా మాస్టర్స్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. జకార్తాలో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్... మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో ఓడిపోయారు. ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–15, 10–21, 13–21తో మూడో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. 62 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌లో స్కోరు 15–15తో సమంగా ఉన్నపుడు వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే క్రిస్టీ పుంజుకొని వరుసగా రెండు గేముల్లో గెలిచి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అశ్విని–తనీషా 13–21, 18–21తో యూకీ ఫకుషిమా–సయాక హిరోటా (జపాన్) చేతిలో ఓడిపోయారు.

చరిత్రకు చేరువగా...

అండర్–19 టి20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్



పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): ఇప్పటి వరకు భారత మహిళల క్రికెట్ జట్టు ఏ ఫార్మాట్‌లోనైనా విశ్వవిజేతగా నిలువలేకపోయింది. వన్డే ప్రపంచకప్‌లో రెండుసార్లు రన్నరప్‌గా, టి20 ప్రపంచకప్‌లో ఒకసారి రన్నరప్‌గా నిలిచింది. అయితే సీనియర్లకు సాధ్యం కాని ఘనతను సాధించేందుకు భారత జూనియర్ మహిళల జట్టు విజయం దూరంలో నిలిచింది. తొలిసారి నిర్వహిస్తున్న అండర్–19 టి20 ప్రపంచ కప్‌లో భారత్ ఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 107 పరుగులు సాధించింది. భారత లెగ్ స్పిన్నర్ పార్శవి చోప్రా (3/20) కివీస్‌ను కట్టడి చేసింది. టిటాస్ సాధు, మన్నత్, షఫాలీ, అర్చన దేవి ఒక్కో వికెట్ తీశారు. అనంతరం భారత్ 14.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసి గెలిచింది. శ్వేత సెహ్రావత్ (45 బంతుల్లో 61 నాటౌట్; 10 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీ చేసింది. రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ మూడు పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో పోరుకు సిద్ధమైంది.

రన్నరప్‌తో 'గ్రాండ్' కెరీర్ ముగింపు

ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో సానియా–బోపన్న జోడీ ఓటమి



మెల్‌బోర్న్: తన గ్రాండ్‌స్లామ్ కెరీర్‌ను టైటిల్‌తో ముగించాలని ఆశించిన భారత మహిళా టెన్నిస్ స్టార్ సానియా మీర్జాకు నిరాశ ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సానియా మీర్జా–రోహన్ బోపన్న (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో సానియా–బోపన్న ద్వయం 6–7 (2/7), 2–6తో టాప్ సీడ్ లూసీ స్టెఫానీ–రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో ఓడిపోయింది. 87 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా–బోపన్న తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయారు. రన్నరప్ సానియా–బోపన్నలకు 89,450 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 51 లక్షల 97 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే టోర్నీ తర్వాత సానియా టెన్నిస్ నుంచి వీడ్కోలు తీసుకోనుంది.

> నా కంట వస్తున్న కన్నీళ్లు ఆనందభాష్పాలే. నేనింకా మరో రెండు టోర్నమెంట్‌లు ఆడతాను. 2005లో నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం మెల్‌బోర్న్‌లోనే మొదలైంది. ఇదే వేదికపై నా గ్రాండ్‌స్లామ్ కెరీర్ కూడా ముగుస్తున్నందుకు సంతోషంగా ఉంది. నాకు 14 ఏళ్లు ఉన్నపుడు బోపన్న నా తొలి మిక్స్‌డ్ డబుల్స్ భాగస్వామి. అతనితోనే నా గ్రాండ్‌స్లామ్ చివరి మ్యాచ్ ఆడాను. నా జీవితంలో మంచి మిత్రుడు అతడే. నా కుమారుడు చూస్తుండగా గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడతానని ఊహించలేదు. నిజంగా ఈ క్షణం నాకెంతో ప్రత్యేకం. – సానియా మీర్జా

6 సానియా కెరీర్‌లో సాధించిన మొత్తం గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్. ఇందులో మూడు మహిళల డబుల్స్‌లో (మార్టినా హింగిస్‌తో 2016 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2015 వింబుల్డన్, 2015 యూఎస్ ఓపెన్), మరో మూడు మిక్స్‌డ్ డబుల్స్‌లో (2009లో మహేశ్ భూపతితో ఆస్ట్రేలియన్ ఓపెన్, 2012లో మహేశ్ భూపతితో ఫ్రెంచ్ ఓపెన్, 2014లో బ్రెజిల్ ప్లేయర్ బ్రూనో సోరెస్‌తో యూఎస్ ఓపెన్) వచ్చాయి. మరో ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సానియా రన్నరప్‌గా నిలిచింది.



నేడు మహిళల సింగిల్స్ ఫైనల్
రిబాకినా X సబలెంకా
మధ్యాహ్నం గం. 2 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్ జోరుకు బ్రేక్

- తొలి గెలుపు రుచి చూసిన న్యూజిలాండ్
- టీమిండియాకు ఆల్‌రౌండ్ దెబ్బ
- మొదటి టి20 మ్యాచ్‌లో హార్దిక్ బృందం ఓటమి
- సుందర్ ఒంటరి పోరాటం
- రేపు లక్నోలో రెండో టి20


మిచెల్

రాంచీ: ధోని ఇలాకాలో న్యూజిలాండ్ గెలుపు పండగ చేసుకుంది. మొదటి టి20లో 21 పరుగులతో గెలిచిన కివీస్ భారత పర్యటనలో తొలి విజయాన్ని సాధించింది. 'ఆల్‌రౌండ్ షో'తో టీమిండియా జోరుకు బ్రేకులేసింది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డరైల్ మిచెల్ (30 బంతుల్లో 59 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్సర్లు), డెవాన్ కాన్వే (35 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు తీశాడు. తర్వాత భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులే చేసి ఓడిపోయింది. సుందర్ (28 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్సలు) భారత ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సూర్యకుమార్ యాదవ్ (34 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్సలు) రాణించాడు. కివీస్ బౌలర్లలో బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్, ఫెర్గూసన్ తలా 2 వికెట్లు తీశారు. రెండో టి20 రేపు లక్నోలో జరుగుతుంది.

మిచెల్ మెరుపులు

అలెన్ (23 బంతుల్లో 35; 4 ఫోర్లు, 2 సిక్సలు), చాప్‌మన్ (0)... ఇలా వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఉచ్చులో పడిన కివీస్‌ను కాన్వే ఆదుకున్నాడు. ఫిలిప్స్ (17; 1 ఫోర్)తో కలిసి జట్టు స్కోరును 100 దాటించాడు. 31 బంతుల్లో (7 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తిచేసుకున్న కాన్వేను అర్ష్‌దీప్ అవుట్ చేశాడు. ఆ తర్వాత మిచెల్ ఆఖరిదాకా ఉండి మెరిపించిన మెరుపులతో న్యూజిలాండ్ మంచి స్కోరు చేసింది. 26 బంతుల్లో (2 ఫోర్లు, 5 సిక్సర్లు) మిచెల్ అర్ధ సెంచరీ సాధించాడు. అర్ష్‌దీప్ వేసిన చివరి ఓవర్‌లో మిచెల్ ఏకంగా 27 పరుగులు (6 (నోబాల్), 6, 6, 4, 0, 2, 2) సాధించడం విశేషం.

చెత్త షాట్లతో...

కష్టసాధ్యమైన లక్ష్యం ముందుంటే భారత టాపార్డర్ నిర్లక్ష్యంగా వికెట్లను పారేసుకుంది. ఇషాన్ కిషన్ (4), త్రిపాఠి (0), గిల్ (7) చెత్త షాట్లతో అవుటవ్వడంతో జట్టు 15/3 స్కోరు వద్ద కష్టాల పాలైంది. ఈ దశలో 'టి20 సూపర్ బ్యాటర్' సూర్యకుమార్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (20 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) కాసేపు బాధ్యతగా ఆడటంతో ఆశలు రేగాయి. నాలుగో వికెట్‌కు 68 జతయ్యాక వరుస ఓవర్లలో సూర్య, పాండ్యా అవుట్ కావడంతో... అప్పటికింకా భారత్ 100 పరుగులైనా చేయకపోవడంతో ఓటమి ఖాయమైంది. అయితే సుందర్ (25 బంతుల్లో ఫిఫ్టీ; 5 ఫోర్లు, 3 సిక్సలు) మెరుపులతో భారత్ 150 మార్క్ దాటింది.



అతి'సుందర్' క్యాచ్

ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో వాషింగ్టన్ సుందర్ స్పిన్‌తో మాయ చేశాడు. క్యాచ్‌తో మంత్రముగ్ధం చేశాడు. రెండో బంతికి దంచేస్తున్న అలెన్‌ను సూర్య క్యాచ్‌తో పెవిలియన్ పంపాడు. ఆఖరి బంతికి చాప్‌మన్ డిఫెన్స్ ఆడే ప్రయత్నం చేశాడు. అక్కడే లేచిన బంతి నేలకు తాకుతుండగా... సుందర్ కుడివైపునకు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో రిటర్న్ క్యాచ్ పట్టాడు. దీంతో స్టేడియం హోరెత్తింది. బ్యాటింగ్‌లోనూ సుందర్ మెరుపు ఫిఫ్టీ సాధించాడు. కానీ అతని 'ఆల్‌రౌండ్ షో' భారత ఓటమితో చిన్నబోయింది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) సూర్య (బి) సుందర్ 35; కాన్వే (సి) హుడా (బి) అర్ష్‌దీప్ 52; చాప్‌మన్ (సి అండ్ బి) సుందర్ 0; ఫిలిప్స్ (సి) సూర్య (బి) కుల్దీప్ 17; మిచెల్ (నాటౌట్) 59; బ్రేస్‌వెల్ (రనౌట్) 1; సాన్‌ట్నర్ (సి) త్రిపాఠి (బి) మావి 7; ఇష్ సోధి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 176. వికెట్ల పతనం:** 1–43, 2–43, 3–103, 4–139, 5–140, 6–149. **బౌలింగ్:** పాండ్యా 3–0–33–0, అర్ష్‌దీప్ 4–0–51–1, సుందర్ 4–0–22–2, దీపక్ 2–0–14–0, ఉమ్రాన్ 1–0–16–0, కుల్దీప్ 4–0–20–1, శివమ్ మావి 2–0–19–1.

భారత్ ఇన్నింగ్స్: గిల్ (సి) అలెన్ (బి) సాన్‌ట్నర్ 7; ఇషాన్ (బి) బ్రేస్‌వెల్ 4; త్రిపాఠి (సి) కాన్వే (బి) డఫీ 0; సూర్య (సి) అలెన్ (బి) సోధి 47; పాండ్యా (సి అండ్ బి) బ్రేస్‌వెల్ 21; సుందర్ (సి) డఫీ (బి) ఫెర్గూసన్ 50; హుడా (స్టంప్డ్) కాన్వే (బి) సాన్‌ట్నర్ 10; మావి (రనౌట్) 2; కుల్దీప్ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 0; ఉమ్రాన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1–10, 2–11, 3–15, 4–83, 5–89, 6–111, 7– 115, 8–127, 9–151. **బౌలింగ్:** డఫీ 3–0– 27– 1, బ్రేస్‌వెల్ 4–0–31–2, సాన్‌ట్నర్ 4–1–11 –2, ఫెర్గూసన్ 4–1–33–2, సోధి 3–0–30–1, టిక్నర్ 2–0–23–0.

పదోసారి ఫైనల్లో జొకోవిచ్



మెల్‌బోర్న్: తన కెరీర్‌లో 22వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు, పదో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌కు సెర్బియా స్టార్ జొకోవిచ్ మరో విజయం దూరంలో ఉన్నాడు. శుక్రవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో నాలుగో సీడ్ జొకోవిచ్ 7–5, 6–1, 6–2తో అన్‌సీడెడ్ టామీ పాల్ (అమెరికా)పై గెలిచాడు. మరో సెమీఫైనల్లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 7–6 (7/2), 6–4, 6–7 (6/8), 6–3తో 18వ సీడ్ ఖచనోవ్ (రష్యా)పై నెగ్గి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్ చేరాడు. ఆదివారం జరిగే ఫైనల్లో సిట్సిపాస్‌తో జొకోవిచ్ తలపడతాడు. గతంలో తొమ్మిదిసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరిన జొకోవిచ్ తొమ్మిదిసార్లూ టైటిల్ సాధించాడు.

బెల్జియంతో జర్మనీ 'ఢీ'

భువనేశ్వర్: పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీలో బెల్జియం, జర్మనీ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో మాజీ విజేత జర్మనీ 4–3తో ఆస్ట్రేలియాను ఓడించగా... 'షూటౌట్'లో డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం 3–2తో నెదర్లాండ్స్‌పై గెలిచింది. ఆదివారం ఫైనల్ జరుగుతుంది.

ఆరో ఓటమితో అధోగతి!

'ప్లేట్' డివిజన్‌కు హైదరాబాద్


హైదరాబాద్ కెప్టెన్ తన్మయ్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పేలవ ప్రదర్శన చివరి మ్యాచ్ వరకూ కొనసాగింది. శుక్రవారం ముగిసిన ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో తన్మయ్ అగర్వాల్ సారథ్యంలోని హైదరాబాద్‌ను చిత్తుగా ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 90/5తో ఆఖరి రోజు ఆట కొనసాగించిన హైదరాబాద్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 124 పరుగులకే కుప్పకూలింది. అనంతరం 47 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ వికెట్ నష్టపోయి ఛేదించింది. దీంతో సీజన్‌లో ఆడిన 7 మ్యాచ్‌లలో వరుసగా ఆరో ఓటమితో హైదరాబాద్ ఒక పాయింట్‌తో చివరి స్థానంలో నిలిచి 'ప్లేట్' గ్రూప్‌నకు పడిపోయింది. గ్రూప్ 'బి'లో మహారాష్ట్ర, ముంబై మ్యాచ్ 'డ్రా' కావడంతో ఆంధ్ర జట్టు 26 పాయింట్లతో క్వార్టర్ ఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర తలపడుతుంది.


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం పి.నైనవరంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్


శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలోని నాగవంశంవీధిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఆప్యాయంగా ముద్దుపెడుతున్న వృద్ధురాలు

గడప గడపకు మన ప్రభుత్వం


ఒంగోలులో మహిళకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే బాలినేని. పక్కన ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, మేయర్ సుజాత


నంద్యాల జిల్లా జూపాడుబంగ్లాలోని కురువపేటలో దివ్యాంగురాలు పెద్దక్కకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

క్లుప్తంగా...

మిసెస్ ఇండియా పోటీలకు పైడి రజని

29 నుంచి రాజస్థాన్‌లో గ్రాండ్ ఫినాలే


మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ టైటిల్‌తో పైడి రజని

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): రాజస్థాన్ రాష్ట్రం సిటీ ఆఫ్ టైగ్రెసెస్ రంతంపోర్ ప్రాంతంలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్, ఏవీఎన్ కళాశాల ఇంగ్లిష్ విభాగాధిపతి, శక్తి ఎం పవరింగ్ ఉమెన్ అసోసియేషన్(సేవ) అధ్యక్షురాలు పైడి రజని ఎంపికయ్యారు. గతేడాది మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను ఈమె గెలుచుకున్నారు. ఆలిండియా డైరెక్టర్ దీపాలి ఫడ్నిస్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యం, ప్రాంతీయ నృత్యం, ప్రాంతీయ వంటకాలు, శాస్త్రీయ వేషధారణ, దేశంపై సామాజిక అవగాహన, సేవా కార్యక్రమాల నిర్వహణపై నాలుగు రోజుల పాటు జరగనున్న పోటీల్లో దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొననున్నారు.

దేవదాయ శాఖలో ఉద్యోగినులపై వేధింపుల నివారణకు కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ హరిజవహర్‌లాల్

సాక్షి, అమరావతి: దేవదాయశాఖలో మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నిరోధానికి ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేవదాయశాఖలోని అన్ని క్యాడర్ల మహిళా ఉద్యోగులు తమ ఫిర్యాదులను నేరుగా ఆ కమిటీకి తెలియజేయవచ్చు. ఆ ఫిర్యాదులపై కమిటీ ఎప్పటికప్పుడు విచారించి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ ఏర్పాటు గురించి అన్ని జిల్లాల దేవదాయశాఖ అధికారులు, ఆలయాల ఈవోలు తప్పనిసరిగా మహిళా ఉద్యోగులకు తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు.

30, 31 తేదీల్లో 'సిటిజన్ ఔట్ రీచ్'

- సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో భేటీ
- ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

సాక్షి, అమరావతి: ప్రభుత్వం ఈ నెల 30, 31 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా సిటిజన్ ఔట్ రీచ్ (ప్రజల వద్దకు ఉద్యోగులు వెళ్లి కలవడం) కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి సచివాలయాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ఇప్పటి వరకు వివిధ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందనే వివరాలు కూడా మరోసారి తెలియజేస్తారు. అదేవిధంగా రాష్ట్రంలో మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, మహిళలకు నేరుగా లబ్ధిని చేకూర్చే సంక్షేమ పథకాల గురించి వివరించడం ఈ విడత సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమంలో ప్రాధాన్యత అంశమని అధికారులు వెల్లడించారు. సచివాలయాల వారీగా సిటిజన్ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆదేశాలు జారీచేసింది.

ఆ చేపలు ఎగురుతాయి



సముద్ర జలాల్లో అరుదైన ఫ్లయింగ్ ఫిష్‌లు

- గంటకు 56 కిలోమీటర్ల వేగంతో టేకాఫ్
- ఇప్పటివరకు ఫ్లయింగ్ ఫిష్ గ్లైడింగ్ రికార్డు 400 మీటర్లు
- కరేబియన్ దీవుల్లో వాణిజ్యపరంగా కీలకంగా మారిన చేపలు
- ఇటీవల మాల్దీవులు, చెన్నై తీరాల్లోనూ సందడి

ఈ చేపలు నీటిలో ఈదటమే కాదు.. గాలిలో ఎగురుతాయి కూడా. వీటికి ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే.. ఇవి రాత్రి పూట సముద్రం ఒడ్డుకు వచ్చి నిద్రపోతాయి. అట్లాంటిక్, పసిఫిక్ సముద్ర జలాల్లో కనిపించే ఈ జీవులు ఇటీవల భారత జలాల్లోనూ దర్శనమిస్తున్నాయి. ఈ చేపల కళ్లు నీటి అడుగు ప్రాంతాలను చూడటంతోపాటు గాలిలోనూ స్పష్టంగా చూడగలిగేలా మారిపోయాయట. ఈ చేపల విశేషాలేంటో మనమూ ఓ లుక్కేద్దాం.

సాక్షి, అమరావతి: నీటిలో ఈదే చేపలు గాల్లో ఎగురుతున్నాయి. నీటి అడుగున గంటకు 56 కిలోమీటర్ల టేకాఫ్ స్పీడ్‌తో పైకి దూసుకెళ్తున్నాయి. ఉష్ణ మండల సముద్ర జలాల్లో ఎక్కువగా కనిపించే 'ఫ్లయింగ్ ఫిష్'లు చేపల్లోనే అరుదైన జాతులుగా గుర్తింపు పొందాయి. ప్రపంచంలో దాదాపు 40 రకాల ఎగిరే చేపలు ఉన్నాయి. ఈ సముద్ర చేపల కుటుంబాన్ని ఎక్సోకోటిడే అని పిలుస్తారు. లాటిన్ భాషలో ఎక్స్ అంటే 'బయట' అని 'కొయిటోస్' అంటే మంచం అని అంటారు. ఇవి రాత్రి పూట సముద్రపు ఒడ్డుకు వచ్చి నిద్రపోతాయి కాబట్టే వీటిని లాటిన్‌లో అలా పిలుస్తారట.

రెండు.. నాలుగు రెక్కలతో..

సాధారణ చేపలు నీటి నుంచి ఎగిరి దూకుతుంటాయి. వాటి దూరం కూడా మహా అయితే అడుగు వరకే ఉంటుంది. కానీ.. ఫ్లయింగ్ ఫిష్ శరీరానికి ఇరువైపులా పొడవాటి, వెడల్పాటి పెక్టోరల్ రెక్కలు ఉంటాయి. ఇందులో 'టూ వింగర్స్' అనే చేపకు రెండు పెద్ద పెక్టోరల్ రెక్కలు ఉంటాయి. 'ఫోర్ వింగర్స్'గా పిలిచే చేపలకు రెండు పొడవాటి పెక్టోరల్ రెక్కలతో పాటు రెండు పెల్విక్ (చిన్న) రెక్కలు ఉంటాయి. వీటి సాయంతోనే ఇవి గాల్లో సులభంగా ఎగరగలుగుతుంది. వీటి వెన్నుపూస నిర్మాణం చూస్తే పడవ చుక్కానిలా కనిపిస్తుంది. ఇవి పక్షుల స్థాయిలో ఎగరలేవు కానీ.. దాదాపు 200 మీటర్ల వరకు ఎగరగలవు. పక్షులు రెక్కలు పైకీ, కిందకి ఆడించినట్టు ఇవి రెక్కలను ఊపలేవు. నీటినుంచి పైకి వచ్చిన వేగాన్ని బట్టి వాటి రెక్కలను విచ్చుకుని మాత్రమే కొంత దూరం ఎగురుతాయి.

పెద్ద చేపల నుంచి తప్పించుకునేందుకే..

ఈ అసాధారణ చేపలు 6 నుంచి 20 అంగుళాలు పొడవు ఉంటాయి. రెండు అంగుళాల పొడవు ఉన్నప్పుడే ఎగరడం ప్రారంభిస్తాయి. డాల్ఫిన్లు, వేగంగా ఈదే ఇతర పెద్ద చేపలకు ఆహారం కాకుండా తప్పించుకోవడానికి ఇవి ఎగిరే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటి కళ్లు నీటి అడుగున మాత్రమే కాకుండా గాలిలో కూడా స్పష్టంగా చూడగలిగేలా మార్పు చెందాయి. ఇవి చిన్నచిన్న చేపలను, పాచిని తీని జీవిస్తాయి. ఇవి సెకనుకు దాదాపు మీటరు వేగంతో ఉపరితలం వైపు ఈదుతాయి.

చెన్నయ్ తీరంలోనూ సందడి

ఇవి ఉష్ణమండల, సమశీతోష్ణ సముద్ర జాతులకు చెందిన చేపలు. అట్లాంటిక్, పసిఫిక్ సముద్ర తీరాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఇటీవల వీటి గమనం బంగాళాఖాతంలోనూ కనిపిస్తోంది. భారత్, బంగ్లాదేశ్, జపాన్, వియత్నాం, ఇండోనేషియా, తైవాన్, చైనా, వెనిజులా, బార్బడోస్ జలాల్లో ఎగిరే చేపలు ఉన్నాయి. మాల్దీవులు, చెన్నయ్ తీరాల్లోనూ ఇవి తరచూ కనిపిస్తున్నాయి.

400 మీటర్లు ఎగిరి..

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం ఓ ఫ్లయింగ్ ఫిష్ 30 కిలోమీటర్ల వేగంతో 45 సెకన్ల పాటు గాల్లో ఎగిరింది. ఇది 2008లో జపాన్‌లోని కగోషిమాలో ఫెర్రీలో ప్రయాణిస్తున్న ఓ చిత్ర బృందం కెమెరాకు చిక్కింది. ఇది దాదాపు 1,312 అడుగుల మేర ఎగిరినట్టుగా నమోదైంది. సాధారణంగా ఫ్లయింగ్ ఫిష్‌లు 655 అడుగుల వరకు, నీటి ఉపరితలం నుంచి 26 అడుగుల ఎత్తు వరకు ఎగురుతాయి. నీటిలోకి తిరిగి దూకినప్పుడు కూడా వేగంగా ఈత కొట్టడం ప్రారంభిస్తాయి. ఇవి అలసి పోకుండా వరుసగా 12 సార్లు గాల్లో ఎగరగలవు.



పట్టిన వెంటనే తినేయాలట

కరేబియన్ ద్వీప దేశాలైన బార్బడోస్, ట్రినిడాడ్, టొబాగోలకు ఈ చేపలే వాణిజ్య పరంగా కీలకంగా ఉన్నాయి. స్థానిక మత్స్యకారులు వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఫ్లయింగ్ ఫిష్ మాంసం గట్టిగా లేత, తెలుపు రంగులో ఉంటుంది. దీనిని కాల్చి, వేయించి, ఆవిరితో వండుకుని తింటారు. ఎగిరే చేపలను పట్టుకున్న వెంటనే తినేయాలట. ఇవి ఎక్కువ దూరం రవాణా చేయడానికి సరిపడవు. ఇతర సముద్ర జీవుల మాదిరిగానే ఇవి కూడా కాంతికి ఆకర్షితం అవుతాయి. అందుకే మత్స్యకారులు లైట్ల వెలుతురులో రాత్రిపూట వేట కొనసాగిస్తారు.

విద్యుత్ రంగంలో అభివృద్ధి వీచిక

ఆర్డీఎస్ఎస్ ద్వారా దాదాపు రూ.11 వేల కోట్ల పెట్టుబడి

- విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- దీన్లో 60 శాతాన్ని కేంద్రం నుంచి గ్రాంట్‌గా పొందే అవకాశం
- వినియోగదారులకు అత్యంత నాణ్యమైన విద్యుత్ సరఫరా
- 30 ఏళ్లు వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్‌కు భరోసా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు అత్యంత నాణ్యమైన సేవలను అందించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు రూ.11 వేల కోట్ల పెట్టుబడితో పునరుద్ధరించబడిన పంపిణీ రంగం స్కీం (రీవేంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం – ఆర్డీఎస్ఎస్)ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్‌గా పొందే అవకాశం ఉంది. ఈ పథకం రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి, నష్టాలను తగ్గించడానికి, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడుతుంది. విద్యుత్ సంస్థలను మరింత పటిష్టం చేయడం ద్వారా అన్ని కేటగిరీల వినియోగదారులకు అత్యంత నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు భరోసా

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని వచ్చే 30 ఏళ్ల పాటు కొనసాగించాలని, పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి వివిధ దశల్లో మొత్తం ఏడువేల మెగావాట్ల సౌరవిద్యుత్‌ను అత్యంత చౌకధరకే.. అంటే యూనిట్ రూ.2.49కే కొనుగోలు చేసి అందుబాటులోకి తెచ్చి రాష్ట్రంలోని దాదాపు 18 లక్షల మంది రైతులకు సరఫరా చేయనుంది. మొదటి విడతలో 2024 సెప్టెంబర్ నుంచి మూడువేల మెగావాట్లు, రెండో విడతలో 2025 సెప్టెంబర్ నుంచి మూడువేల మెగావాట్లు, మూడో విడతలో 2026 సెప్టెంబర్ నుంచి 1000 మెగావాట్లు చొప్పున సౌర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. ఇందుకు అవసరమైన ఫీడర్లను ఏర్పాటు చేయడానికి ఆర్డీఎస్ఎస్ ద్వారా పనులు చేపట్టారు. ఇందుకోసం దాదాపు రూ.1,700 కోట్లు వెచ్చిస్తున్నారు.



కొత్త సబ్ స్టేషన్లు

రాష్ట్రంలో 132 కేవీ, 220 కేవీ సబ్‌స్టేషన్లను దాదాపు రూ.300 కోట్లతో నిర్మిస్తున్నారు. 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లలో దాదాపు రూ.1,700 కోట్ల విలువైన 25 అభివృద్ధి పనులకు ఏపీ ట్రాన్స్‌కో ప్రణాళిక రూపొందించింది. ఏపీ ట్రాన్స్‌కోలో మూడుశాతం ఉన్న విద్యుత్ ప్రసార నష్టాలను గతేడాది 2.8 శాతానికి తగ్గించారు. ఈ పనులు పూర్తయితే రానున్న పదిహేనేళ్లకు అవసరమైన విద్యుత్ నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుంది. నష్టాలు మరింతగా తగ్గి విద్యుత్ వ్యవస్థ మెరుగుపడుతుంది.

డైరెక్టర్ పదవి నుంచి రాజపుత్ర రజని తొలగింపు

ఓ కేసులో అరెస్ట్ కావడంతో ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, అమరావతి: ఏపీ బొందిలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ(కార్పొరేషన్) డైరెక్టర్ పదవి నుంచి రాజపుత్ర రజనీని ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. బెంగళూరు నగరంలోని సుబ్రమణ్యపుర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఆమెను కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆమెను డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వడివడిగా విలేజ్ క్లినిక్ భవన నిర్మాణాలు

రాష్ట్రవ్యాప్తంగా 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	రూ.1,692 కోట్లతో నిర్మాణాలు, పాతవాటికి మరమ్మతులు	వీటిద్వారా గ్రామాల్లోనే 12 రకాల వైద్యసేవలు, 14 వైద్యపరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల భవనాల నిర్మాణం వడివడిగా కొనసాగుతోంది. గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను చేరువచేయడంలో భాగంగా ప్రభుత్వం 2,500 జనాభాకు ఒకటి చొప్పున మొత్తం 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను నెలకొల్పింది. 8,317 క్లినిక్‌లకు కొత్తగా భవనాలు నిర్మిస్తోంది. మిగిలినవాటికి ఇప్పటికే ఉన్న భవనాలకు మరమ్మతులు చేసింది. ఇందుకోసం నాడు–నేడు కింద రూ.1,692 కోట్లు ఖర్చు చేస్తోంది. మరమ్మతులు పూర్తయిన భవనాలు వినియోగంలోకి వచ్చాయి. నిర్మాణం చేపట్టిన 8,317 క్లినిక్ భవనాల్లో 2,076 భవనాల నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయిన వాటిలో ప్రకాశం జిల్లాలో 218, తూర్పుగోదావరిలో 169, విశాఖపట్నంలో 153, వైఎస్సార్‌లో 127, అనంతపురంలో 124 ఉన్నాయి. 1,318 భవనాలు ఫినిషింగ్ దశలో ఉన్నాయి. 958 పైకప్పు పూర్తయిన దశలో, 1,146 పైకప్పు, 1,726 బేస్‌మెంట్ దశలో, మిగిలినవి బిలో బేస్‌మెంట్ దశలో ఉన్నాయి. వీటినైంతత్వరగా భవనాల నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి 'సాక్షి'తో చెప్పారు.

సేవలు ఇప్పటికే ప్రారంభం

ఓ వైపు పక్కా భవనాల నిర్మాణం చేపడుతూనే తాత్కాలిక భవనాల్లో ప్రభుత్వం సేవలు ప్రారంభించింది. నిర్మాణాలు పూర్తయినచోట కొత్త భవనాల్లో సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. వీటిలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)లను ప్రభుత్వం నియమించింది. విలేజ్ క్లినిక్‌లలో గర్భిణులు, మాత, శిశుసంరక్షణ, ఎన్‌సీడీ–సీడీ స్క్రీనింగ్ వంటి 12 రకాల వైద్యసేవలు ప్రజలకు అందుతున్నాయి. 14 రకాల వైద్యపరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. టెలీమెడిసిన్ హబ్స్‌కు విలేజ్ క్లినిక్స్‌ను అనుసంధానించడం ద్వారా ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యుల సేవలు అందుతున్నాయి.

శభాష్.. ఏపీ పోలీస్

ప్రజల విశ్వాసం, సమర్థత, నిజాయితీలలో దేశంలోనే మొదటిస్థానం కేంద్ర ప్రభుత్వ సర్వే వెల్లడి	పోలీసులపై ప్రజల విశ్వాసంలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలు..	పోలీసుల సమర్థతలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలు	నిజాయితీలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన రాష్ట్రాలు..
	1) ఆంధ్రప్రదేశ్	1) ఆంధ్రప్రదేశ్	1) ఆంధ్రప్రదేశ్
	2) తమిళనాడు	2) తెలంగాణ	2) ఉత్తరాఖండ్
	3) తెలంగాణ	3) గుజరాత్	3) తెలంగాణ
	4) గుజరాత్	4) హిమాచల్ ప్రదేశ్	4) గుజరాత్
	5) ఢిల్లీ	5) జార్ఖండ్	5) ఢిల్లీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర పోలీసుల సమర్థతకు జాతీయ స్థాయిలో మరోసారి విశేష గుర్తింపు లభించింది. ప్రజల విశ్వాసం, సమర్థత, నిజాయితీలలో దేశంలోనే రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో నిలిచారు. అదీ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో రాష్ట్ర పోలీసు శాఖ కీలకమైన మూడు అంశాల్లో అగ్రస్థానంలో నిలవడం విశేషం. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల అన్ని రాష్ట్రాల డీజీపీలతో ఢిల్లీలో సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా పోలీసుల పనితీరుపై నిర్వహించిన సర్వే వివరాలను ఈ సదస్సులో వెల్లడించారు. పోలీసులపై ప్రజల విశ్వాసం, సమర్థత, నిజాయితీ అంశాల్లో నిర్వహించిన ఈ సర్వేలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్న రాష్ట్రాల జాబితాను విడుదల చేశారు. కీలకమైన మూడు అంశాల్లోనూ ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ మొదటిస్థానంలో నిలవడం విశేషం. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన సర్వే ఫలితాలిలా ఉన్నాయి..

ఇది సమష్టి కృషి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసు శాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు అందరి సమష్టి కృషితోనే ఈ ఘనత సాధ్యమైంది. రాష్ట్రం గర్వపడేలా అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ

రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పోలీసు శాఖలో వినూత్న సంస్కరణలు చేపట్టింది. సమూల మార్పులతో వ్యవస్థాగతంగా పోలీసు శాఖను బలోపేతం చేసింది. దీంతో ప్రజలకు పోలీసు శాఖపై విశ్వాసం పెరిగింది. అందుకే మహిళా భద్రత కోసం ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను 1.7 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితంగా ఆధారాలు సేకరించి దోషులను గుర్తించి నేరాన్ని నిరూపిస్తున్నారు. దీంతో దోషులకు శిక్షల శాతం పెరిగింది. ఇది పోలీసుల సమర్థతను పెంపొందించింది. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాలు, సత్వర స్పందన, క్రమశిక్షణలతో పోలీసు శాఖ పనితీరు మెరుగైంది. ఫలితంగా నిజాయితీ, చిత్తశుద్ధితో సేవలు అందించడంలో రాష్ట్ర పోలీసులు దేశంలోనే మొదటిస్థానంలో నిలిచారు. పోలీసు సేవలకు సంబంధించి దేశస్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని, పోలీసు యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు.

తెలంగాణ

చెడు కొవ్వుతో చేటు

- గుండె జబ్బులు పెరిగిపోతున్నాయంటున్న డబ్ల్యూహెచ్‌ఓ
- మధుమేహం, రక్తపోటు లాంటి జబ్బులకూ టీఎఫ్ఏ దోహదం
- ప్రపంచంలో జరిగే మరణాల్లో 60 శాతం గుండెపోటు మరణాలే
- వంటనూనెలు, వేపుళ్లు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్
- 2019లో భారత్‌లో 1.44 లక్షల మంది మృత్యువాత
- 2022 జనవరి నుంచి దేశంలో టీఎఫ్ఏ పూర్తిస్థాయి నియంత్రణ

సాక్షి, హైదరాబాద్: చెడు కొవ్వుతో గుండె జబ్బులు పెరిగిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ (టీఎఫ్ఏ) ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల వినియోగం వల్ల గుండె రక్తనాళాల్లో చెడు కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది. దీంతో గుండెపోటు వచ్చే ప్రమాదాలు ఉంటాయి. ప్రపంచంలో జరిగే మరణాల్లో 60 శాతం గుండెపోటు మరణాలేనని స్పష్టం చేసింది. 2019లో ప్రపంచ వ్యాప్తంగా అనారోగ్యకర ఆహారం వల్ల 80 లక్షల మంది చనిపోయారని పేర్కొంది. భారత్‌లో 2019లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఆ ఏడాది 1.44 లక్షల మంది టీఎఫ్ఏ అధిక వాడకం వల్ల చనిపోయారు. ఆగ్నేయ ఆసియా దేశాల్లో టీఎఫ్ఏ అధిక వినియోగం వల్ల జరిగిన 1.78 లక్షల మరణాల్లో 80 శాతం భారత్‌లోనే సంభవించాయి. యూరప్‌లో 1.25 లక్షల మంది టీఎఫ్ఏ అధిక వినియోగం వల్ల చనిపోయారు. 2022లో నిర్వహించిన పరిశోధనలో ఉజ్బెకిస్తాన్ జనాభాలో 12 శాతం మందికి గుండె జబ్బులు ఉన్నాయని తేలింది. ప్రపంచంలో టీఎఫ్ఏ కారణంగా సంభవించే గుండెపోటు మరణాల్లో ఈజిప్ట్ మొదటి స్థానంలో ఉండగా, భారత్ 11వ స్థానంలో ఉంది.

ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ అంటే...

ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ (టీఎఫ్ఏ) అంటే మనం తీసుకునే ఆహారం వల్ల ఏర్పడే కొవ్వు ఆమ్లాలు. ఇది చెడు కొవ్వు. అంటే ఇది ఆరోగ్యానికి హానికరమన్నమాట. గ్రాము ట్రాన్స్ ఫ్యాట్‌లో 9 కేలరీలుంటాయి. ఆహారంలో ఎక్కువగా ట్రాన్స్ ఫ్యాట్ ఉంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ట్రాన్స్ ఫ్యాట్స్ రక్తనాళాల్లో కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. తద్వారా గుండె జబ్బులు సంభవిస్తాయి. వంట నూనెలు, వేపుళ్లు, ప్యాక్ చేసిన లేదా శుద్ధి చేసిన ఆహారాల్లో టీఎఫ్ఏ ఉంటుంది. కేకులు, కుకీలు, కూల్‌డ్రింక్స్ వంటి వాటిల్లోనూ ఉంటుంది. బరువు పెరుగుతారు. గుండె జబ్బులతో పాటు మధుమేహం, రక్తపోటు ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరానికి ట్రాన్స్ ఫ్యాట్ అవసరం లేదు. దాన్ని నివారించాల్సిందే. ప్రతి వంద గ్రాముల ఫ్యాట్‌లో రెండు శాతానికి మించి, కేలరీల్లో 0.5 శాతానికి మించి ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్స్ ఉండకూడదని డబ్ల్యూహెచ్‌ఓ స్పష్టం చేసింది.

ఈ ఏడాది చివరకు టీఎఫ్ఏను పూర్తిగా నియంత్రించాలి

ప్రపంచంలో 60 దేశాలు టీఎఫ్ఏ నియంత్రణ పరిధిలోకి వచ్చాయి. గతేడాది జనవరిలో భారతదేశం టీఎఫ్ఏ నియంత్రణను అమలులోకి తీసుకొచ్చింది. అన్ని దేశాల్లోనూ ఈ ఏడాది చివరికల్లా టీఎఫ్ఏను నియంత్రించాలని డబ్ల్యూహెచ్‌ఓ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ ప్రకారం పాక్షికంగా శుద్ధిచేసిన వంట నూనెలను నిషేధించాలి. పూర్తిగా శుద్ధి చేసిన నూనెలను వాడాలి. ఆహార పదార్థాల్లో టీఎఫ్ఏ ఎంత శాతం ఉందో ప్యాకెట్లపై ముద్రించాలి. నూనె, కొవ్వు వినియోగాన్ని తగ్గించాలి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943